# అయన తోటలో



ఏబెల్ దంపతులు

రచయిత్రి

ప్రిసిల్లా క్రిసోస్టమ్

# దేవునికి మహిమ


మేరీ ప్రిసిల్లా
రచయిత్రి



ది లేమెన్స్ ఇవాంజిలికల్ ఫెలోషిప్
మల్కాపట్నం
మచిలీపట్నం – 521001
(ఆం. ప్ర )

# మా తల్లితండ్రుల జీవితం, మరియు వారు చేసిన క్రైస్తవ సేవ యొక్క క్లుప్త సమాచారం


**శ్రీమతి. & శ్రీ. జీ. ఏబెల్**

(1930 – 2004)



దిలేమెన్స్ ఇవాంజిలికల్ ఫెలోషిప్

మల్కాపట్నం

మచిలీపట్నం – 521 001

ఆంధ్ర ప్రదేశ్

ఇండియా

## రచయిత్రి తొలిపలుకులు

ఈ పుస్తకం ద్వారా మా తల్లితండ్రుల జీవితాలను గురించి, వారు క్రీస్తు సేవకులు గా చేసిన సేవను గురించి క్లుప్తం గా వివరించాను. యవ్వన దశలో వారు తమ జీవితాలను దేవుని చిత్తానికి సమర్పించుకున్నప్పుడు దేవుడు వారికి తమతమ సొంత ఆత్మీయ జీవితాలను దేవుని భయభక్తులతో కట్టుకోటం నేర్పించటమే కాకుండా, యేసు క్రీస్తు రాజ్య సువార్తను ఇతరులకు కూడా ప్రకటించే విధం గా వారిని మార్చాడు.

ఒక విద్యార్థిగా మా తండ్రి జీవితాన్ని మార్చిన తర్వాత దేవుడు, అయన పెద్దవారైన ఇతర దైవ సేవకుల జీవితాలనుండి అనేక విషయాలను నేర్చుకుంటూ దేవుని పిల్లల ప్రార్థనలను, వారి సలహా లను ఏ విధం గా పొందుతూ, అనుసరించాలో నేర్పించాడు. ఇక తాను హాజరైన క్రైస్తవ కూటము తో విసుకు చెంది తిరిగి తన గ్రామానికి వెళ్లిపోవాలని తన బ్యాగేజి తో బస్సు కోసం నిలబడి వేచి చూస్తున్న మా అమ్మ, ఆ సమయం లో కూటం యొక్క ప్రాంగణం నుండి వినబడే ఒక సామాన్య సేవకుని పాటద్వారా ఆత్మ లో కదిలింపబడి, తిరిగి కూటము లోనికి వెళ్లి కూర్చొని వాక్యం వినటం ద్వారా లోతుగా గ్రహింప చెయ్యబడి, రక్షణ నొంది, ఆ తర్వాత దేవుని సేవలో బహుగా వాడబడటం చూసినప్పుడు, ఆమె పట్ల దేవుని యొక్క అద్భుతమైన సంకల్పము అర్థం చేసుకోగలము .

మా తల్లితండ్రుల వివాహ అనంతరం దేవుడు వారికి తన సన్నిధి లో వేచిఉండి, తమ సొంత విషయాల లోనూ, సేవ విషయాలలోనూ అయన వాగ్దానాలపై ఆధారపడి ముందుకు సాగటము నేర్పించాడు. వివాహానంతరం ముప్పై సంవత్సరాలపాటు దేవుడు వారిద్దరినీ ప్రతిఒక్క అడుగు లోనూ నడిపిస్తూ, ఆత్మీయం గా బలపడి, అయన దృష్టిలో దీన దైవసేవకులు గా ఎదుగునట్లు నడిపించాడు. వారి సేవలో రక్షణానుభవము పొందిన అనేకమంది - వారే, ఆ పిమ్మట ఆత్మలను రక్షించే సువార్తికులు గా ఎదుగునట్లు దేవుడు సహాయం చేసాడు. వారి సేవ అనేక విధాలు గా కొనసాగినప్పటికీ, దేవుడు వారిని ప్రధానం గా యవ్వనస్థుల సేవలో ఎక్కువగా వాడుకున్నాడు. ఆ దినాలలో ఒక నూతన యవ్వనస్థుల గుంపు మా సంఘానికి ప్రతి సంవత్సరం చేర్చబడుతూ వుండేవారు.

1982 లో ప్రభువు సనిధి కి మా నాన్న తీసుకొనబడిన తర్వాత, మా తమ్ముడైన వెస్లీ, మా నాన్నను ప్రభువు యొద్దకు నడిపించిన అయన చిన్నాయన, చిన్నమ్మ గార్ల యొద్దకు వెళ్లి నప్పుడు, మా నాన్న గారి జీవితం, సేవ ల గురించి సంక్షిప్తం గా ఒక పుస్తకము రాసే ఆలోచనను గురించి మా నాన్న గారి చిన్నమ్మ అయిన గంటా సంతోషమ్మ గారు వెస్లీ తో ప్రస్తావించారు. తర్వాత గంటా సంతోషమ్మ గారి తమ్ముడూ, మా నాన్న గారికి మంచి మిత్రుడైన కె. జీవానందం గారు సహా ఇదే విషయాన్ని ప్రస్తావించారు. అయితే, ఆ సమయం లో మేము దానిపై అంత శ్రద్ధ చూపకపోవటం వల్ల ఆ పని ఆచరణ లో పెట్టలేదు.

ఆ తర్వాతి కాలం లో మా ఇంటికి వచ్చిన ప్రతిఒక్కరూ మా నాన్న ఇచ్చిన ప్రసంగాల క్యాసెట్ల కోసం అడుగుతూ వుండేవారు. అయితే ఆ రోజుల్లో ప్రధానంగా లౌడ్ స్పీకర్ ల వద్ద కూర్చొని రికార్డ్ చేసిన ప్రసంగాల రికార్డింగ్ నాణ్యత సరిగా లేకపోవటం వల్ల, ఒక నాలుగైదు ప్రసంగాలు వున్నా, అవి ఎవరికైనా ఇచ్చేందుకైనా మేము ధైర్యం చెయ్యలేక పోయాం. దానితో కనీసం అయన చేసిన ప్రసంగాలు అయినా వ్రాసి ప్రింట్ చేస్తే ఎలా వుంతుంది? అనే ఆలోచన కలిగినా, అది కూడా కార్యరూపం దాల్చలేదు.

మా నాన్న ప్రభువు సన్నిధిలోనికి పిలువబడిన తర్వాత, మా అమ్మ మరో ఇరవైరెండు సంవత్సరాల వరకూ (అంటే, ప్రభువు యొద్దకు 2004 లో ఆమె సహితం పిలువ బడే వరకూ), అంతకు పూర్వం ఆమె కుఏ మాత్రం అనుభవం లేని ఎన్నో విషయాలలో మరిన్ని క్లిష్టమైన సవాళ్ళను ఎదుర్కొంటూ, మరెన్నో క్లిష్టమైన బాధ్యతలను ఆమె సేవలో నిర్వర్తించవలసి వచ్చింది. అప్పటి దినాలలో ప్రారంభమై కొనసాగుతున్న సేవలో నూతనం గా వచ్చే విశ్వా సులకు అంతకు పూర్వం జరిగిన సేవకు సంబంధించిన ఏ విషయాలూ తెలియకుండా పోయాయి. దానితో ఈ పుస్తక రచన గురించి కాస్త తీవ్రం గా లోచించటం ప్రారంభించాం, కానీ పని ప్రారంభించలేదు. ఇక మా అమ్మ కూడా 2004 లో ప్రభువు సన్నిధి లోనికి వెళ్ళిపోవటం తో ఈ పనిని తప్పని సరిగా ప్రారంభించి ముగించాము.

ఈ పుస్తకం ఇప్పటికి రెండుసార్లు తెలుగు లోను, ఒకసారి ఇంగ్లీష్ లోను ముద్రించబడింది. ఎప్పుడు ఏ భాషలో ముద్రించ బడినా, ముందున్న ప్రచురణ లను తగిన విధం గా నవీకరిస్తూ వున్నాం. ఈ పుస్తకం - క్రీస్తు ప్రభువు మానవ జీవితాలను

మార్చగలడా? అనే సందేహంకలిగి, మన దయనందిన జీవితం లో అయన విశ్వనీయతను అనుమానించే వారి సందేహాలను నివృతి చేస్తుంది అని మా గట్టి నమ్మకం.

మొదటినుండి చివరి వరకూ ఈ పుస్తక ప్రచురణ లో నాతో వెన్నంటి అండగా నిలిచిన నా భర్త, జాన్ క్రిసోస్టమ్ గారికి నా హృదయపూర్వక వందనాలు. అదే విధం గా ఇతర అన్ని విషయాలలో సహాయపడిన ప్రతి ఒక్కరికీ మా వందనాలు. నిత్యజీవితం లో, ఆచరణలో యేసు క్రీస్తు యొక్క విశ్వసనీయతను తెలుసుకోవాలని ఆశించి, ప్రయత్నించగోరే ప్రతిఒక్కరికీ ఈ పుస్తకం సవాలు కరం గా ఉంటుంది అనటం లో మాకు ఏ సందేహమూ లేదు.ఈపుస్తకాన్ని మెరుగు పరిచే సలహాలు ఎప్పుడూ హృదయపూర్వకంగా ఆహ్వానించ బడతాయి.

దేవుడు మీ జీవితాలను అయన నామఘనత నిమిత్తమై ఆశీర్వదించును గాక!

శ్రీమతి. ప్రిసిల్లా క్రిసోస్టమ్
సెప్టెంబర్ 10, 2022

# విన్నపము

ఈ పుస్తకం లో ఎన్నో సార్లు 'మా నాన్న,' 'మా అమ్మ,' 'మా తల్లితండ్రులు' అనే పదాలు కనిపిస్తాయి. వారి జీవితానికి,సేవకు సంబంధించిన విషయాల గురించి వ్రాయటం వల్ల అలా వ్రాయక తప్పలేదు. వారు తమ జీవితాలను సంపూర్ణం గా దేవుని చిత్తానికి సమర్పించుకున్నప్పుడు, వారిని దేవుడే వాడుకుంటూ వారి ద్వారా తన నామ మహిమార్థమై ఇక్కడ చెప్పబడిన విషయాలు అన్నీ జరిగించాడు.

ఈ పుస్తకం వ్రాయటం లో నా ఉద్దేశ్యం, ధ్యేయం - సర్వ ఘనత, మహిమ కేవలం దేవునికి చెల్లాలి అనేదే తప్ప, మా తల్లితండ్రుల నైనా, మరెవ్వరినైనా

పొగడాలి అని కాదు.

మీ అవగాహన కు వందనాలు.

ప్రిసిల్లా క్రిసోస్టమ్

# విషయం సూచిక


బ్రదర్ జి. ఏబెల్

1.1. బాల్య జీవితం

1.2. రక్షణానుభవం

1.3. మొదటి మెట్టు

1.4. ప్రభువు సేవ నిమిత్తమై పిలుపు

శ్రీమతి జి. పద్మా ఎబెల్ గారు

2.1. బాల్య జీవితం

2.2. ప్రభువును స్వరక్షకునిగా అంగీకరించుట

వివాహం - దేవుని చిత్తం చేయుట

కుటుంబం మరియు దైవసేవ

4.1 దీన ప్రారంభము

4.2 ప్రార్థనా స్థలము మార్చుట

4.3 ప్రారంభం లో మా తల్లితండ్రుల స్నేహితులు, కొన్ని కుటుంబాలు

4.3.1 డేవిడ్ గారు

4. 3. 2. హైనీ అమ్మగారు

4.4 విశ్వాస పాఠాలు

4.4.1 నిజ జీవితం లో విశ్వాసాన్ని సార్థకం చేసుకోటం

4.4.2 నా మోకాలుకు ఆపరేషన్ - దేవుని పై ఆధారపడటం

4.5 మా నివాసాన్ని చర్చ్ కాంపౌండ్ కు మార్చుట

# విషయం సూచిక


4.6 సేవలో జరిగిన ఇంకొన్ని సంఘటనలు

4.7 ప్రార్థన కూటాలకు హాజరు కావటం వల్ల హింసింపబడిన సంఘ సభ్యులు - శ్యామలమ్మ

పిల్లలను పెంచటం

5.1 కుటుంబ ప్రార్థన

5.2 క్రమశిక్షణ

5.3 పిల్లల విషయం లోజాగ్రత్త

5.4 డబ్బు పొదుపుగా వాడటం

5.5 వృత్తరాలతో సంబంధం కొనసా గించుట

5.6 పిల్లల ఆత్మీయ మేలుకొలుపు నిమిత్తం ప్రార్థించటం

5.7 తమ పిల్లల విషయాలలో ప్రార్థించి నిర్ణయాలు తీసుకోటం

యవనుల మధ్య సేవ

6.1 యవ్వన విశ్వాసులు - క్రమ శిక్షణ

6.2 కౌన్సిలింగ్

6.3 తప్పుబాట పట్టి జారిన ఆత్మలను ప్రేమతో తిగిరి పొందుట

6.4 ప్రార్థన యొక్క ప్రాముఖ్యత

6.5 ఉత్తర ప్రత్యుత్తరాలు

సండే స్కూల్

7.1 ప్రారంబం

# విషయం సూచిక


7.2 సండేస్కూల్ - స్థల మార్పు

7.3 సండే స్కూల్ ని బ్యాచ్ లు గా విడకొట్టటం

7.4 మొదటి సండేస్కూల్ క్రిస్మస్ నాటిక

చర్చ్ విస్తరణ

8.1 చర్చ్ స్థలాన్ని కొనుగోలు చేయుట

8.2 నూతన చర్చ్ నిర్మాణం - 1973

8.3 చర్చ్ పక్కనున్న స్థలం కొనుగోలు చేయుట

మరణము - తుఫానులు

9.1 దుఃఖాన్ని దిగమింగుట

9.2 ప్రకృతి వైపరీత్యాలు - విశ్వాసం సార్ధకం చేసికొనుట

9.2.1 1968 లో తుపాను

9.2.2 1976 లో తుఫాను

9.2.3 ఉప్పెన - 1977

9.2.4 1979 మే నెలలో తుఫాను

9.2.5 1990 లో తుపాను

చెన్నై లో రిట్రీట్లు

10.1 చెన్నై లో ఎల్ ఈ ఎఫ్ వారు నిర్వహించే రిట్రీట్ లకు హాజరు కావటము

10.1.1 వర్షాంతర రిట్రీట్లు

# విషయం సూచిక


10.1.2 విద్యా ర్థుల రిట్రీట్లు

పరిసర ప్రాంతాల్లో సువార్త

11.1 సువార్త చేరని ప్రదేశాలకు సువార్తను చేరవెయ్యటం

11.1.1 పరిసర ప్రాంతాలు, జిల్లాలలో సేవ

11.1.2 తరుణములు పోగొట్టుకొనకుండా సేవ చేయుట

11.2 చిన్న పరికరాలే - కానీ సేవలో ఎంతో ఉపయోగం

దైవ కృప

12.1 పొరుగువారితో సంబంధాలు

12.2 నేర్చుకునే మనస్సును కాపాడు కొనుట

12.3 ప్రవచన వరము

12.4 దేవుని కాపుదల పిచ్చుక పై సహితం నిలిచి వుంది

12.4.1 దేవుని కాపుదల

12.4.2 బెదిరింపులు, అవమానాలు ఎదుర్కొనటం

12.4.3 దేవుని చిత్తానికి లోబరుచుకొనుట

ఏబెల్ దంపతుల 25 వ వివాహ వార్షికోత్సవం - జూన్ 1981

వెస్లీ సాక్షం (తన సొంత మాటల్లో)

ఏబెల్ గారి ప్రభువు పిలువు

15.1. ముందే ఎరుగుట

15.2. ఏబెల్ గారు తన నిత్య నివాసము చేరుట

# విషయం సూచిక

15.3. మా అవసరత లో సాటిలేని సహాయం

పద్మా ఎబెల్ గారి సేవ

పద్మా ఎబెల్ గారి ప్రభువు పిలుపు

17.1 వెస్లీ కి చివరి వీడుకోలు

17.2 తిరిగి మనమంతా కలుసుకునే వరకూ....

ఏబెల్ దంపతులు ఇచ్చిన కొన్ని ప్రసంగాలు

18.1 ఏబెల్ గారి ప్రసంగం - 1. పరలోక ప్రార్థన

18.2 ఏబెల్ గారి ప్రసంగం - 2. ప్రార్థించుట

18.3 ఏబెల్ గారి ప్రసంగము - 3. మనస్సును స్వాధీనపరచుకొనుట

18.4 శ్రీమతి. పద్మా ఏబెల్ గారి ప్రసంగము

కొందరి అభిప్రాయాలు

19.1 రెవ. డా. విట్సన్ పాల్ గారు:

19.2 ఆర్. ఏ. సుందర్రావు గారు:

19.3 జీ. ఎస్. నాతనియేల్ గారు:

19. 4 శ్రీమతి. పురుషోత్తం గారు:

19.5 జీ. డేవిడ్ గారు:

19.6 పుష్పరాజ్ గారు:

19.7 జాన్ క్రిసోస్టమ్ గారు:

19.8 జీ. జీవరత్నం గారు:

# విషయం సూచిక

19. 9 ఏ. డేవిడ్ రాజు గారు:

19.11 బీ. నోబుల్ గారు:

19.12 డీ. పాల్ గారు:

19.13 బ్రదర్. యేసుపాదం గారు:

19.14 ఎల్. జయరాజ్ గారు:

19.15 బీ. సత్యనారాయణ గారు:

19.16 జీ. సుకాంత్:

# Dedicated

To my nephew

*(late) Ronald J. Abel*

# 1

# బ్రదర్ జి. ఏబెల్

## 1.1. బాల్య జీవితం

ఆనాటి వుమ్మడి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణా జిల్లా దావులూరు లో మా నాన్న జన్మించారు. వారి తల్లి తండ్రులకు ఎనిమిది మంది సంతానం! ఈయన వరుస క్రమం లో మూడవ వారు, మగపిల్లలలో రెండవవారు. మా ముత్తాత గారి కాలం నుండి వీరు క్రైస్తవులైనా, ఆనాటి రోజుల్లో బాప్టిస్ట్ సంఘానికి చెందిన ఒక నామకార్ధ క్రైస్తవ కుటుంబం గా మాత్రమే వీరి కుటుంబం వుండేది. మా తాత గారు క్రమశిక్షణ విషయం లో కఠినం గా వుండినా ఆ పల్లెటూరి లో ఈ పిల్లలు మాత్రం పెద్ద దైవభయం ఏమి లేకుండా పెరగటం తో నాస్తిక సిద్ధాంతాల వైపు మా నాన్న క్రమ క్రమంగా ఆకర్షించ బడ్డారు.

డ్రామాలలో నటించే ఆసక్తి మా నాన్న కు వుండేది, హై స్కూల్ ఫైనల్ పరీక్షల రోజుల్లో సహితం డ్రామాల్లో నటించే ఆయన ఆసక్తి వల్ల, సరైన సమయాన్ని కేటాయించక పోవటం వల్ల చదువు లో వెనుక బడటం జరిగింది.

హై స్కూల్ విద్య ముగించి వేరే జిల్లా లో సివిల్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్స్ లో పాలిటెక్నిక్ లో ప్రవేశం పొందటం, ఇక దాని వల్ల దొరికిన స్వేచ్ఛ స్వాతంత్ర్యం వల్ల సినిమాలు చూడటం, సిగరెట్లు తాగటం, చెడు సహవాసాలు చెయ్యటం వంటివి అలవాటయ్యాయి.

## 1.2. రక్షణానుభవం

మా తాత గారైన గంటా సామ్యేల్ గారికి గంటా జాన్ గారు తమ్ముడు, ఆయన ఒక హెడ్ మాస్టర్ గారు. జాన్ గారు, ఆయన సతీమణి అయిన గంటా సంతోషమ్మ గారు ప్రభువును ఎరిగిన వారై తమకున్న ఎనమండుగురు పిల్లలతో మంచి కుటుంబ జీవితం కలిగిన వారు. ఆ సమయం లో వారి దగ్గర ఒక పాత సైకిల్ వున్నా విషయం గుర్తొచ్చిన మా నాన్న దానిని వాడుకునేందుకు తెచ్చుకునేందుకు వారి ఇంటికి వెళ్లారు.

వారి సంభాషణ ‘దేవుడు, మనిషి జీవితం లో దేవుని ఆవశ్యకత’ అనే టాపిక్ వైపుకు మళ్లటం తో - జాన్ తాత, సంతోషం నానమ్మ లకూ - మా నాన్నకు మధ్య ఒక ఆసక్తి కరమైన సంవాదం (discussion) జరిగింది. మా జాన్ తాత, సంతోషం నానమ్మ లు జీవితం లో ప్రతి ఒక్కరు దేవుని ఆవశ్యకతను గుర్తించాలని వాదిస్తుంటే.... మా నాన్న అలాటిది అంతా భ్రమ అని, అసలు దేవుడే లేడు అని వాదించారు. దానికి మా సంతోషం నానమ్మ క్రీస్తు ప్రభువు మాత్రమే దేవుడి కుమారుడు, ఆయన మానవ అవతారం లో భూమికి దిగి వచ్చిన దేవుడు అని వాదించటం తో, మా నాన్న లోకం లో దైవావతారాలు గా కొలువ బడే బుద్ధుడు, కృష్ణుడు ఇలాటి వారంతా వున్నారు. వారెవ్వరూ కాకుండా ఒక్క యేసు క్రీస్తు మాత్రమే ఎలా లోక రక్షకుడు కాగలడు? అని తీవ్రం గా వాదించారు. దానికి స్పందిస్తూ మా సంతోషం నానమ్మ - క్రీస్తు ప్రభువు ఒక్కడే పాపుల కొరకు ప్రాణం పెట్టిన వాడు కాబట్టి ఆయనే దేవుడు అని చెప్పారు. ఇది సబబు గా భావించని మా నాన్న ఒక యవ్వనస్తుని యవనేచ్ఛలనుండి క్రీస్తు కాపాడగలడా? అని అడిగితే, తప్పక కాపాడుతాడు అని ఆయన చిన్నమ్మ అన్నారు. అయితే బుద్ధుడు, కృష్ణుడు ఇలాటి

వారంతా కూడా యవ్వనస్తుల యవనేచ్ఛలనుండి కాపాడగలరు అన్నారు.

దీనికి స్పందించిన మా జాన్ తాత - "నీవు ఎవరి ద్వారా ఒక యవ్వనస్తునికి యవనేచ్ఛలనుండి విడుదల కలుగ గలదు అని భావిస్తావో వారిలో ఒక్కొక్కరి పేరున ప్రార్థించి అది వీలవుతుందేమో చూడు; అదే వారి వలన వీలయితే, నువ్వు ఎవరినైతే ప్రార్థించావో వారినే దేవుని గా స్వీకరించు. అయితే ఒక మాట: క్రీస్తు యేసు నామమున తప్ప నువ్వు ప్రార్థించే ఏ ఇతర నామము వల్ల అది సాధ్య పడదు. "నువ్వు ప్రయత్నించు" అని అన్నారు. ఈ వాదన భావ్యం గా కనిపించటం తో మా నాన్న సంతృప్తి చెందారు!

ఇదంతా ముగిసిన తర్వాత మా జాన్ తాత, సంతోషం నానమ్మ - మా నాన్నను "తలవంచు ప్రార్థన చేద్దాం" అని అన్నప్పుడు, పెద్దవారు చెప్పిన మాట చెయ్యక పోతే బాగుండదు అనే ఉద్దేశ్యం తో మా నాన్న తల వంచారు. అయితే వెంటనే ఒక తెలియని గొప్ప శక్తి ఆయనను ఆవరించి ఆత్మీయ గ్రహింపు, పశ్చాత్తాపము లోనికి తోడుకొని పోయింది. వెక్కెక్కి పడి ఏడుస్తూ ఆయన చిన్న నాటినుండి చేసిన తప్పిదాలను,

ఒకదాని తర్వాత ఒకటి గుర్తు వస్తుంటేవాటన్నిటినీ ఒప్పుకొంటూ ప్రార్ధన కొనసాగించారు. నాస్తిక సంబంధమైన తలంపులతో అప్పటి వరకు కొనసాగుతున్న మా నాన్న కు ఇది ఒక తెలియని అనుభవంగా వుండింది. ప్రార్ధన ముగిసింది, కానీ మా నాన్న లో ఏదో కొత్త అనుభవం ఆరంభం అయ్యింది! ప్రార్ధన లో ఆయనను పాశ్చాత్తాపం లోనికి నడిపించిన ఆ దేవుని ఆత్మ ఆయన తోనే వుంటూ ఆయనను సత్య సంబంధమైన జీవితం లోనికి నడిపించటం ఆరంభించింది; దానితో తాను అప్పటి వరకు చేసిన తప్పిదాలను మనుష్యుల తోనూ, దేవుని తోనూ ఒప్పుకొని సరి చేసికొనటం ఆరంభించారు. ఈ విషయాన్ని ఆయన స్నేహితులు, కుటుంబ సభ్యులు సహితం గమనించగలిగారు. ప్రార్ధన లో ;ఎంతో సమయం గడపటం, వాక్య పఠన లో పరిశీలన గా చదవటం అలవాటు గా మారాయి. ఈ అలవాటే ఆయన రాబోయే దినాలలో చెయ్యబోయే దైవ సేవలో కావలసిన పునాది రాళ్లు గా మారాయి. ఈ రకం గా గంటా జాన్ గారు, సంతోషమ్మ గారు మా నాన్న కు కేవలం చిన్నాన్న, చిన్నమ్మ లే కాకుండా - ఆత్మీయ తల్లి తండ్రులు గా కూడా మారారు!

పిమ్మట గంటా జాన్ గారు, సంతోషమ్మ గారు మా నాన్న ను ఆనాటి మద్రాసు (చెన్నై) లోని లేమెన్స్ ఇవాంజిలికల్ ఫెలోషిప్ ను నడిపిస్తున్నా ఎన్. దానియేలు గారి సేవకు పరిచయం చెయ్యటం జరిగింది. వారి పరిచర్య లో మా నాన్న తన ఆత్మీయ జీవితాన్ని స్థిరపరచుకొని సేవకు సిద్ధపడటం జరిగింది.

## 1.3. మొదటి మెట్లు

పాలిటెక్నిక్ విద్య ముగించిన పిమ్మట మచిలీపట్టణం లో పని చేసేందుకు అక్కడకు వెళ్లిన మా నాన్నకు అంతా కొత్త! అయితే ఈయనను ఏమాత్రం ఎరుగని నాతానియేల్ దంపతులు మా నాన్నను సాదరంగా వారి ఇంటికి ఆహ్వానించి, వసతి, భోజన ఏర్పాట్లు వారి ఇంట్లోనే కల్పించారు. మా నాన్న వారి ఇంట్లో ఒక సొంతఇంటి సభ్యునిగా చూచుకొనబడుతూ బందరు (మచిలీపట్టణం) లో తన జీవితాన్ని ప్రారంభించారు. ఈ సమయం లో మా నాన్న - నాతానియేల్ దంపతులు, కుందనం గారు (నాతానియేల్ గారి అత్త గారు), చుట్టూ పక్క నున్న ఇంకొంతమంది సభ్యులతో (తన వుద్యోగం తాను చేసుకుంటూనే)

నతానియేల్ గారి ఇంటి వద్ద మా నాన్నతన ప్రారంభ సేవను ఆరంభించారు.

## 1.4. ప్రభువు సేవ నిమిత్తమై పిలుపు

తన రక్షణానుభవం అనంతరం అలవాటు చేసుకున్న ఒంటరి ప్రార్థన అలవాటు, మా నాన్నకు జీవిత అలవాటు గా మారింది. ఒకానొక రోజు ఆయన తన స్నేహితులతో కలసి మూడు దినములు ఉపవాసం వుండి కొండపైకి వెళ్లి ప్రార్థిస్తూ, ఆయన జీవితం లో దేవుని చిత్తం ఏమై వున్నది? అని ప్రార్థించడం జరిగింది. ఈ సమయం లో ఆయన తన పాలిటెక్నిక్ విద్య అనంతరం రెండేండ్లు పని చేసి, ఆతర్వాత దేవుని సేవలో పూర్తి సేవకుని గా ప్రవేశించటం దేవుని చిత్తం అని తన దర్శనం లో మా నాన్న గ్రహించారు. ఇది తన విద్యాభ్యాసం రోజుల్లో జరిగిన సంఘటన.

ఆయనకు విద్యార్థిగా కలిగిన దర్శనం ను మరువ కుండా మచిలీపట్నం లోని నతానియేల్ దంపతుల తో వుంటూ ఉద్యోగం చేస్తున్న సమయం లో - మా మానాన్న తనకు విద్యార్థిగా నున్న సమయం లో కలిగిన దర్శనాన్ని జ్ఞాపకం చేసికుంటూ దాని

నెరవేర్పు విషయం ప్రార్ధిస్తూ వుండే వారు. తనకు కలిగిన దర్శనం విషయం - ఆరోజుల్లో ఆత్మలో పెద్దలైన ఎన్. దానియేలు గారికి, బొల్లెద్దు జాన్ గారికి తెలియజేసి దాని విషయం ప్రార్థించమని వారిని కోరారు. వారు ప్రార్థనాపూర్వకం గా ఇచ్చిన సలహా మేరకు మా నాన్న తన ఉద్యోగానికి రాజీనామా చేసి, పూర్తి దేవుని సేవ (full time మినిస్ట్రి) లో ప్రవేశించాలి అని నిర్ణయించుకున్నారు.

అయితే ఆ సమయం లో మా నాన్న కు ఇంకా వివాహం కాలేదు; ఇక మా తాత గారైన గంటా సామ్యేల్ గారు అప్పటికే చనిపోయి, కేవలం ఒకరికి మాత్రమే వివాహం కావటం తో మిగిలిన పిల్లలంతా జీవితం లో స్థిరపడని కుటుంబ పోషణ ను గురించి ఆలోచించిన నా నానమ్మ (గంటా మాణిక్యం) మా నాన్నరాజీనామా చేసేందుకు సుముఖత చూపలేదు. ఈ లోకరీతిగా చూస్తే మా నానమ్మ అన్ని విధాలా కరెక్ట్; అయితే దేవుని విషయాలు జరిగేందుకు దేవుడు మనకు వెర్రితనం గా కనిపించే కొన్ని మార్గాలను వాడుకొనవచ్చు అని ఎరిగిన మా నాన్న, తన జీవితం లో దేవుని ప్రణాళిక యొక్క నెరవేర్పు నిమిత్తమై ప్రార్ధించి, ఇలాటి పరిస్థితులలోనే తన ఉద్యోగానికి

రాజీనామాచేసి దేవుని సేవలో అదే వూరు (మచిలీపట్టణం) లోనే తన సేవను కొనసాగించటము కొనసాగించారు.

ఈ ప్రారంభ సేవ తొలి దినాలలో ఆయనను తమ ప్రార్ధనలతో బలపరచిన వారిలో - బ్రదర్ ఎస్. దానియేలు గారు, బ్రదర్ జాషువా డేనియల్ గారు, బ్రదర్ విట్సన్ పాల్ గారు, బ్రదర్ బొల్లెద్దు జాన్ గారు, బ్రదర్ రాజరత్నం గారు, బ్రదర్ భూషణమ్ గారు, బ్రదర్. రాజారత్నం గారు, బ్రదర్ జి. బి. సాలమన్ గారు, బ్రదర్ జయసింగ్ గారు, ఇంకా ఇతరులు వున్నారు.

# 2

# శ్రీమతి జి. పద్మా ఎబెల్ గారు

## 2.1. బాల్య జీవితం

ఆ నాటి వుమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణా జిల్లా వెన్ననపూడి లో మా అమ్మ 1936 లో జన్మించారు. చదువులేని ఆమె తల్లి చిన్న భూమిని సేధ్యం చేసుకుంటూ మా అమ్మను ఒక్కతే బిడ్డ గాపెంచుకున్నారు. మా అమ్మ తన స్వగ్రామం లో ప్రైమరీ విద్య నభ్యసించి సమీపం లో వున్న గుడివాడలో హై స్కూల్ విద్య నభ్యసించేందుకు వెళ్లారు.

మా అమ్మ హిందూ కుటుంబం లో పుట్టి పెరగటం వల్ల ఆ విశ్వాసం ,కట్టుబాట్లు, ఆచారాలు అనుసరిస్తూ గుడివాడ లో చదువు కొనసాగించటం జరిగింది.

స్కూల్ ఫైనల్ లో పాసుకాలేకపోవటం వల్ల, గన్నవరం లో తన మేనమామ, ఆంటీ లతో వుంటూ మా అమ్మ తన టీచర్ ట్రైనింగ్ కోర్స్ చెయ్యటం ప్రారంభించారు. అయితే ఆమె ఆంటీ - మా అమ్మ, వారి ఇంటియొద్దకు వెళ్లి వుండటం ప్రారంభించక ముందే ప్రభువును తెలుసుకున్నా వ్యక్తి! ఆమె మా అమ్మకు, తనతోటి యవన స్త్రీలకు ప్రభువును గురించి, దేవుడు - క్రీస్తును లోకానికి పంపటానికి గల కారణాన్ని తెలియజేస్తూ క్రైస్తవ విశ్వాసం లోని ప్రాధమిక అంశాలన్నీ వీరితో పంచుకునే వారు. ఇదే క్రమం లో లేమేన్స్ ఇవాంజిలికల్ ఫెలోషిప్ ను గురించి కూడా వీరి ఆంటీ గారు ఈ యావన స్త్రీ లకు పరిచయం చెయ్యటం జరిగింది. అవి - ప్రభువు తన దాసులైన దానియేలు గారు, బొల్లెద్దు జాన్ గారు ఇంకా ఇతర సేవకుల ద్వారా తన ఘనమైన సేవను జరిగించుకుంటున్న దినాలు..

## 2.2. ప్రభువును స్వరక్షకునిగా అంగీకరించుట

ఆ దినాలలో మా అమ్మ గారి ఆంటీ గారు, ఈ యవ్వన స్త్రీ లను విజయవాడ కు సమీపం లో గల ఈడ్పుగల్లు అనే గ్రామం లో జరుగుతున్న కూటాలకు హాజరు అవ్వమని ప్రోత్సాహించారు.

సరే, పెద్దవారి మాటకు కాదనలేక వెళ్లిన మా అమ్మ, హిందూమతోన్మాది కావటం తో - కూటము లో కూర్చొని, కూర్చొని ఈ క్రైస్తవ బోధ వినటం సహించక, తిరిగి అక్కడ నుండి వెళ్లిపోయేందుకు సంచి సర్దుకోని కూటం జరిగే ప్రాంగణం నుండి రోడ్డు దాటి బస్సు కోసం వేచి వున్నా సమయం లో - కూటము లో వేదిక నుండి బ్రదర్ జి. బి. సొలొమోను గారు పాడే పాట ఆమె చెవులలో గింగురు మని చొచ్చుకు పోయింది. ఆ పాటలోని మాటలు వింటుంటే సాక్షాత్తూ దేవుడే ఆమెతో వ్యక్తిగతం గా మాట్లాడుతున్నాడా? అని ఆమెకు పించింది. ఆ సమయం లో ఏదో తెలియని శక్తి మా అమ్మను ఆవరించటం వల్ల తన మనస్సు మార్చుకొని తిరిగి కూటము లోనికి వెళ్ళి కుర్చోని వాక్యం వినాలనిపించి తిరిగి వెళ్లారు. కూటము లో కూర్చోని వింటున్న సమయంలో దేవుని ఆత్మ ఆమెను బలం గా ఆవరించి ఆమె హృదయ స్థితిని ఆమెకు గ్రహింపు చేస్తూ, దేవుని సన్నిధిలో ఆమె ఎలా వున్నారో తెలియజేస్తూ, పశ్చాత్తాపం కలిగించటం ప్రారంభించింది. దీనితో ఆమె తన బాల్యం నుండి చేసిన తప్పిదములన్నీ ఒక్కొక్కటి జ్ఞాపకమునకు వస్తూవుంటే, ఆమె ప్రభువు వద్ద ఒప్పు,కొని సరిచేసుకుంటున్న సమయం లో ఆమెకు ఒక దర్శనం కలిగింది. ఒక తెల్లని తెరమీద ఒక నల్లని

బొట్టుకనబడుతూ రానురాను అది చిన్నబడుతూ చివరికి అది లేకుండా మాయమయింది. ఆ దర్శనం లో - దీని భావం ఏమై ఉంటుందా అని ఆమె ఆలోచిస్తున్నప్పుడు - ఆమె హాస్టల్ లో వున్నప్పుడు ఒక హిందూ మతోన్మాదిగా, తమ నుదుట బొట్టు పెట్టుకుంటానికి నిరాకరించినక్రైస్తవ బాలికలందరితో ఈమె బలవంతం గా ఎలా బొట్టు పెట్టించేవారో, అయితే అది దేవుని దృష్టిలో ఎలాటి తప్పో అని ఆమెకు గ్రహింపు కలిగి, దాని విషయం లోతుగా పశ్చాత్తాపపడి ప్రభువును క్షమాపణ కోరుకొనటం జరిగింది.

తదుపరి మూడు దినాలు ఉపవాసము వుండి ప్రార్థించిన తర్వాత ఆమె హృదయం పాపభారం నుండి విముక్తి నొంది తేలికగా మారింది. అప్పటివరకూ ఆమె అనుసరిస్తున్న హిందూ సంప్రదాయాలు, సంస్కారాలు అన్నీ ఆమె నుండి దూరమయ్యాయి. దేవుని సన్నిధిలో గంటల తరబడి ప్రార్థించటం, వాక్యం ధ్యానించటం ఆమెకు అలవాటుగా మారాయి. ఆ సమయం లో ఆమె తో ప్రార్థించేందుకు ఒక క్రైస్తవ యవ్వన గుంపు స్త్రీలు ఆమెకు తోడయ్యారు.

1956 వ సంవత్సరం లో లెమెన్స్ ఇవాంజెలికల్ ఫెలోషిప్ వారు నిర్వహించిన సంవత్సరాంత రిట్రీట్ కు ఆమె హాజరై బాప్తిస్మము తీసుకునే  సమయం లో తన పేరు 'పద్మా' గా మార్చుకోటం జరిగింది.

# 3


# వివాహం - దేవుని చిత్తం చేయుట

వివాహ సమయం వచ్చినపుడు మా తల్లి తండ్రులు ఇద్దరూ ప్రభువునెరిగిన వారు కావటం వల్ల, తమ వివాహ విషయంలో దైవచిత్తాను సారంగా కొనసాగాలని నిర్ణయించుకున్న వారుగా వారి హృదయాలలో ఏ ఒక్క నిర్ణయం తీసుకొనకుండా దేవుని సన్నిధి లో ప్రార్ధించటము ప్రారంభించారు. దేవుని చిత్తానుసారం గా వివాహ జీవితం లోనికి ప్రవేశించితే, కట్టబడే కుటుంబ జీవితం - దేవుని నామాన్ని మహిమ పరుస్తుంది అని వారిద్దరూ దృఢం గా నమ్మిన వారు. ఆ సమయం లో కొంతమంది

సీనియర్ బోధకులు ఒకరికి మరొకరిని గురించి ప్రతిపాదించి (ప్రపోజ్ చేసి) దాని విషయం ప్రార్ధించండి అని చెప్పటం జరిగింది. పెద్దవారు చేసిన ప్రపోసల్ గురించి ప్రార్దిస్తూ,. వీరు కేవలం వీరి ప్రార్ధన లపై మాత్రమే ఆధార పడకుండా ఇతర దైవ దాసులనూ,

సంఘం లోని  ప్రార్థనా సహచరులను సహితం వీరిద్దరూ - వారి ప్రార్థనల నిమిత్తం కోరటము జరిగింది.

వీరంతా ప్రార్థించి మా నాన్న గారిని గురించి మా అమ్మగారి తల్లికి చెప్తే, ఆమె అందుకు  అంగీకరించలేదు.  మా నాన్న అప్పటికే దేవుని సేవ నిమిత్తం తన ఉద్యోగానికి రాజీనామా చేసి సేవలో ఉండటం వల్ల, ఏమాత్రం కుటుంబ పోషణకు ఆధారం లేని మా నాన్నకు తన కుమార్తెను వివాహం చేసేందుకు  ఆమె ఒప్పుకోలేదు. అయితే కొంత మంది సీనియర్ సేవకులు ఆమెతో మాట్లాడి నప్పుడు ఆమె చివరిగా అందుకు అంగీకరించారు. వివాహం జూన్ 15, 1956 న విజయవాడ కు సమీపం లోని 'వణుకూరు' అనే గ్రామము లో జరిగింది. ఈ గ్రామం, ఈ ఇరువురిలో ఏ ఒక్కరి స్వగ్రామమూ  కాదు; ఆ సమయం లో బ్రదర్ భూషణం గారి ఇంటి వద్ద కూటములు ఏర్పాటు చెయ్యటం వలన, కూటాల ముగింపు సమయం లో వివాహం అక్కడ ఏర్పాటు చేస్తే కూటాలకు హాజరైన సువార్తికులకు వీలుగా ఉంటుంది  - అనే ఉద్దేశ్యం తో వివాహం అక్కడ ఏర్పాటు చెయ్యటం జరిగింది.



చిత్రం *1* ఎబెల్ దంపతుల వివాహ చిత్రం

# 4

# కుటుంబం మరియు దైవసేవ

## 4.1 దీన ప్రారంభము

మచిలీపట్టణం లో మా తండ్రి తన సేవను ప్రారంభించిన ఆనందపేట లోనే (నతానియేల్ దంపతుల గృహానికి సమీపంలో), వివాహానంతరం మా తల్లి తండ్రులు బాడుగ తీసుకొన్న వేరొక చిన్నగృహం లో తమకుటుంబ జీవితాన్ని ప్రారంభించి సేవనూ కొనసాగించటము కొనసాగించారు.

అతి త్వరలో మా అమ్మ చుట్టుపక్కల నున్నా అందరికీ పరిచయమైన వ్యక్తిగా మారారు. ఇక్కడ వున్నా సమయం లోనే వారి మొదటి కుమార్తెనైన నేను జన్మించటం జరిగింది.

## 4.2 ప్రార్థనా స్థలము మార్చుట

దినాలు గడుస్తూ వున్నాయి, అయితే మా నాన్న తన సేవ ఇంకా విస్తరించి అనేకులకు చేరాలని (మరి ముఖ్యం గా యవ్వనస్థులను చేరాలని) ఆశించి దాని విషయమై ప్రార్థిస్తూ వేచియున్న దినాలలో, ఒక రోజు ఆయనకు దర్శనం రావటం, దానిలో ఏదో చెత్త చెదారం పారేసిన ఒక స్థలం కనిపించటం జరిగింది. ఇది ఏమై ఉంటుందా అని ఆలోచిస్తున్న సమయం లో ఒక రోజు అదే పట్టణం లోని మరో ప్రాంతంలో (మల్కాపట్నం) ఒక రోడ్డు పై ఆయన తన సైకిల్ పై వెళ్లాల్సిన అవసరం కలిగి వెళ్తున్నప్పుడు, తాను తన దర్శనం లో చూసిన స్థలం అక్కడ అదే విధం గా చూసి ఆశ్చర్య పడ్డారు.

ఆ స్థలం లో మా నాన్న తన దర్శనం లో చూసినట్లు గానే తుప్పలు, ముళ్ళ చెట్లు వుండి, చెత్త చెదారం పారవేసిన స్థలం గా అది వుండింది. ఆ స్థలం ఎవరికి చెందిందా ? అని వాకబు చేసి దానికి యజమాని అయిన ఒక ముస్లిం పెద్దమనిషిని కలసి - ఆ స్థలం లో ఒక తాత్కాలిక షెడ్డు వేసుకునేందుకు ఆయన తన స్థలాన్ని అద్దెకు ఇవ్వగలరా? అని అడిగినప్పుడు, మా నాన్న

ఇచ్చే అద్దె ఎంత అని ఆయన అడిగారట! మా నాన్న "నెలకు అయిదు రూపాయలు" అని చెప్పినప్పుడు, ఆ యజమాని ససేమిరా అన్నారట. దినాలు గడిచాయి. ఒకరోజు ఆ యజమానే మా నాన్న ను తిరిగి పిలిపించి ఆ స్థలం అద్దెకు తీసుకునేందుకు ఇంకా మీకు మనస్సుందా? అని అడిగారట! "అవును కానీ అయిదు రాపాయలకే" అని మా నాన్న చెప్పినప్పుడు, ఆ యజమాని "అయిదు రూపాయలకే తీసుకో" అని అంగీకరించారట. ఇప్పుడు వీరు నివాసం వుండి సేవ చేస్తున్నా స్థలం, ఇక ఇప్పుడు వీరు మారవలసిన స్థలం - రెండూ పట్టణానికి చెరొక దిక్కున ఉండటం వల్ల, మొదటిగా ఇప్పుడు మారనున్న స్థలానికి సమీపం లో ఒక చిన్న ఇల్లు అద్దెకు తీసుకొని దానిలో నివాసం వుంటూ, అద్దెకు తీసుకున్నా స్థలం ను శుభ్రం చేసి అక్కడ ఒక షెడ్ వేసే వరకూ ఆ ఇంటిలోనే ప్రార్థనలు కూడా కొనసాగించేవారు. ఇది ఆ నాటి మల్కాపట్నం పోస్టాఫీస్ పక్కన వున్నా ఇల్లు.

ఇప్పుడు అయిదు రూపాయలకు అద్దెకు తీసుకున్న స్థలం లో ఎప్పుడో ఒక ఏనుగును పాతిపేశారనే నమ్మకం ఆ చుట్టుప్రక్కల ప్రజలలో ఉండటం, అందువల్ల అది నివాసయోగ్యం కాదని

చుట్టుపక్కల వారంతా నమ్మి, చెత్తవేసే స్థలం గా దానిని వుపయోగిస్తున్నారట!!

అవి మా నాన్నకు ఏ వుద్యోగం లేకుండా, కేవలం విశ్వాసం పైనే ఆధార పడి చిన్న బిడ్డతో కుటుంబాన్ని కొనసాగించాల్సిన దినాలు! ఇక అద్దెకు తీసుకున్న స్థలంను - ముందు తుప్పలు వగైరా నరికి శుభ్రం చెయ్యాలి: కూలి వారిని పెట్టి పని చేయించే శక్తి లేదు, కనీసం వాలంటీర్లు వున్నారా అంటే, ఏ ఒక్కరు లేరు! దానితో వీరే శుభ్రం చెయ్యటం ప్రారంభించి ముళ్ళతుప్పలు తొలగించటం, అక్కడ పేరుకుపోయిన గాజుపెంకులు ఇతర చెత్త తొలగించటం చేసారు. ఇక అక్కడ షెడ్డు వేసే మాటకొస్తే, మా నాన్న జేబులో కేవలం పది రూపాయలున్నాయి మాత్రమే ఆ సమయం లో వున్నాయట! ఎంత విశ్వాసంవున్నా పది రూపాయలతో షెడ్డు నిర్మాణం ప్రారంభించాలంటే అయ్యే పని కాదు; అయినా మా నాన్న చేతిలో వున్నా పది రూపాయల తోనే అది ప్రారంభించటం తప్పలేదు.

శుభ్రం చేసిన స్థలం లో తనవద్ద నున్న పది రూపాయలతోనే షెడ్డు పని ప్రారంభించిన మా నాన్నకు ప్రతిదినం ఒక విశ్వాస పరీక్షగా నిలిచేది. ప్రతి రోజు పనివారికి, సాయంత్రం వారికూలి

వారికి ఇవ్వాలి! చాలాసార్లు పనివారు పని పూర్తిచేసి ఇంటికి వెళ్లే సమయం వరకూ కూలివారికివ్వవలసిన కూలి మా నాన్న చేతులలోకి ఎలా రాసైయుంది, ఎంత రాసై యుంది అనేది పరీక్ష గానే మిగిలేది. పైగా ఇది రోజువారీ అంశం గా మారింది.

చివరికి గోడలు లేకుండా ఒక చిన్న తాటాకు పాక సిద్ధం అయ్యింది. ఆ సమయం లో మా అమ్మ ఇంకొందరు స్త్రీలతో కలసి ఎంతో శ్రమించి, నిర్మించిన పాకకు రెండు పక్కల మట్టి గోడలు పెట్ట గలిగారు. ఈ రెండు ప్రక్కల గోడలకు కొన్ని కిటికీలు కూడా ఉండేవి. మిగిలిన రెండు ప్రక్కలు - తడికెలు, వెదురు కటకటాల తో మూయబడ్డాయి. ఇక ఈ స్థలం లో ఒక బోరింగ్ పంపుమాత్రం వేయగలిగారు, కానీ ఇంకా కరెంటు కనెక్షన్ లేదు. ఈ ప్రదేశం లో కేవలం ప్రార్థనలు మాత్రం జరుపుకొనటం, ఇక అక్కడ ఎవ్వరూ నివాసం వుంటూ చూచుకునే పరిస్థితి అప్పటికి లేనందున కంపౌండ్ చుట్టూ తడికెల దడి కట్టి ఒక చిన్న గేట్ బిగించారు. ప్రార్థన కూటం ముగిసిన తర్వాత గేట్ కు తాళం వేసి వెళ్లి పోయే వారు.


ఈ సమయం లో కూడా ఒక్కోసారి మా తల్లితండ్రులకు ఆ స్థలం అద్దె నెలనెలా కట్టటం సవాలు గానే ఉండేది. కొన్ని సార్లు కొన్ని

నెలల పాటు బకాయి పడిపోయిన అద్దెను దేవుడు అనుగ్రహించినప్పుడు, అప్పుడు యజమానికి చెల్లిస్తూ వుండేవారు. దేవుని కృప వల్ల అద్దె ఆలస్యం గా చెల్లించటాన్ని బట్టి ఆ యజమాని ఆ స్థలాన్ని ఖాళీ చెయ్యమని ఎప్పుడూ మా నాన్నను తొందర పెట్టలేదు. ఈ విధం గా యజమానికి, మా నాన్న కు వున్నా సంభంధం సజావుగా వుండేలా దేవుడు ఎప్పుడూ కాపాడాడు.

ఆ దినాలలో మా నాన్నకు, ఆయన చిన్న తనం లో మాస్టారు గారైన బి. ఇశ్రాయేలు గారు అక్కడ ప్రార్ధనపాక నిర్మాణం జరుగుతున్నప్పుడు సహాయకులు గా వుండేవారు. ఆయన ప్రభువు నిమిత్తమై చాల రోషం గల వ్యక్తిగా యవ్వనులైన వారిని చాలా ఉత్సాహపరుస్తూ వుండేవారు. పెద్దవారైన ఆయన యవ్వనులైన మా తల్లితండ్రులకు విలువైన సూచనలు, ప్రార్ధనా పూర్వకమైన సలహాలను ఇస్తూ, మా నాన్న ఇతర ప్రదేశము లకు వెళ్ళినప్పుడు, అక్కడ వాక్య పరిచర్యలో సహాయం చేస్తూ వుండేవారు.

నేను పుట్టిన రెండు సంవత్సరాలకు మా పెద్ద తమ్ముడు జాన్ వెస్లీ జన్మించాడు. దీనితో కుటుంబ అవసరాలు మరింత

పెరిగినప్పటికీ, మా తల్లి తండ్రులు తమ విశ్వాసజీవితం లో మరింత నేర్చుకొని ముందుకు సాగునట్లు ప్రభువు సహాయం చేశాడు. మరో మూడు సంవత్సరాలకు మా చిన్న తమ్ముడైన ఇమ్మానుయేలు జన్మించాడు.



చిత్రం 2 మల్కాపట్నం లో బ్రదర్. జీ. ఏబెల్ గారు విశ్వాసం తో నిర్మించిన మొదటి ప్రార్ధన పాక

# 4.3 ప్రారంభం లో మా తల్లితండ్రుల స్నేహితులు, కొన్ని కుటుంబాలు

## 4.3.1 డేవిడ్ గారు

ఏ విధంగా మా తల్లి తండ్రులకు డేవిడ్ గారికి పరిచయం అయ్యారో తెలియదు కానీ, ఈయన ఇంజనీరు గా, ఆయన సతీమణి డాక్టర్ గా మచిలీపట్టణం లో వారి నలుగురు కుమారులు, ఒక కుమార్తె తో నివసిస్తూ 1955 - 1962 మధ్య మా నాన్న జరిపే ప్రార్ధన కూటాలకు హాజరౌతూ, సేవలో వీరి కుటుంబం చాల సహాయం గా ఉండేది.

ఆ దినాలలో నతానియేల్ గారి కుటుంబం, ఎం. జి. సుందర్రావు గారి కుటుంబం, సిహెచ్. ఆశీర్వాదం గారి కుటుంబముతో పాటు మరో ఒకటి రెండు కుటుంబాలు, ఇక వీరితో పాటు అనేక మంది యవ్వనస్తులు ప్రార్ధన కూటాలకు హాజరౌతూ వుండే వారు.

## 4. 3. 2. హైనీ అమ్మగారు

1960 నుండి దాదాపు నలభై సంవత్సరాలు మచిలీపట్టణం లో సేవచేసిన ఫిన్లాండ్ మిషనరీ గారైన హైనీ అమ్మ గారిని గురించి ఆ దినాలలో తెలియని వారు ఎవ్వరూ వుండరు. ఆమె అనాధ పిల్లల మధ్య సేవ చేసేందుకు తన్ను తాను సమర్పించుకొని మన దేశానికి వచ్చి ఎన్నో కష్టాల మధ్య ఎన్నడూ ఊహించని పరిస్థితులు, పరీక్షలు ఎదుర్కొంటూ ప్రభువు సేవను బహు నమ్మకంగా జరించిన సేవకురాలు. మచిలీపట్టణం కు వచ్చిన వద్ద నుండి ఆమెకు మా తల్లి తండ్రులతో పరిచయం ఏర్పడి అది చాల సన్నిహితం గా మారింది. మా తల్లి తండ్రుల సమర్పణను బట్టి ఆమెకు వీరిపై చాల ప్రేమ, ఆప్యాయత, గౌరవం ఉండేవి.

## 4.4 విశ్వాస పాఠాలు

సేవా పరిచర్యలో, మరి ముఖ్యంగా మా తల్లితండ్రుల తొలి దినాలలో వారు ఎన్నో విశ్వాస పరీక్షలను ఎదుర్కొని ప్రభువు యొద్ద నుండి ఎన్నో పాఠాలు నేర్చుకోవాల్సి వచ్చింది; వాటిలో కొన్ని -

### 4.4.1 నిజ జీవితం లో విశ్వాసాన్ని సార్ధకం చేసుకోటం

మా నాన్న, సంఘం నుండి నెలనెలా అందే జీతము మీద కాకుండా కేవలం విశ్వాసం  పై ఆధార పడి పని చెయ్యవలసిన పరిస్థితి ఉండటం తో, వారు దిన దినం తినాల్సిన భోజనం నిమిత్తం కూడా విశ్వాసం  పై ఆధారపడవలసిన పరిస్థితి ఉండేది. అనేక మార్లు ఇంటిలో వున్నా ఖాళీ సీసాలు, పాత పేపర్ల వంటివి అమ్ముకొని ఆ వచ్చిన కొద్ది సొమ్ముతో ఆ నాటికి సరిపడిన భోజనం కొరకు ఆ డబ్బు వాడుకోవటం, అయితే మరుసటి భోజనం నిమిత్తం మరల విశ్వాసం తో ఎదురు చూడటం వంటి సందర్భాలు అనేకం వారి జీవితం లో వున్నాయి.

మా పెద్దతమ్ముడు వెస్లీ పుట్టిన సమయం లో మా తల్లి తండ్రుల పరిస్థితి మరింత దయనీయం గా ఉండేది. పుట్టిన పిల్లవాడికి మార్చేందుకు (వాడినతర్వాత ఉతికి ఎండలో ఆరవేసి తిరిగి వాడుకోగలిగే) చిన్న చిన్న గుడ్డముక్కలు కూడా కరువయ్యాయి. ఎన్నో సార్లు మా అమ్మ గర్భిణీ స్త్రీ గా రిక్షా ఎక్కేందుకు డబ్బు లేక తప్పని పరిస్థితులలో ఏంతో దూరాలు నిండు గర్భిణీ గా నడిచి వెళ్లే వారు.

ఒకానొక క్రిస్మస్ రోజు వారికి తినేందుకు మధ్యాహ్న భోజనం (యధావిధిగా తినే భోజనమే, పండుగ భోజనము కాదు) లేదట! విశ్వాసం పై ఆధారపడి జీవించే వారిగా, వారు తమ వ్యక్తిగత అవసరాల విషయమై ప్రభువు సన్నిధి లోని వెళ్లి ప్రార్ధించడం తప్ప, ఇతరులతో పంచుకునే అలవాటు వారికి లేదు. ఈ విధం గా పండుగ రోజు మధ్యాహ్నము భోజనం లేకుండా ప్రార్ధించు కుంటున్న సమయం లో తలుపు పై ఎవరో తట్టారు. వారు తలుపు తెరిచినప్పుడు ఒకతను "ఆయన మిమ్మునుగూర్చి చింతించు చున్నాడు గనుక మీ చింత యావత్తు ఆయనమీద వేయుడి." అని వాక్యం వున్నా ఫోటో ఫ్రేమ్ ను, ఒక చిన్న కవర్ ను మా నాన్న చేతిలో పెట్టి అవి హైనీ మిషనరీ గారు పంపినట్లు అందజేసి వెళ్లిపోయాడు. మా తల్లితండ్రులు వారి క్రిస్మస్ శుభాకాంక్షలను, కృతజ్ఞతలను హైనీ గారికి తెలియ జేయమని చెప్పి, అతనికి వందనాలు తెలియ జేశారు. తదుపరి హైనీ గారు ఆ కవర్ లో పంపిన కొద్దిద్రవ్యం తో ఆ సాయంత్రం వారు భోజనం చెయ్యగలిగారు. దానికన్నా ఆమె పంపిన వాక్యం వున్నా ఫ్రేమ్ వారిని ఆత్మ లో మరింత పైకి లేవ నెత్తింది.

ఆ దినాలలో మా ఇంట్లో వంటకోసం కట్టెలు వాడుతూ వుండేవారు. ఒకరోజు సాయంత్రానికి అప్పటికి మిగిలివున్న కట్టెలతో వంట పూర్తి చేసి మరుసటి దినము వంటకోసం కట్టెలు లేని స్థితి లో దిన చర్య పూర్తి అయ్యింది. మా అమ్మ రాత్రి పడుకోబోయే ముందు కట్టెల కోసం చాలా ప్రార్థించి పడుకున్నారు. తెల్లవారింది, లేచి పిల్లల అవసరాలు చూస్తూ కట్టెల విషయమై హృదయంలో ప్రార్థిస్తూనే వున్నారు. ఇంతలో ఎవరో తలుపు తట్టారు. మా అమ్మ తలుపు తీసి చూస్తే నమ్మలేని పరిస్థితి!! మా అమ్మకు అతి సన్నిహితురాలై ఒక ప్రభుత్వ ఉద్యోగి సతీమణి, సంఘం లో వున్నత స్థితిలో వున్నా ఒక ఆమె తన తలపై కట్టెల మూట పెట్టుకొని మా అమ్మ తెరచిన తలుపు గుమ్మం లో కనిపించారు!

మా అమ్మ కళ్ళు చెమ్మగిల్లాయి. ఎదుట వున్నా ఆమె తలపై వున్న కట్టెల మూట దించినపుడు, ఆమె “ఎందుకో తెలీదు కానీ రాత్రంతా నాకు ఈ కట్టెల మూట నీకు తీసుకొని వెళ్లాలని మనస్సు లో తొలుస్తూనే వుంది; ఎలా వున్నారు మీరు?” అని అడిగినప్పుడు, మా అమ్మ జరిగిన విషయం అంతా ఆమెకు తెలియజేసి, ఆమె ఆ కట్టెల మూటను తేవటం ద్వారా తన

అవసరతను ప్రభువు ఎలా తీర్చాడో తెలియ జేసినప్పుడు, వారిద్దరూ విశ్వాసం లో మరింత బల పడ్డారు.

మరొక సందర్భం లో మా తల్లి తండ్రులకు భోజనానికి ఏమి లేవు; చేసేది లేక మోకరించి ప్రార్ధించుకుంటూ తమ అవసరాలను దేవుని దృష్టికి తీసుకెళ్తున్న సమయంలో ఎవరో తలుపు తట్టటం తో, తలుపు తీసి చూసిన మా నాన్నకు ఒక బంధువు కనిపించారు. వచ్చిన ఆయన రిక్షా ను రోడ్డు మీదే ఆపి, వచ్చి ఇంట్లోకి అడుగు పెట్టి వారు ఎలా వున్నారు అని వాకబు చేసి, జేబునుండి కొద్దిద్రవ్యం తీసి మా నాన్న చేతిలో పెట్టి, “నేను వెళ్ళొస్తాను, నాకు పని వుంది” అని చెప్పివెళ్ళిపోతున్న ఆయనతో, మా నాన్న అసలు ఆ వూరు ఆయన ఎందుకు వచ్చారు? అంత తొందరగా వెళ్లి పోవలసిన అవసరం గురించి అడిగితే, వెంటనే వెళ్లిపోవాల్సిన అవసరం వున్నట్లు చెప్పి ఆయన వెళ్లిపోయారు. అయితే మా తల్లి తండ్రులు వారి అవసరతను తీర్చిన దేవుని స్తుతించారు.

మరో సమయం లో ఇంట్లో అన్నం వండేందుకు బియ్యము వున్నాయి. ఇక ఇంటి వెనుక ఒక కాకర పాదు పాకి కాయలు కాయటం మొదలు పెట్టింది. అదేసమయం లో మా అమ్మమ్మ

ఒక ప్యాకెట్ కందిపప్పు తేవటం, ఇక ఇతర కూరగాయలు వగైరా కొనుక్కునేందుకు డబ్బు లేకపోవటం తో రోజు వున్నా పప్పు తో మధ్యాహ్నం భోజనం, కాకరకాయల కూరతో రాత్రి భోజనం రొటీన్ గా మారింది. దీనితో విసుకు చెందిన మా అమ్మ "ఆనాటి ఇశ్రాయేలీయులకు మాంసం ఇచ్చిన దేవా, నాకూ కొంత మాంసం కూరతో మార్పు కల్పించు" అని ప్రార్థించారు.

ఆ దినాలలో గవర్నమెంట్ హాస్టల్ లో వుంటూ మా ప్రార్థన కూటాలకు హాజరయ్యే కొందరు కళాశాల లో చదివే యువ్వనస్థులు, తమ హాస్టల్ లో భోజనం చేసి ప్లేట్లు కడినప్పుడు పడిన అన్నం మెతుకులు తినేందుకు కొన్ని కొంగలు వాలాయి! ఒక కుర్రవాడు రాయి విసిరితే నేలకొరిగిన ఒక కొంగను పట్టుకొని మా అమ్మ దగ్గరకు తెచ్చి ఇచ్చాడట!! దానితో ప్రభువుకు కృతజ్ఞతలు చెల్లించి ఆ కొంగ మాంసం కూర తో తదుపరి భోజనం తినగలిగారు.

ఆ రోజుల్లో నాకు చెవి కింద ఒక గడ్డ వచ్చినప్పుడు డాక్టర్స్ కు చూపిస్తే, వారు చూసి దానికి రేడియం చికిత్స అవసరం కావచ్చు అని చెప్పారట! బాగా భయపడిన మా తల్లితండ్రులు ఆ రోజుల్లో ప్రముఖ దైవజనులైన బొల్లెద్దు జాన్ గారికి ఆ విషయం చెప్పితే,

ఆయన "ఏమి అక్కరలేదు; దేవుడు తన రేడియం ట్రీట్మెంట్ ఇచ్చి తానే పిల్లను స్వస్థపరుస్తాడు." అని చెప్పి కొంచెం కొబ్బరి నూనె రాసి ప్రార్ధన చేసారు; ఇలా కొన్ని సార్లు చెయ్యగానే అది మాయమయ్యింది .

బాల్యం లో ఒకానొకసారి నేను వొంగు తో బాధపడుతున్న సమయంలోనే రక్త విరేచనాలు కూడా కావటం ప్రారంభం అయ్యాయి. భయపడిన మా నాన్న నన్ను డాక్టర్ వద్దకు తీసుకొని వెళ్తే, నా పరిస్థితి చూసిన డాక్టర్ సహా కంగారు పడ్డారు. ఏవో కొన్ని మందులు రాసి వాడమని చెప్తూనే ఆ డాక్టర్ మా తల్లితండ్రులను కాస్త జాగ్రత్తగా వుండమని హెచ్చరించారు. ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత ఇలాటి పరిస్థితులలో ఎప్పుడూ చేసే విధం గానే మా తల్లి తండ్రులు ఉపవాసం వుండి ప్రార్ధించటం ప్రారంభించారు. రెండు దినాల తర్వాత మా అమ్మకు కలలో ఒక ముసలిస్త్రీ, ఏదైనా తెరచిన తలుపు వుందేమో అని మా ఇంటిచుట్టూ తిరుగుతూ లోపలకి చొరబడాలని చూస్తున్నట్లు కనిపించిందట. అయితే వారు ప్రార్ధన చేస్తూ ఏ తలుపూ తెరచి వుండనివ్వక పోవటం తో ఆ ముసలి స్త్రీ ఇంట్లోకి చొరబడలేకపోయినట్లు తెలిసిందట! నిద్ర మేలుకొన్న మా

అమ్మకు సాతాను శక్తుల తాకిడి వల్ల నేను అస్వస్థత నొందినానని తెలిసిందట!

మా పెద్దతమ్ముడు వెస్లీ చిన్న పిల్లవాడిగా వున్నప్పుడు ఒక సారి తీవ్ర మైన జ్వరం తో బాధ పడుతూ వున్నాడు. కలత చెందిన మా తల్లితండ్రులు డాక్టర్ వద్దకు తీసుకు వెళ్ళటం తో పాటు ఉపవాసం వుండి ప్రార్థన చెయ్యటం ప్రారంభించారు. ఆ రోజు మధ్య రాత్రి దాటే వరకూ ప్రార్ధించి పడుకున్న మా తల్లి తండ్రులకు తెల్లవారి లేవగానే పిల్లవాడి జ్వరం తడిమి చూసి జ్వరం ఏ మాత్రం లేకపోటం తో ఆశ్చర్యపడ్డారు. ప్రతిరోజూ చేసేలాగే ఆ ఉదయం కుటుంబ ప్రార్థనకు మేమంతా కూర్చున్నప్పుడు వెస్లీ తనకు రాత్రి యేసయ్య, ఆయన శిష్యులు కనిపించినట్లు అందుకే జ్వరం మాయమయ్యినట్లు చెప్పటం విని ప్రభువును స్తుతించాము.

ఒకానొక రోజు మా నాన్న సువార్త సేవ నిమిత్తం వేరే వూరు వెళ్ళినప్పుడు, మా అమ్మను తేలు కుట్టి చాలా బాధగా ఉండటం తో ఆమె ఆసుపత్రికి వెళ్లారు. డాక్టర్ ఏదో మందు ఇచ్చి ఇంటికి పంపినప్పటికీ ఆ బాధ చాల సేపటివరకూ ఆమెకు తగ్గలేదు. ఆ తర్వాత ఇంటికి తిరిగి వచ్చిన మా నాన్నకు జరిగిన విషయాన్ని

చెప్తే, “ఆస్పత్రి వరకూ ఎందుకు వెళ్లారు? అక్కడ కొంచెం కొబ్బరి నూనె రాసి ప్రార్ధన చేస్తే సరిపోయేది కదా?” అన్నారు!

కొద్ది రోజుల్లో మరో తేలు ఆమెను కుట్టిన సమయం లో మా నాన్న కూడా ఇంట్లో వున్నారు. ఆ సమయం లో మా నాన్న కొంచెం కొబ్బరి నూనె అక్కడ రాసి ప్రార్ధన చేసినప్పుడు ఆమె వెంటనే బాధ నుండి స్వస్థత పడటం పిల్లలు గా మేము చూసినప్పుడు మా విశ్వాసం ఏంతో బలపడింది.

## 4.4.2 నా మోకాలుకు ఆపరేషన్ - దేవుని పై ఆధారపడటం

నాకు అయిదు సంవత్సరాల వయస్సు లో ఈ పుస్తకం లో నేను ముందుగా పరిచయం చేసిన ఇంజనీర్ డేవిడ్ గారు, వారి పిల్లలు వాడిన పిల్లలు తొక్కుకునే మూడు చక్రాల సైకిల్ ఒకటి ఇచ్చారు. దానిని నేను తొక్కుతున్నప్పుడు ఒకసారి పక్కకు పడిపోయి మోకాలు చిప్పకు దెబ్బ తగలటం తో అప్పటినుండి రోడ్డు మీద నడుస్తూ నడుస్తూనే తెలియకుండా నేను పడిపోతూ వుండే దానిని. డాక్టర్ లకు నన్ను చూపించినప్పుడు వారిలో చాల మంది ఆపరేషన్ చేయు నిమిత్తం వెల్లూరు లోని ఆసుపత్రికి

తీసికొని వెళ్ళమని సలహా ఇచ్చారు. అయితే ముగ్గురు చిన్న పిల్లలతో, ఏమాత్రం డబ్బు ఖర్చు చేసే స్థోమత లేని వారికి అంతదూరం వెళ్లి, చికిత్స చేయించు కోవల్సిన అవసరత పడటం తో ఏమి చెయ్యాలో తెలియని పరిస్థితి గా వుండింది.

విషయాన్ని పెద్దలతో చెప్పి వారి ప్రార్థనలు కోరిన తర్వాత మద్రాస్ లో సంవత్సరాంత రిట్రీట్ కు వారు హాజరై అక్కడ మూడు దినములు ఉపవాసం వుండి నా చికిత్స నిమిత్తం ప్రభువుచిత్తం ఏమై వున్నదో తెలుసుకునే ిందుకు భారం తో ప్రార్థించారు. ఆ సమయం లో వెల్లూర్ హాస్పిటల్కు తీసుకు వెళ్లనున్నట్లు మా నాన్న దర్శనం లో చూడటం తో, ఆ సమయం లో తగిన డబ్బు ఏమాత్రం చేతిలో లేకపోయినా దేవుని చిత్తాన్ని తెలుసుకున్న వారుగా మరోమారు వారు తమకు ముందున్న విశ్వాస పరీక్షను అర్థం చేసుకొని కుటుంబాన్ని బందరు లోనే విడిచి నన్ను మాత్రం తీసుకొని మా నాన్నమాత్రం అక్కడకు వెళ్లారు.

వెల్లూర్ లో డాక్టర్లు నా కాలు చూసి ఆపరేషన్ చేసిన తర్వాత కూడా మోకాలు పూర్తిగా నయం కాగలదా అనే విషయమై మా నాన్నతో సందేహం వ్యక్తం చెయ్యటం తో, మేము అక్కడకు

వెళ్ళటం దేవుని చిత్తం కావటం వల్ల దేవుడే అక్కడి డాక్టర్ల సందేహాన్ని పోగొట్టి తానే నన్ను సంపూర్తిగా స్వస్థ పరచాలి అని మా నాన్న ప్రార్ధించారు. బందరు లోనే వుండి మా కోసం ఆసక్తి తో ప్రార్థన చేస్తున్న మా అమ్మ కు ఈ విషయం తెలిసి భారం తో ప్రార్థన చేస్తున్నప్పుడు, మా అమ్మ, నా మోకాలు పూర్తిగా నయం కానున్నట్లు దర్శనం లో చూసి మా నాన్నకు తెలియజేసి ధైర్య పరిచారు. ప్రార్థనపరు రాలుగా మా అమ్మను ఎరిగిన మా నాన్న దానితో సంతోషించారు.

అయితే వెల్లూర్ లోని డాక్టర్లు ఆపరేషన్ జరిగిన తర్వాత కాలు పూర్తిగా నయం కావటానికి చాల నెలలు పట్టవచ్చు అని చెప్పటం కూడా మా నాన్నకు కొంత ఆందోళన కలిగించింది - ఎందుకంటే కుటుంబం తో వేరొక ప్రదేశం లో వైధ్య చికిత్స నిమిత్తం నెలల పాటు వుండటం లో వున్నా ఖర్చు, ఇబ్బంది, ఇతర విషయాలు ఆలోచిస్తే నిజం గానే చాలా ఆందోళన చెందే పరిస్థితే!!

ఆపరేషన్ పూర్తి అయ్యింది; అయితే మా నాన్న ఒక్కరే నన్ను చూసుకోవటం కష్టం గా వుండి మా అమ్మకు వెల్లూరు రమ్మని ఒక టెలిగ్రామ్ ఇచ్చారు. ఇద్దరు చిన్న పిల్లలతో అంతదూరం, అదీ

ముందు రిజర్వేషన్ చేసుకోకుండా ఎలా చెయ్యాలో తెలియని పరిస్థితులలో ఆలోచిస్తుంటే, వీరికి ఆత్మీయ కుమారుడునూ విజయవాడ రైల్వేస్ లో పనిచేస్తున్న జి. డేవిడ్ గారు జ్ఞాపకం వచ్చి - తనను మద్రాస్ మెయిల్ బండిలో ఎక్కించ మని ఆయనకు మా అమ్మ టెలిగ్రామ్ ఇచ్చి, మా తమ్ముళ్ళతో విజయవాడ చేరారు. అయితే డేవిడ్ గారు ఈమెకు కనిపించలేదు; దీనితో మరింత ఒత్తిడి తో రైల్వే స్టేషన్ అంతా వెతికినా ఎక్కడా ఆయన కనిపించలేదు. దీనితో తనంతట తాను ఎక్కవలసిన ట్రైన్ లో ఎక్కునట్లు ప్రార్థిస్తూ ట్రైన్ కోసం కనిపెడుతున్న టైం లో అనుకోకుండా ప్రక్కనున్న మెట్ల మీదుగా డేవిడ్ గారు వెళ్ళటం కనిపించి సంతోషం తో ఆయనను పిలిచారు. ఆయన వెనుకకు తిరిగి మా అమ్మ ను చూసి వచ్చి "ఇదేంటి? ఇక్కడున్నారు?" అని ప్రశ్నించాడు. మా అమ్మ "నేనిచ్చిన టెలిగ్రామ్ అందిందా?" అని అడిగితే ఆయన "టెలిగ్రామా? లేదే!" అన్నాడు. మా అమ్మ ఆనందం తో కన్నీళ్లు పెట్టుకొని ప్రభువును స్తుతిస్తూ విషయం అంతా చెప్పారు. అప్పుడు ఆయన వారు ఎక్కవలసిన ట్రైన్ కు కలుపవలసిన బోగీ వద్దకు వారిని తీసుకు వెళ్లి ఎక్కించి సెలవు తీసుకున్నారు. దేవుడు ఆశ్చర్యరీతిగా చేసిన ఈ సహాయం

కోసం మా అమ్మ ఆయనకు వందనాలు చెప్పి తన ప్రయాణాన్ని కొనసాగించారు. ఆ తర్వాత మద్రాస్ నుండి బస్సు లో ప్రయాణించి వెల్లూర్ చేరుకున్నారు.

మేము వెల్లూర్ లో వున్నా సమయం లో మా నాన్నను దేవునిలోనికి నడిపించిన వారి చిన్నాన్న గారైన గంటా జాన్ గారి కుమార్తె, వసంతమ్మ అక్కడి ఆసుపత్రి లో హౌస్ సర్జెన్ గా తర్ఫీతు లో వున్నారు. మేము అక్కడకు చేరిన సమయం నుండి ఆమె డాక్టర్లను కలవటం లోను, వైద్య పరీక్షలు చేయించటం లోను, మమ్మల్ని సౌఖ్యం గా ఉంచటం లోనూ చాలా సహాయం చేశారు. హాస్పిటల్ లో ఉండవలసిన కాలం పూర్తి అయిన తర్వాత చిన్న ఇల్లు తీసుకొని కొంతకాలం మేము ;ఫిజియో నిమిత్తం ఉండాల్సి వచ్చింది. ఈ కష్ట సమయం అంతటి లో దేవుడు మా తల్లి తండ్రులకు కావలసిన సహనం, ఓర్పు, దేవుని పై అనుకొనుట మరింత నేర్చుకునే అవకాశం కల్పించాడు.

ఆశ్చర్య రీతిగా, ముందు అనుకున్న రీతిగా కాక దానికి పదిహేను రోజుల ముందే నా కాలుపై వేసిన పిండి కట్టు విప్పి ఫిజియోతెరపి ఇవ్వటం ప్రారంభించారు. ఇది కూడా మా

తల్లితండ్రులు, ఇంకా అనేకులు నా కోసం చేస్తున్న ప్రార్థనలకు జవాబుగా మా తల్లి తండ్రులు భావించి దేవునికి కృతజ్ఞతలు చెల్లించారు.

ఇక చేయవలసిన చికిత్స అంతా ముగిసిన అనంతరం, బిల్లు వేసే సమయం లో మా వసంత ఆంటీ మా నాన్నను వారికి పరిచయం చేసి, "ఈయన కేవలం విశ్వాసం పై ఆధారపడి జీవించే దేవుని సేవకుడు" అని చెప్పటం తో హాస్పిటల్ వారు ఫీజు కొంత తగ్గించి బిల్ కట్టటం పూర్తి అయ్యాక వారు చెయ్యవలసిన వైద్యసేవలు పూర్తి అయినట్లు చెప్పారు. దానితో మేమంతా తిరిగి ఆనందం తో బందరు వచ్చిన తర్వాత, కొన్ని వారాల విశ్రాంతి అనంతరం నేను బడికి కూడా వెళ్ళటం ప్రారంభించి అతి త్వరలోనే బడిలో అన్ని ఆటపాటలలో పాల్గొనటం కూడా ప్రారంభించాను.

## 4.5 మా నివాసాన్ని చర్చ్ కాంపౌండ్ కు మార్చుట

మా తల్లితండ్రులు అప్పటివరకూ ఒక అద్దె ఇంట్లో నివాసం వుంటూ ప్రార్థన కూటములు మాత్రం అయిదు రూపాయలకు

అద్దెకు తీసుకున్న స్థలం లో కట్టిన పాక లో జరుపుతూ వుండేవారు. వారానికి ఆ రోజుల్లో అక్కడ అయిదు ఆరాధనలు జరిగేవి. ఇదే సమయం లో రెండు చోట్ల అద్దె కట్టటం కూడా కొంత భారం గా మారింది. దీనితో మేము అద్దె ఇల్లు ఖాళీ చేసి, అయిదు రూపాయలకు అద్దెకు తీసుకున్న స్థలం లోనే, ఆరాధన కోసం ముందు నిర్మించిన ప్రార్థన పాక పక్కనే మరో తాటాకుల పాక (మట్టి గోడలతో) నిర్మించి దానిలో మేము మకాం పెట్టటం జరిగింది. ఈ షెడ్డు లో గదులు వగైరా ఏవీ లేవు. ఒక మూల మా అమ్మ కట్టెల పొయ్యి, లేక కిరసనాయిలు స్టౌ వాడుతూ వంట చేసే వారు.

ఒక సువార్తికునిగా మా నాన్న తరచూ ఇతర స్థలాలలో జరిగే కూటాలలోప్రసంగిచేందుకు వెళ్తూ వుండేవారు. ఆ రోజుల్లో అనేక సంవత్సరాల పాటు మేమున్న స్థలం లో కరెంటు, తాగు నీటి కుళాయి ఇలాటి సౌకర్యాలు ఏవీ లేకపోయినప్పటికీ మా అమ్మ సేవ భారం తెలిసిన వ్యక్తి గా అర్థం చేసుకుంటూ చిన్నపిల్లలు గా వున్నా మమ్మల్ని చూసుకుంటూ సేవలో మా నాన్నతో ఎంతో సహకరిస్తూ వుండేవారు.

ఇప్పుడు మేము నివాసం కోసం కొత్తగా నిర్మించిన తాటాకు పాక 1964 ప్రాంతం లో కట్టబడినప్పటికీ దానికి నాపరాయి పరచటం 1967 లేక 68 వరకూ పూర్తి కాలేదు. ఈ మధ్య కాలం లో మా అమ్మ, గుడిలో ప్రార్థన కూటాలకు వచ్చే ఒకరిద్దరు స్త్రీల సహాయం తో ఎంతో శ్రమించి తరచుగా ప్రార్థన పాక మరియు నివాసం ఉంటున్న ఇంటి గోడలు, ఇంటిలో నేల - ఇవన్నీ అలకటం పెద్ద పని గా ఉండేది.

ఇక ఇప్పుడు మేమున్న నివాసానికి గానీ, ఆరాధన కోసం వాడే పాకకు గానీ - 1967 వరకూ కరెంటు సరఫరా లేదు. ఈ సమయం లో ప్రతి రోజు సాయంత్రం చీకటి పడక ముందు హరికెన్ కిరసనాయిలు దీపాలు వెలిగించటం మా ఇంటిలో అలవాటు! చాల సార్లు ఈ దీపాలు వాటి చిమ్నీ లు శుభ్రం చేసేటప్పుడు మా అమ్మ చేతి వ్రేళ్ళు తెగటం పిల్లలు గా మేము చూస్తూ వుండేవారం! ఇక వారానికి నాలుగు (అది, బుధ, శుక్ర, శని) సాయంత్రాలలో వుండే ప్రార్థన కూటాలకు మా నాన్న మా ఇంటిలో వుండే ఒక పాత పెట్రోమాక్స్ దీపాన్ని వెలిగించి కూటము పూర్తి చేస్తూ ఉండేవారు.

ఇక ప్రతి సంవత్సరం ఒకటి రెండు సార్లు జరిగే ఉజ్జీవ కూటాలకు మరెన్నో పెట్రోమాక్స్ దీపాలు అద్దెకు తెచ్చి వెలిగించి, రాత్రి కూటాలలో వాడుతూ చేస్తూ వుండేవారు. పందిరిలో వేలాడదీసిన ఈ దీపాల నుండి వాటిలో గాలి తగ్గినప్పుడు ఒక్కొక్కసారి ఉవ్వెత్తున మంటలు లేస్తూ ఉండేవి; అయినా ఆ మంటలు పైనున్న పందిరి కి పాకకుండా ప్రభువే అనేక సార్లు కాపాడారు.

ఇక త్రాగునీటి కుళాయి 1974 వరకూ మా కాంపౌండ్ లో లేకపోవటం వల్ల ప్రతి రోజూ వీధి లో వున్నా మునిసిపల్ కుళాయి వద్దకు వెళ్లి బిందెలను నీళ్లతో నింపి మోసుకొని ఇంటివరకూ తేవలసి వచ్చేది. మిగిలిన అన్ని ఇతర అవసరాలకు మా స్థలం వేసిన బోరింగ్ పంప్ నీళ్లు వాడుకునే వాళ్ళము.

ఇక ప్రతి సంవత్సరం ఒకటి రెండు సార్లు మా కాంపౌండ్ లో జరిగే కూటాలలో ప్రసంగించేందుకు వచ్చిన సువార్తికులకు, ఇంకా అక్కడ చెదురుమదురు పనులు చేసే విద్యార్థులకు, ఇనాక్ ఇతరులకు సహితం - మా అమ్మ ఉదయం అల్పాహారం, మద్యాహ్నం, రాత్రి భోజనాలు ఇవన్నీ గ్యాస్ పొయ్యిలు లేకుండా

కట్టెలు, కిరసనాయిలు పొయ్యిలు వాడి చేస్తూ వుండేవారు. ఆ రోజుల నుండి ఎన్నో సంవత్సరాల పాటు - వంట పాత్రలు కడగటం, ఇల్లు, వాకిళ్లు వూడ్చటం పనులలో సహాయపడిన భాగ్యమ్మ కు మేము చాలా ఋణ పడివున్నాం.

## 4.6 సేవలో జరిగిన ఇంకొన్ని సంఘటనలు

మాకు సమీపం లోని ఒక గ్రామం లో ఒకనికి పిల్లలు లేకపోవటం తో, అతను తన భార్య అనుమతి తీసుకొని-రెండో భార్యను కూడా పెళ్లిచేసుకునేందుకు నిర్ణయించుకొని, ఈ రెండవ స్త్రీ నుండి కొంత సొమ్ము కూడా కట్నం కింద తీసుకొనటం అప్పటికే చేసేశాడు. ఈ సమయం లో వాక్య పరిచర్య కోసం వారి గ్రామం వెళ్లిన మా నాన్నను ఇతను కూటము అయిపోయిన తర్వాత కలసి తానుచేసుకోబోతున్న రెండవ వివాహం గురించి తెలియ జేశాడు. విషయం విన్నా మా నాన్న మొదటి భార్య బ్రతికి వుండగానే రెండో స్త్రీ ని వివాహం చేసుకోటం తప్పు అని అతనికి చెప్పి, మొదటిగా అతను కట్నం కింద ఆ స్త్రీ నుండి తీసుకున్నాడబ్బు తిరిగి ఇచ్చివెయ్యమని చెప్పారు. అతను ఆలా చేసిన తర్వాత మా నాన్న అతని మొదటి భార్యకు పిల్లలు కలిగేలా ప్రార్ధించి,

కూటాలు మిగిసినాక వెళ్లిపోయారు. ఒక సంవత్సరం తర్వాత వారికి బిడ్డ కలిగినట్టు వారు మా నాన్న కు ఏంతో సంతోషం తో తెలియజేసారు. ఈ విధం గా మా తల్లితండ్రులు, తమ సేవలో అనేకులు విశ్వాసం తో దేవునికి లోబడి తమ మొదటి అడుగులు వేస్తూ విశ్వాసం చూపినప్పుడు, దేవుడు వారినిమరింత లోతుకు నడిపించు రీతిగా తన వాగ్ధానాలను నెరవేర్చటం చూసారు.

మరో కుటుంబము లో భార్య భర్త లిరువురూ - ఒకరితో ఒకరు కలసి సంసారం చేయలేరు అని తమ్ముకను గూర్చి తాము భావించి విడాకులు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న మా నాన్న వారి ఇరువురితో వక్తిగతం గా మాట్లాడి దేవుని వాక్యాన్ని తేట పరచి ఆలా చెయ్యటం దేవుని దృష్టికి సరైనది కాదు అని తెలియజేసారు. ఒకరితో ఒకరు సమాధాన పడటానికి మొదట ససేమిరా అన్న ఇరువురూ, తర్వాత దేవునికి లోబడి తమ్ముకను తాము తగ్గించుకొని ఒకరితో ఒకరు సమాధాన పడ్డారు. దీనితో ఆ కుటుంబం విడిపోకుండా బిడ్డలతో కలసి జీవితాంతం గడిపారు.

ఒకతను తన చెయ్యి బెణికి చాల బాధపడుతూ తన రోజు వారీ డ్యూటీ కి వెళ్లలేకపోయాడు. ఈ సమయం లో మా నాన్న ప్రసంగం విన్న ఇతనికి విశ్వాసం కలిగి తన చెయ్యి విషయమై ప్రార్థిస్తూ, తాను స్వస్థపడాలని, తిరిగి డ్యూటీకి వెళ్లగలగాలని ప్రార్థించాడు. ఒకరోజు అనుకోకుండా ఎలెక్ట్రిక్ కాయిల్ తో వేడి చేయబడుతున్న నీటిలో ప్రమాద వశాత్తూ తన చెయ్యి ముంచటం తో ఎలక్ట్రిక్ షాక్ తగిలి తన చెయ్యి తిరిగి స్వస్థ పడింది. దీనితో తాను తిరిగి తన డ్యూటీకి మరల వెళ్లగలిగాడు.

మరో సందర్భము లో - మారుమనస్సు నొందిన తర్వాత అంతకు మునుపు మా నాన్న కన్నులకు వున్నా సమస్య తగ్గిపోయి స్వస్థత పడినట్లు ఆయన తన ఒకానొక కూటంలో చెప్తున్నప్పుడు, ఆ కూటం లో అదే విధమైన సమస్య వున్నా ఒకతను విశ్వాసం కలగటం తో ప్రార్థన కూటం అనంతరం మా నాన్న దగ్గరకు వచ్చి విషయం చెప్పి ప్రార్థన చెయ్యమని కోరాడు. మా నాన్న - తన విశ్వాసం తనను స్వస్థపరచగలదు అని చెప్పి ప్రార్థించి ముగిస్తున్న సమయం లో అతను “వారి కన్నులు తెరువబడినాయి” అనే స్వరం విన్నాడు! ప్రార్థన

ముగినప్పుడు తన కన్నులు అతను తెరచి తాను పూర్తి స్వస్థత నొందినట్లు గమనించి ప్రభువును స్తుతించాడు.

ఒకానొక దినం ఈ పుస్తకము మొదట్లో పరిచయం చేసిన నతానియేల్ దంపతుల చిన్న కుమారునికి జ్వరంగా వుండి ముక్కు నుండి రక్తం కారుతున్న సమయం లో చుట్టుపక్కల వారందరూ ఆసుపత్రికి తీసుకు వెళ్ళమని తొందర పెడుతున్న సమయం లో, మా నాన్న "మొదట మనం ప్రార్థన చేద్దాం" అని ఆలా చేసినప్పుడు పిల్లవాడి ముక్కు నుండి కారే రక్తం ఆగిపోయినప్పుడు, చూసిన వారంతా ఆశ్చర్యం తో ప్రభువు నందు విశ్వసించగలిగారు.

## 4.7 ప్రార్థన కూటాలకు హాజరు కావటం వల్ల హింసింపబడిన సంఘ సభ్యులు - శ్యామలమ్మ

మాకు సమీపం లోని గిలకలదిండి అనే - సముద్రానికి తీరం లో వుండే గ్రామము నుండి దాదాపు 1967-68 నుండి మా పరిసరాల లోనికి వచ్చి చేపలు, రొయ్యలు అమ్ముకునే అమ్మాయి - ఈ శ్యామలమ్మ! ఈమె, తన భర్త, అనేకమంది

పిల్లలతో కూడిన కుటుంబ పోషణ నిమిత్తం ఇలా చేసేది. ఒకసారి మా అమ్మతో మాట్లాడుతూ తన వ్యక్తిగత, కుటుంబ విషయాలు పంచుకున్నప్పుడు, క్రీస్తు ప్రభువును గురించి మా అమ్మ ఆ అమ్మాయికి తెలియజేసి, మా ప్రార్థన కూటాలకు వచ్చి వినమని ఆహ్వానించారు. అప్పటినుండి తాను క్రమంగా గుడికి రాటం ప్రారంభించి, విగ్రహాలకు మొక్కటం, బొట్టు పెట్టుకోటం మానేసి ప్రభువును అంగీకరించింది. ఈ క్రమం లో మొదటి దినాలలో, ఆమె అంతకు మునుపు పూజించే దేవతలు ఆమెను ఆవరించి చాలా కష్టాలు పెట్టటం ప్రారంభించాయి. అయితే సేవకులు ఆమె తలపై నూనెరాసి యేసు నామమున ప్రార్థన చేసినప్పుడు అవి ఆమెను విడిచి పోయాయి.

ఆమె భర్త, ఈమె క్రైస్తవ భక్తిని అనుసరిస్తున్నందుకు ఆమెకు చాలా ఇబ్బంది కలిగిస్తూ, చాలాసార్లు కొడుతూ ఉండేవాడు. అయినా ఆమె తన భక్తి విశ్వాసాలను విడిచి పెట్టకుండా ప్రభువుకు నమ్మకం గా ఉండేది. కొన్ని సార్లు మా నాన్న వారి గ్రామం లోని ఇంటికి వెళ్లి ఆమె భర్త తో ఆమెకు ఇబ్బంది కలిగించవద్దు అని చెప్తే, “అలాగే నండి” అని చెప్పిన అతడు, మా నాన్న వారి గ్రామాన్ని విడిచి పోగానే తాను చేసిన ప్రమాణం పై

నిలబడగలిగే వాడు కాదు. కొంత కాలం తర్వాత అతను మరణించాడు; కానీ శ్యామలమ్మ 2006 లో ప్రభవు సన్నిధికి వెళ్లిపోయే వరకూ ఆయనకు నమ్మకం గా వుండింది.

ప్రభువును నమ్ముకొని ప్రార్ధన కూటాల కు హాజరయ్యే మరో కుటుంబం లోని భార్యా, పిల్లలు కూడా - ఆ కుటుంబ యజమాని ద్వారా బాధ పెట్టబడటం, కొట్టబడటం జరిగింది. కొద్ది దినాలకు ఆ యజమాని చనిపోయాడు. తదుపరి ఆ కుటుంబ సభ్యులు స్వేఛ్ఛ గా ప్రార్ధన కూటాల కు హారాజయ్యేవారు.

# 5

# పిల్లలను పెంచటం

## 5.1 కుటుంబ ప్రార్ధన

పిల్లలలో మంచి క్రమశిక్షణకు పునాది 'కుటుంబ ప్రార్ధన' అని నమ్మిన మా తల్లితండ్రులు ప్రతి రోజు తమ కుటుంబ దినచర్యను ప్రారంభించటం, ముగించటంలను కుటుంబ ప్రార్ధనల ద్వారా చేసేవారు. దీనికి ముందే, మా తల్లితండ్రులు ప్రతి రోజూ తెల్లవారు ఝాముననే వారివారి వ్యక్తి గత ఏకాంత ప్రార్ధనలను నాలుగు గంటలు, లేక కొన్ని సార్లు మూడు గంటలకే లేచి పూర్తి చేసుకునే వారు. ఇక కుటుంబ ప్రార్ధనలో - మొదటిగా చిన్న పాటపాడి,తర్వాత చిన్న వాక్య భాగం చదివి, అనంతరం - అందరం చిన్న చిన్న ప్రార్ధనలు

చేసేవారం. చివరిగా మా నాన్న చిన్న ప్రార్థన చేసి, ఆశీర్వాదం తో కుటుంబ ప్రార్థన ముగించేవారు.

పిల్లలు గా మేము చేసే కుటుంబ ప్రార్థనలు - చిన్న చిన్న తల్లితండ్రులు నేర్పిన ప్రార్థనలతో ఆరంభమై, వయస్సు పెరుగుతున్న కొలది మా సొంత అవసరాలను వాటితో చేర్చి, కాలం తో పరిణత చెందినవి గా మా ప్రార్థనలు ఉండాలని మా తల్లి తండ్రులు చెప్పేవారు. ఉదయకాలంలో ఎవ్వరి కాలక్రమం వారికి వుంటుంది కాబట్టి, ఈ కుటుంబ ప్రార్థనల వ్యవధి మరీ ఎక్కువ కాకుండా వుండేలా జాగ్రత్త పడేవారు.

మేము వయస్సు లో పెరుగుతున్నపుడు, ప్రతి ఒక్కొక్కరికీ భిన్న కాలపట్టికలు ఉండటం తో ఆ తర్వాత కాలం లో, సాయంకాల కుటుంబ ప్రార్థనలు, అందరంకలసి కాకుండా ఎవరికి వారు చేసుకొని పడక లకు వెళ్లే విధం గా ఉండేవి, అయితే ఉదయకాల కుటుంబ ప్రార్థన మాత్రం ఎప్పుడూ అమలు లో ఉండేది.



చిత్రం 3: 1978 లో కుటుంబం తో ఏబెల్ దంపతులు

## 5.2 క్రమశిక్షణ

మా తల్లితండ్రులు ఇంటాబయటా తమ పిల్లలైన మమ్ముల్ని క్రమశిక్షణ లో పెంచటానికి ప్రయత్నించేవారు. దీనిలో భాగం గా వారు తరచూ బెత్తం వాడేవారు. మొదటిగా మేము చేసే తప్పిదములు (ఇంటికి బయట జరిగేవి) బయటి వారు వారికి

పిర్యాదు చేసినా లేకపోయినా, మేము వాటిని మా తల్లి తండ్రులకు తప్పక మాయంతట మేమే తెలియజేయాలి; ఇది మాకు ఇంటిలో నియమం! స్కూల్, లేక చుట్టుపక్కల వున్నా వారి నుండి మమ్మల్ని గురించి ఏమైనా పిర్యాదులు వస్తే, వారు మమ్మల్ని బాగా దండించిన తర్వాత మేము వారి వద్దకు వెళ్లి క్షమాపణ అడిగి రావాల్సిందే; అప్పటి వరకూ భోజనం ఉండేది కాదు.

ఈ క్రమం లో తరచుగా మాతల్లితండ్రులు బెత్తం వాడినప్పటికీ, దానిని అనవసరం గా వాడకుండా, ఎంత వాడాలో అంత మాత్రమే వాడేలా జాగ్రత్తపడేవారు. ఒక వేళ ఏ కారణం చేతనైనా వాడవలసిన మోతాదు కన్నా ఎక్కువగా వారు వాడితే ఆ రోజే మేము పడక లకు వెళ్ల క ముందే మమ్ములను వారు క్షమాపణ కోరేవారు. మా పిల్లలే కదా - వీరిని క్షమాపణ కోరేదేంటి? అనే తత్త్వం వారిలో వుండేది కాదు.

వయస్సు లో మేము పెరుతుగున్నప్పుడు దానికి అనుగుణంగా మమ్ములను క్రమశిక్షణ లో పెట్టేందుకు వాడే పద్ధతులను కూడా వారు మార్చేవారు. మేము యుక్త వయస్సులో వున్నప్పుడు మేము ఒకవేళ దేవుని మార్గం నుండి తొలగిపోయి ఆయన

నామాన్ని దూషణ పాలు చేసే విధం గా మా ప్రవర్తన మారినట్లయితే, వారు, తాము చేసే సువార్త పరిచర్య లో ఇక కొనసాగలేరు అని తరచూ మమ్మల్ని హెచ్చరిస్తూ వుండేవారు.

## 5.3 పిల్లల విషయం లో జాగ్రత్త

మా అమ్మ, వారి ముగ్గురు పిల్లలకూ అయిదవ తరగతి వరకూ ఇంటివద్దే ట్యూషన్ చెప్పేవారు. ఈ తరగతి వరకు మేమంతా క్లాస్ లో మొదటి ర్యాంక్ లో వుండేవారిమి. ప్రతిరోజు మేము ఉదయం 7 నుండి 9 గంటల వరకూ కూర్చొని చదువవలసి ఉండేది. ఇక 6 వ తరగతి నుండి ఎవరి చదువుకునే సమయాన్ని వారే మెయింటైన్ చేసుకునే వారిమి .

మేము హై స్కూల్ లో వున్నా కాలం నుండి మమ్మల్ని వేకువనే 4 లేక 3 గంటల సమయం లో నిద్ర లేపి చదువుకొనమని మా తల్లితండ్రులు ప్రోత్సహించే వారు. చలిదినాలలో, ఒక కప్పు కాఫీ కాసి ఇచ్చి నిద్రలేపేవారు. మేము చదువు కునే సమయం లోనే, వారు తమ వేకువఝాము ఏకాంత ప్రార్థన లను విడిగా కొనసాగించేవారు.

మా తల్లితండ్రులు మమ్మల్ని గురించి వారు తీసుకొనగల అత్యంత జాగ్రత్త తీసుకునేలా ప్రయత్నించేవారు. మేము జబ్బుపడి నప్పుడు డాక్టర్ వద్దకు తీసుకొని వెళ్లి చూపించటం తో పాటు, మా పడక పక్కన కూర్చొని ప్రార్థించేవారు. ఎన్నో సందర్భాలలో దాదాపు రాత్రంతా వారు ఇలా ప్రార్ధించిన ఘడియలు మాకు గుర్తున్నాయి.

మా తల్లితండ్రులు సేవ లో పోరాడేటప్పుడు సాతాను కొన్ని సార్లు, పిల్లలమైన మాపై దాడి చేసేవాడు; ఈ విషయం ముందుగానే తెలిసిన మా తల్లి తండ్రులు వీటినుండి తప్పించేందుకు తగినంత ప్రార్థన తో సిద్ధపడి ఉండటానికి ప్రయత్నించేవారు.

## 5.4 డబ్బు పొదుపుగా వాడటం

మేము పిల్లలు గా వున్నప్పుడు క్రిస్మస్ మరియు బర్తడే లకు బట్టలు కుట్టించుకునేందుకు, మా నాన్న తో కలసి బజారు వెళ్లేవారిమి. అక్కడ వున్నా టైం లో పిల్లలుగా మాకు ఒక శోధన వుండేది: ఆనాటి 'బాంబే హోటల్' లో బిర్యానీ తినాలని!! ఆ రోజుల్లో ఒక్కొక్క ప్లేట్ 50 - 75 పైసల రేట్ వుండేది! సరే సంవత్సరానికి రెండు సార్లే కాబట్టి మా నాన్న

అనుమతించేవారు. అయితే మేము తినే సమయం లో ఆయన మాత్రం కేవలం నీరు తాగి సరిపెట్టుకునే వారు. పిల్లలకు పెట్టే ఆ కొద్ది ఖర్చు తో పాటు తాను తన భోజనం పై కూడా ఖర్చు చేసుకోటానికి ఆయన ఇష్టపడేవారు కాదు.

## 5.5 వుత్తరాలతో సంబంధం కొనసా గించుట

నేనూ, మా పెద్దతమ్ముడు వెస్లీ, డిగ్రీ వరకూ మేమున్న వూరు (మచిలీపట్టణం) లోనే విద్య కొనసాగించటం వల్ల, అప్పటివరకూ లేని అవసరత అయిన ఉత్తరాలు రాయటం, మేమిద్దరమూ విశాఖపట్నం లో చదువుకునే సమయం లో మా నాన్నకు తప్పలేదు. ఎన్నో ఉత్తరాలు మాకు రాస్తూ ఎన్నో సూచనలు, సలహాలు ఇస్తూ ఆయన మమ్మల్ని గురించి జాగ్రత్త తీసుకుంటూ వుండేవారు. మా స్నేహితులు, క్లాసుమేట్స్ అంతా ఆయన తీసుకునే జాగ్రత్త చూసి ఆశ్చర్య పడుతూ వుండేవారు.

ఇది ఆయన కేవలం పిల్లలు గా మా మీద చూపే జాగ్రత్త మాత్రమే కాకుండా, ఆయన తన ఆత్మీయ బిడ్డలైన అందరిమీదా ఇదే ప్రేమ చూపుతూ వుండేవారు. బందరు లో చదువుకొని మా చర్చ్ కు అటెండ్ అవుతూ ఆత్మీయ మేలు పొందిన తర్వాత వేరొక

వూరు వెళ్లి పోయిన అనేక మందితో ఆయన ఇదే విధం గా ఎన్నో ఉత్తరాలు రాస్తూ వారికి సూచనలు, సలహాల నిస్తూ ఆత్మీయ సంబంధం కొనసాగించటం మాకు ఆశ్చర్యం కలిగించేది.

## 5.6 పిల్లల ఆత్మీయ మేలుకొలుపు నిమిత్తం ప్రార్థించటం

మేము టీనేజ్ లో వున్నప్పుడు మా హృదయాలను దేవునికి సమర్పించుకొని, ప్రభువుని సొంత రక్షకునిగా పిల్లల మైన మేమంతా జీవించాలని మా తల్లి తండ్రులు ఆశించి, దాని విషయమై మాతో మాట్లాడుతూ అనేక మార్లు కలసి ప్రార్థించేవారు. దాని పర్యవసానం గా - వెంటనే కాకపోయినా కొంత కాలం తర్వాత మొదట నేను, ఆ తర్వాత వెస్లీ దేవుని యొక్క వెలుగు లోనికి రాగలిగాము.

## 5.7 తమ పిల్లల విషయాలలో ప్రార్థించి నిర్ణయాలు తీసుకోటం

తమకు మార్గదర్శకం గా వుండే ఆనాటి సీనియర్ సేవకుల నుండి మా తల్లితండ్రులు - పిల్లల మైన మా - ముఖ్యమైన విషయము లన్నిటిలో కూడా ప్రార్థించి నిర్ణయం తీసుకుంటే దేవుని ఆశీర్వాదం చూడవచ్చు అని నేర్చుకున్నారు.

నేను కాలేజి లో చేరే అనేక దినముల ముందు నుండి మా తల్లి తండ్రులు ప్రార్థించి నన్ను కాలేజి లో చేర్పించారు. ఇక ఇంటర్మీడియట్ లో సెకండ్ లాంగ్వేజ్ గా 'తెలుగు' తీసుకోవాలా లేక 'హిందీ' తీసుకోవాలా? అనే విషయం ప్రశ్నకు వచ్చినప్పుడు, ఆ రోజుల్లో మా ఇంటికి కూటముల నిమిత్తమై కాకినాడ నుండి వచ్చిన దైవసేవకులు పి. విజయకుమార్ గారి సలహా మేరకు హిందీ తీసుకొని చదవటం జరిగింది. ఈ విధంగా మా చదువు విషయం లో సహా ప్రార్థన పూర్వకం గా నిర్ణయాలు తీసుకోటం జరిగేది.

నా డిగ్రీ పూర్తయిన తర్వాత ఏ కోర్స్ చెయ్యాలి అనే విషయం లో కూడా మా తల్లి తండ్రులు ప్రార్థించి నన్ను ఎం యస్సి

చేసేందుకు విశాఖపట్నం పంపించారు. ఇంటినుండి మొదటిసారి దూరం గా వుండటము వల్ల కొన్ని సర్దుబాట్లు నేను చేసుకోనవలసి వచ్చినప్పటికీ దేవుడు మా తల్లి తండ్రుల ప్రార్థనలు, దేవుని పిల్లల ప్రార్థనలను బట్టి నేను ఆ కోర్స్ పూర్తి చేయునట్లు దేవుడు సహాయం చేసాడు. ఆ పిమ్మట అనేకమైన సందిగ్ధ పరిస్థితులు వున్నప్పటికీ, వున్నా వూరులోనే వుద్యోగం దేవుడనుగ్రహించాడు.

ఇక మా పెద్ద తమ్ముడు వెస్లీ ఇంటర్మీడియేట్ పూర్తి చేసిన తర్వాత - ఇంజనీరింగ్ కు వెళ్ళాలా? లేక బి యస్సి చెయ్యాలా అనే విషయం కూడా ప్రార్థించి మా నాన్న ఇంజనీరింగ్ చేసేందుకు తనకైతే ప్రభువు నుండి గైడెన్స్ లేదని తెలుస్తున్నదని, అయితే అది తన జీవితం కాబట్టి తాను వెళ్ళాలి అని అనుకుంటే తననే నిర్ణయించుకోమ్మని చెప్పినప్పుడు వెస్లీ బి యస్సి చేసేందుకు నిర్ణయించుకున్నాడు.

# 6

## యవనుల మధ్య సేవ

కీ. శే. ఎన్ దానియేలు గారు (ఎల్ ఈ ఎఫ్ సంస్థాపకులు) మొదట ప్రార్థన చేసి మా నాన్న ను మచిలీపట్టణం పంపేటప్పుడు యవనుల మధ్య దేవుడు ఆయనను వాడుకోనున్నాడని చెప్పి పంపించటం జరిగింది. అదే విధం గా మా తల్లి తండ్రులు అక్కడ సేవను కొనసాగిస్తున్న సమయం లో ప్రవచనం గా చెప్పబడిన ఈ మాటలు నెరవేరటం వారు చూసారు.

1960 - 1970 దశాబ్దం లో మేమున్న స్థలం, రెండు గవర్నమెంట్ హాస్టల్స్ కు సమీపం లో ఉండటం తోమా చర్చ్ లో ఎక్కువ మంది యవనులే వుండేవారు. ఆతర్వాత కాలం లో చుట్టుపక్కల మరిన్ని

హాస్టల్స్ రావటం వల్ల, సేవ ఎక్కువ శాతం విద్యార్థుల మధ్యనే కొనసాగింది.

1952 నుండి 1965 వరకూ కూడా మా నాన్న యవనులుగా వుంటూ, ఆయనే ఈ హాస్టల్స్ కు వెళ్లియవ్వనస్థులను ప్రార్థనకు ఆహ్వానిస్తూ వుండేవారు; ఆతర్వాత ఈ పనిని ఆయన సేవలో ఆత్మీయ మేలు నొందిన ఇతరులు, యువకులు కొనసాగించేవారు.

ఆదివారం సాయంత్రం 8 గంటల నుండి ప్రారంభమైన ఈ యవ్వనస్థుల ప్రత్యేక కూటం ఒక గంట పాటు సాగేది. ఈ ఆరాధన లో పాటలు ఇంగ్లీష్ లో పాడేవారు; అయితే వాక్యం మాత్రం తెలుగు లోనే ఇవ్వబడేది. చాలామంది యవ్వనస్తులు ఈ కూటానికి హాజరై ఆత్మీయ మేలు నొందుతూ వుండేవారు. మేము అటు తర్వాత చాలా కాలం పిమ్మట కలిసిన వ్యక్తులలో అనేక మంది ఎక్కడెక్కడో స్థిరపడిన వారు, వారి యవ్వనప్రాయంలో బందరు లో చదువుకొంటూ మా చర్చ్ కూటాలకు హాజరయ్యేవారని చెప్తూ వుంటే, మేము ఆశ్చర్యపడుతూ ఉండేవారం.

తానే 16 సంవత్సరాల వయస్సు లో ప్రభువును తెలుసుకున్నా వ్యక్తిగా, మా నాన్న యవనుల మధ్య సేవ ఆవశ్యకత ను బాగా గుర్తించిన వారుగా వుండేవారు. మా నాన్న సేవలో ప్రభువు ను సొంత రక్షకుని గా అంగీకరించిన వారు, లోతైన ఆత్మీయ అనుభవం లోనికి వెళ్లిన అనేక నేపధ్యముల (backgrounds) నుండి వచ్చిన ఎంతోమంది వుండే వారు.

మేము చిన్నవారిగా వున్నా కాలం లో మా నాన్న వీధి ప్రసంగాలు చెయ్యటం, కరపత్రాలు పంచటం వంటి సేవ కూడా చేసేవారు. తర్వాత కాలం లో - సెలవు దినాలు, పండుగ దినాలలో, సంచులలో కరపత్రాలు తీసుకొని మా చర్చ్ కు వచ్చే కొంత మంది యవ్వనస్థులతో కలసి వీధులలో వాటిని పంచేందుకు వెళ్లేవారు. చాల సార్లు ఈ పనిని ఎగతాళి చేసేవారిలో - కొందరు యువకులు క్రైస్తవ సమాజము నుండి సహితం వుండేవారు. అయినా దేవుని ఆజ్ఞకు విధేయులౌతూ వారు ఈ పనిని చేస్తూ వుండేవారు.

## 6.1 యవ్వన విశ్వాసులు - క్రమ శిక్షణ

క్రైస్తవ విశ్వాస నడక లో క్రమశిక్షణ ఆవశ్యక ను బాగుగా ఎరిగిన మా నాన్న, ప్రతి విశ్వాసి యొక్క విశ్వాస జీవితాన్ని గురించి ఒక కంట కనిపెడుతూ వుండేవారు. ఒక సంఘ కాపరిగా వారి ఆత్మల విషయమై తన బాధ్యతను బాగుగా ఎరిగిన వ్యక్తిగా - విశ్వాసులు చిన్న చిన్న పొరపాట్లు చేసినప్పుడు స్వల్ప మందలింపు తో సరిచేసే అయన, కొన్ని తీవ్రమైన తప్పిదములకు విశ్వాసులను బహు కఠినం గా గద్దించే వారు. దీనివల్ల చాలా క్రమశిక్షణ గల సంఘం గా మా చర్చ్ వుంటూ ఉండేది.

ఆ రోజుల్లో మా చర్చ్ నుండి కొన్ని గజాల దూరం లోనే ట్రైనింగ్ లో వుండే నర్సుల వసతి గృహం ఉండేది. దానితో చర్చ్ ముందు రోడ్డు దినమంతా డ్యూటీకి వెళ్లే, లేక డ్యూటీ పూర్తి చేసుకొని వచ్చే నర్సులతో ఉదయం 7 గంటలనుండి రాత్రి 8 వరకూ చాలా రద్దీ గా ఉండేది. అయితే మా చర్చ్ కి వచ్చే వారిలో చాలా మంది యవ్వన బాలురైనప్పటికీ, వీరు వారి పట్ల అమర్యాదగా ప్రవర్తించటము అనేది ఏనాడూ లేదు! వీరు ఎక్కడి పోతున్నారో లేక ఎక్కడకు తిరిగి వస్తున్నారో ఎరిగిన వారుగా బహు హుందాగా ప్రవర్తించేవారు కావటం తో, ఏ ఒక్క యవ్వన స్త్రీ మా

నాన్న దగ్గరకు వచ్చి మా చర్చ్ కు వచ్చే యవ్వన బాలుర విషయం లో పిర్యాదు చెయ్యవలసిన అవసరం ఏనాడూ రాలేదు.

ఈ విధమయిన క్రమశిక్షణ నొందిగా వారుగా ఈ విద్యార్థులు తమ విద్య బందరులో పూర్తి చేసుకొని తమ తమ గ్రామాలకు వెళ్ళినప్పుడు అక్కడ తమ సొంతగా సువార్త సేవను దీనమైన రీతిలో ప్రారంభిస్తూ వుండేవారు. మా నాన్న ఈ గ్రామాలకు అప్పుడప్పుడు వెళ్లి పరిశీలించి సేవకొనసాగించి వస్తూ వుండేవారు. ఈ విధం గా ప్రారంభమైన కొన్ని గ్రామాలలో సేవ మా నాన్న ప్రభువు సన్నిధిలోనికి వెళ్ళిపోయిన నలభై సంవత్సరాల (2022 కు) తర్వాత సహితం కొనసాగుతూ వున్నది.

అమృతకుమార్ అనే యువకుడు ఆ దినాల (1970s) లో చదువు నిమిత్తం బందరు వచ్చి మా తల్లితండ్రుల సేవలో ప్రభువును తెలుసుకున్న తర్వాత, వివాహం చేసుకొని భార్యాభర్త లిద్దరూ ఒకే చోట టీచర్స్ గా పని చేస్తున్న సమయం లో, తాను ప్రభువు పిలుపును అందుకొని అమలాపురం నుండి నేపాల్ కు వెళ్లి ఒక మిషనరీ గా పని చేసి ప్రభువు నామాన్ని ఘనపరచి న

వ్యక్తి. తాను కేవలం విశ్వాసం పైనే ఆధార పడి సేవ చేశారు. ఈయన జీవితం అనేకులకు సవాలు కరం గా వుంది.

## 6.2 కౌన్సిలింగ్

తాను ప్రభువు వద్దకు నడిపించిన వారు చేసే సహవాసాలు, వారు కలసి సన్నిహితం గా తిరుగే వ్యక్తుల విషయాలలో కూడా మా నాన్న చాల జాగ్రత్త వహిస్తూ వుండేవారు. మరి ముఖ్యం గా వివాహ విషయంలో వీరు తమ నిర్ణయాలు తీసుకునే టప్పుడు, కేవలం పై పై విషయాల పైనే దృష్టి పెట్టవద్దనీ, పెద్దవారిని సంప్రదించాలని, ప్రభువు సన్నిధిలో మోకాళ్ళ పై వేచివుండి నిర్ణయం తీసుకోవాలనీ వారికి చెప్తూ వుండేవారు. ఈ విషయం లో ఆయన మాట తీసుకొని జాగ్రత్త పడిన వారు కొందరుంటే, మరికొందరు తప్పటడుగులు వేసి, ఆ పిమ్మట తమ తప్పు గ్రహించి దేవునిలోనికి తిరిగి వచ్చిన వారూ వున్నారు.

## 6.3 తప్పుబాట పట్టి జారిన ఆత్మలను ప్రేమతో తిగిరి పొందుట

ఏ కారణం తో అయినా ఒక విశ్వాసి ఏదైనా తీవ్రమైన తప్పిదం చేసి దైవ మార్గం నుండి తప్పి పోయినప్పటికీ, సరైన గ్రహింపు, ప్రశ్చాత్తాపం కలిగి, చేసిన తప్పును సరైన విధం గా సరిచేసు కున్నట్లయితే అతను క్రీస్తుయొక్క ఒడి లోనికి తిరిగి చేరగలడు అని మా తల్లితండ్రులు నమ్మేవారు. ఈ విధమైన ఆలోచన కలవారుగా వారు, వారి సేవలో విశ్వాసం లోనికి నడిపించబడిన కొందరు విశ్వాసులు తమ జీవితం లో తప్పయిన ఎంపికలు చేసి దేవుని సన్నిధికి దూరమైనప్పటికీ, వారు ససేమిరా ఇష్టపడకపోతే తప్ప, వారితో కొంత సంబంధం కలిగి తిరిగి వారిని క్రీస్తు కొరకు పొందాలని ప్రయత్నించేవారు.

ఆ మొదటి దినాలలో మా తల్లితండ్రుల సేవలో ప్రభును తెలుసుకొని ప్రభువు నిమిత్తం చాలా రోషం కలిగి బ్రతుకుతూ, తన మాదిరి జీవితం ద్వారా ఇతరులను సహితం ప్రభువు సన్నిధిలోనికి తీసుకొని వచ్చిన ఒక యువకుడు, ఆ పిమ్మట తన జీవితం లో కొన్ని తొందరబాటు నిర్ణయాలు తీసుకొనటం

ద్వారా దేవుని నుండి, ఆయన బిడ్డలనుండి దూరమై పోయి పొగ త్రాగే అలవాటుకు సహితం తిరిగి లోకం లోనికి వెళ్ళిపోయాడు.

ఆ దినాలలో మా నాన్న ఉజ్జీవ కూటాలు చెయ్యటానికి వెళ్తూ చాల తరచుగా ప్రయాణిస్తూ వుండేవారు. ఒకానొక సారి ఇలా వెళ్తూ ఒకానొక ఊరులో బస్సు ఆగినప్పుడు బస్సుకు బయట దగ్గరలోనే ఈ యవనుడు నిలబడి పొగత్రాగుతూ కనిపించాడు. మా నాన్న వెంటనే పేరుతో అతనిని పిలిచినప్పుడు అతనికి ఎక్కడో విన్న గొంతు లా ఆ స్వరం అనిపించి, అటు ఇటు తిరిగి చూసినప్పుడు మా నాన్న బస్సు లోపలినుండి చెయ్యి వూపుతూ దగ్గరకు రమ్మని పిలవటం కనిపించింది. మా నాన్నను చూడగానే గత దినాలలో తాను ప్రభువు సన్నిధిలో గడుపుతూ నెమ్మది కలిగివున్న దినాలలో - మా తల్లితండ్రులు ఏ విధం గా తన ఆత్మీయ విషయమై శ్రద్ధ తీసుకునే వారో గుర్తుకు వచ్చి అతని కండ్లలో నీరు తిరిగాయి. తాగుతున్న సిగరెట్ పడవేసి వచ్చి మా నాన్నతో మాట్లాడి ప్రభువుకు తన్ను తాను తిరిగి అప్పగించుకొని విశ్వాసిగా జీవించటం ప్రారంభించాడు. ఆతర్వాత మరల సిగరెట్ ముట్టలేదు కానీ ప్రభువు నిమిత్తమై తాను పనిచేసే APSRTC లో

బహుబలమైన సాక్షిగా బ్రతికాడు. ప్రస్తుతం రిటైర్ అయిపోయి పూర్తి ప్రభువు సేవలో వున్నారు.

ఇలా యవ్వనులుగా రక్షింపబడి ఏ కారణం చేతనో లోకం లోకి జారిపోయిన ఏంతో మందిని మా తల్లితండ్రులు తగిన రీతిగా ప్రేమించి ఆదరించి వారిని తిరిగి ప్రభువు కోసం సంపాదించారు.

## 6.4 ప్రార్థన యొక్క ప్రాముఖ్యత

వ్యక్తి హృదయాంతరంగం నుండి వచ్చే ప్రభువు పట్ల అతనికి కల భక్తి విశ్వాసాలు ఒక వ్యక్తి జీవితం లో ప్రాముఖ్యమైనవి కానీ, ఇతర మనుష్యుల పెదవుల నుండి ఒక వ్యక్తికి వచ్చే పొగడ్తలు, ప్రశంసలు ఇంకా ఇతరమైనవి ఏ విధముగానూ ఎన్నతగినవి కాదు - అని రక్షణ నొందిన సమయం నుండి మా తల్లితండ్రులకు ప్రభువు నేర్పించిన అనేక పాఠము లలో ఇది ఒకటి!

ప్రభువు సన్నిధి లో ప్రతి దినం అలవాటు తప్పకుండా గడిపే ఏకాంత ప్రార్థన సమయం, విశ్వాసి జీవితం లో అత్యంత ప్రాముఖ్యమైనది, ఇది పోగొట్టుకుంటే, మొత్తం రక్షణానుభవం కృశించి పోగలదు అని ప్రభువు వారికి ఖండితంగా నేర్పటం తో,

మా తల్లితండ్రులు - ఏకాంత ప్రార్ధనకు అత్యంత ప్రాధాన్యత నిచ్చి కొనసాగుతూ, సంఘం లోని ప్రతి సభ్యునికి ఇదే నేర్పించేవారు.

ఆ దినాలలో బందరు లోని నోబుల్ కళాశాల బంగ్లా వెనుక దట్టమైన సరుకు చెట్ల తోటలు ఉండేవి. ఆ రోజుల్లో పగటిపూట అయినా అటు వెళ్ళాలి అంటేనే ఎంతో ధైర్యం కావలసి వచ్చేది. అయినా ఆ తోటలకు ప్రతిదినం, సాయంత్రం ఏకాంత ప్రార్ధనకు వెళ్ళటం, సంఘంలో ప్రార్ధనకు వచ్చే ఇతరులను, యవ్వనస్థులను తీసుకొని వెళ్ళి వారికి ప్రార్ధన జీవితాన్ని అలవాటు చెయ్యటం - మా నాన్న యొక్క అలవాటు గా ఉండేది. ఇక రోజు వారీ పనులన్నీ పూర్తి చేసుకున్న మా అమ్మ ప్రతి దినం తన ఒంటరి ప్రార్ధన ను కొనసాగించటం, సంఘం లోని ఇతర స్త్రీలు, యవ్వన స్త్రీ లతో కలసి వారికి ప్రార్ధన జీవితం అలవాటు చెయ్యటం - ఏ విధం గానూ నిర్లక్ష్యం చేసేవారు కారు. ఇక కూటాలు జరుగవలసిన తేదీలకు ముందు, సంవత్సరాంత దినాలలో, ఇంకా ఏదైనా అంశం విషయమై ప్రత్యేకంగా ప్రార్ధన చెయ్యవలసిన అవసరం వస్తే, మా నాన్న ఒక వాటర్ బాటిల్ లో నీళ్లు తీసుకొని ఉదయాన్నే వెళ్లి ఆ తోటలలో ప్రార్ధిస్తూ గడిపే వారు. ఈ విధమైన ప్రార్ధన జీవితం అలవాటు చేసుకోటం, తమ

ఆత్మీయ పిల్లలకు సహితం దానిని అలవాటు చెయ్యటం వల్ల సేవలో ఎన్నో సమస్యలు ఎదురైనప్పటికీ, వాటిని ఎదిరించి, జయించి - ఎంతో గొప్ప ఫలితాన్ని వారు చూడగలిగారు.

వివాహ మైనదగ్గర నుండి మా తల్లితండ్రులు ఇద్దరు కలసి - వారిరువురి మధ్య ఏకత్వం కోసం, కుటుంబ సమస్యల కోసం, సంఘ సమస్యల కోసం ప్రార్ధించటం అలవాటు చేసుకున్నారు. ఎన్నో సార్లు కఠినమైన సమస్యల కోసం వారిద్దరూ ఉపవాసం వుండి ప్రార్ధించేవారు. ఇలాటి ప్రార్ధన జీవితమే వారి జీవితాంతం ప్రభువు మీద అన్ని వేళలా అనుకునేందుకు పునాదిగా వుండింది.

ఈ విధమైన ప్రార్ధన జీవితం ను తమకు తాముగా అలవాటు చేసుకొని, దాని ప్రాధాన్యతను ప్రతి విశ్వాసి జీవితంలో బాగా గుర్తెరిగిన వారిగా, మా తల్లి తండ్రులు మా చర్చ్ కి వచ్చే ప్రతి ఒక్కరినీ - మరి ముఖ్యం గా యవ్వనస్థులను ప్రతిదినమూ ఒంటరి ప్రార్ధనకు సమయం కేటాయించుకొని (సాధారణం గా ప్రతి సాయంత్రం తాము స్కూల్స్, కాలేజీ ల నుండి, లేక ఆఫీస్ నుండి వచ్చిన తర్వాత) దానిని ఖచ్చితంగా అమలు జరుపమని చెప్తూవుండేవారు. ఆ దినాలలో పాత రైల్వే స్టేషన్

ప్లాట్ఫారం పొడవునా కూర్చొని (ప్రస్తుతం ఇదే ప్రదేశంలో మరో కొత్త రైల్వే స్టేషన్ ప్రస్తుతం రూపుదిద్దు కుంటున్నది) ఎదురుగ వున్నా వరిపొలాలు చూస్తూ సాయంత్రం సముద్రం నుండి వీచే చల్ల గాలిలో ఎంతోమంది ఒంటరి ప్రార్థన లో గడుపుతూ వుండేవారు. చాలా మంది విద్యార్థులు రైల్వే స్టేషన్ లోని పట్టాలు, ఆ పై వున్నా పంట పొలాలు సహితం దాటి, వరిపొలాల్లోకి వెళ్లి ప్రార్థన చేస్తూ వుండేవారు.

## 6.5 ఉత్తర ప్రత్యుత్తరాలు

ఉత్తర ప్రత్యుత్తరాలు జరపటం, ఇతరులతో సంబంధం కొనసాగించటం లో మా నాన్న చాలా ఖచ్చితం గా వుండేవారు. ఇతర వూరులలో ఆయనకు తెలిసి, ఆయనతో సంబంధం కలిగిన వారే కాకుండా, బందరు లో ఆయన సేవలో మేలునొంది, ఆ పిమ్మట రకరకాల కారణాల వల్ల బందరు విడిచి దూర ప్రాంతాలకు వెళ్ళిన అనేక మందితో ఆయన - వారు ఎలా వున్నారు? ఆత్మీయ జీవితం లో ఎలా కొనసాగుతున్నారు? వారికి ఏమైనా ఆత్మీయ సలహాలు కావలసి ఉన్నదా? అనే విషయాలు వారి నుండి తెలుసుకొని సహాయం చేస్తూ, వారి

కొరకు తరచూ ప్రార్థిస్తూ వుండేవారు. ఈ క్రమం లో వారికి అనేక ఉత్తరాలు రాయటం, కొన్ని మంచి పుస్తకాలు, ఇతరములు పంపటం చేస్తూ వుండేవారు.

# 7

# సండే స్కూల్

## 7.1 ప్రారంభం

తమ సొంత నిర్ణయాలను తీసుకొన వలసిన వయస్సు వచ్చినప్పుడు దేవుడు ఆశించే మార్గాలను మనుష్యులు ఎంచుకోవాలంటే, అందుకు సరైన హిత బోధకు అతి అనుకూల సమయం 'బాల్యం' అని, అందుకు పిల్లల మనస్సులు బహు అనుకూల మైనవని మా తల్లితండ్రులు విశ్వసించేవారు. అందువల్ల ఆ సేవకు ప్రాధాన్యత నిచ్చి సండే స్కూల్ ను 1963 సమయం లో బ్రదర్. బూసి ఇశ్రాయేలు (వీరిని గురించి ఈ పుస్తకం మొదట్లో చెప్పబడింది.) గారింట్లో ప్రారంభించారు. ఇప్పటికే ఈయనను గురించి చెప్పబడినట్లుగా - ఇశ్రాయేలు గారు చాల అనుభవం కలిగి, అత్యంత క్రమశిక్షణ గల వ్యక్తి గా

వుండేవారు. ఆయన ఎప్పుడు చూసినా మోకాళ్లపై వుండి ప్రార్థిస్తూ వుండేవారు; పిల్లలలో చిలిపితనాన్ని ఏ మాత్రం ఆయన సహించేవారు కారు.

నేను, మా తమ్ముడు వెస్లీ, ఆ దినాలలో ఇంటి నుండి చాలా దూరం లోవున్నా రైలుపేట లో వుండే ఇశ్రాయేలు గారి ఇంటికి ఆదివారం మధ్యాహ్నం, మా ప్రదేశము నుండి ఇంకొంతమంది పిల్లలతో కలసి సండేస్కూల్ కు వెళ్లేవారిమి. రోడ్లు సరిగా లేని ఆరోజుల్లో ఇసుక డొంక లో చుట్టుపక్కల ఇళ్ళు గానీ, జనసంచారం గానీ లేకుండా వెళ్ళటం చాలా భయంగా ఉండేది.

ఇశ్రాయేలు గారింట్లో సన్డేస్కూల్ కు దాదాపు ముప్పై మంది పిల్లలు వచ్చేవారు. బైబిల్ నుండి కథలు, జీవితం లో ఎన్నటెన్నటికీ జ్ఞాపకం ఉంచుకొన వలసిన ఉపదేశాలు - మాష్టారు చెప్పేవారు. ఇక బైబిల్ నుండి కొన్ని అధ్యాయాలను (కొండమీది ప్రసంగం వంటివి) వారానికి కొన్ని వచనాలు చొప్పున అధ్యాయం పూర్తి చేసేలా, వాక్యం మాతో కంఠస్థం చేయిస్తూ వుండేవారు . దీనితో సంవత్సరాంతానికి బైబిల్ నుండి కొన్ని అధ్యాయాలు పిల్లలు పూర్తిగా కంఠస్తం చేశేసే వారు! ఇక సంవత్సరాంతం లో 'ర్యాలీ' ఉండేది. పిల్లలకు ప్రైజులు,

తినుబండారాలు పంచి ఆ తర్వాత కాలనీ చుట్టూ డ్రమ్ము ఇతర వాయిద్యాలు వాయిస్తూ పిల్లలమైన మేము తిరిగి వచ్చేవారిమి.

## 7.2 సండేస్కూల్ - స్థల మార్పు

చాల ప్రార్థించి, కనిపెట్టిన తర్వాత సండే స్కూల్ జరిగే స్థలాన్ని రైలుపేట లోని ఇశ్రాయేలు మాస్టారు ఇంటి నుండి మల్కాపట్నం లో ఆరాధనలు జరిగే మా ప్రార్థన పాక లోనికి మార్చటం జరిగింది. దానితోపాటు సమయం కూడా మధ్యాహ్నం నుండి ఉదయం (చర్చ్ జరిగే సమయం కు ముందు) జరిగే విధం గా మార్చటం జరిగింది. చిన్న నుండి పెద్దవరకూ అంతా ఒకటే తరగతి! మా అమ్మ దానికి టీచర్. అన్ని ఏజ్ గ్రూపులకు ఒకే సారి బోధించటం ఆమెకు సవాలు కరమైన విషయమే, అయితే ఆమె కూడా ఉపాధ్యాయురాలిగా ఈ పనిని చాలా చాకచక్యం గా చేసేవారు. దానితో హాజరయ్యే పిల్లల సంఖ్య ఏనాడూ తగ్గలేదు, పైగా పెరుగుతూ ఉండేది! పిల్లలు గా మేము కథల రూపం లో చెప్పబడే పాఠాలు నేర్చు కునేందుకు ఒక ఆదివారం ముగిసిన వెంటనే మరో ఆదివారం కోసం ఆసక్తి గా కనిపెట్టేవారము.

మేమంతా - సృష్టి ప్రారంభం నుండి ఎస్తేరు కథ వరకూ వున్నా సన్నివేశాలూ, ఇక అందరికీ  పరిచయం అయిన కీర్తనలు, సామెతలు, కొత్తనిబంధన లోని ఉపనామానాలు, ఇతర కథలు - ఇవన్నీ సండే స్కూల్ లో నేర్చుకొన్న విషయాలే! అబ్రాహాము తో ప్రారంభించిన కథను ఇశ్రాయేలీయులు కనాను ను కైవసం చేసుకోవటం వరకూ వున్నా గాథను గొలుసు గా,  అంచెలంచెలు గా చెప్తూ పూర్తి చెయ్యటం తో పిల్లలయిన మాకు జిజ్ఞాస తో కథను పూర్తిగా కొద్ది వారాలలోనే విని అర్థం చేసుకునే అవకాశం వుంటూ ఉండేది.

ఇక సంవత్సరం చివరిలో మేము, ఆ సంవత్సరం కంఠత పెట్టిన బైబిల్ అధ్యాయాలను అన్నిటినీ అప్పగించటం తో పాటు, మేము ఆ సంవత్సరం అంతా  విన్నా కథలు, ఇతర భాగముల నుండి రాత పరీక్ష కూడా వ్రాసే వారిమి. వీటిలో విజేతలకు ప్రైజులతో పాటు ప్రతి విద్యార్థికి ప్రైజు, ఇంకా ఇతర ప్రైజులు సహితం ఉండేవి. ఆ రోజుల్లో కొందరు పిల్లలు ఒక్క తప్పు కూడా లేకుండా బైబిల్ లోని పెద్ద పెద్ద అధ్యయాలు  అప్ప చెప్తుంటే, వినేందుకు ఎంతో ఆసక్తిగా ఉండేది. ఒకే క్లాస్ గ వున్నా ఈ సన్డే స్కూల్ చాల ఏండ్లు అలాగే సాగింది.

## 7.3 సండే స్కూల్ ని బ్యాచ్ లు గా విడకొట్టటం

అప్పటివరకు చేస్తున్నట్లు ఒకే క్లాస్ లో అన్ని వయస్సుల పిల్లలను కూర్చోబెట్టి వారికి బోధించటం, తర్వాత వారికి పరీక్షలు ఒకే స్థాయిలో నిర్వహించటం ను మార్చాలి అనే ఉద్దేశ్యం తో మొత్తం సండేస్కూల్ ను నాలుగు గ్రూపులు గా చెయ్యటం జరిగింది: కేజీ నుండి మూడవ తరగతివరకు మొదటి క్లాసు, దీనికి టీచర్ మా అమ్మ; 4,5 మరియు 6 తరగతులు రెండవ క్లాసు, దీనికి టీచర్ బ్రదర్. నోబుల్ గారు; 7,8 మరియు 9 తరగతులు మూడవ క్లాసు, దీనికి టీచర్, బ్రదర్. ప్రభాకర్రావు గారు; ఇక 10 నుండి ఆపై తరగతులకు ఇంగ్లీష్ లో బ్రదర్. పుష్పరాజ్ గారు క్లాసులు తీసుకుంటూవుండేవారు.

1983 నుండి చిల్డ్రన్స్ రిట్రీట్స్ అనేవి ఆరంభించటంతో, మొదటి నుండి ఆనవాయితీ గా చేస్తూ వస్తున్నా- ప్రతిసంవత్సరం చివరిలో జరిపే సండేస్కూల్ పరీక్షలు, వాటిలో ఉత్తీర్ణులకు ఇచ్చే బహుమతి ఉచ్ఛవాలు (ర్యాలీస్) ఇక అప్పటి నుండి ఉపసంహరించబడినాయి.

## 7.4 మొదటి సండేస్కూల్ క్రిస్మస్ నాటిక

1972 సంవత్సరం లో ప్రత్యేక ఆంధ్రా రాష్ట్రం కోసం కనీవినీ ఎరుగని రీతిలో ఆందోళన జరగటం తో ఆ రోజుల్లో స్కూల్ పిల్లలమైన మేము నెలల తరబడి ఇంటికే పరిమితం కావలసి వచ్చింది. ఆ సమయం లో మేము మా నాన్న దగ్గరకు వెళ్లి సండేస్కూల్ పిల్లలమైన మేము ఒక క్రిస్మస్ నాటిక నేర్చుకొని వేసేందుకు వీలవుతుందా అని అడిగాం. ఈ పనిని బ్రదర్. ప్రభాకర్రావు గారికి చెప్పి వీలైతే చూడమని చెప్పటంతో - ఆయన స్క్రిప్ట్ తయారు చెయ్యటం, పిల్లలు రిహార్సల్స్ కు రెగ్యులర్ గానూ, ఉత్సాహం గాను అటెండ్ అయ్యేలా చూడటం తో - నాటిక ను ఆ మొదటిగా నిర్మించిన తాటాకు పాకలో అద్భుతంగా వెయ్యటం చక చకా జరిగి పోయింది.

ఈ నాటికను సన్డేస్కూల్ పిల్లలు వేసేందుకు అనుమతి ఇచ్చినప్పటికీ, మా నాన్న అనుభవం గల ఒక దైవ సేవకునిగా, మరియు తానే హైస్కూల్ రోజుల్లో డ్రామాలు వేసిన అనుభవం గల వ్యక్తిగా - ఈ డ్రామాల వెయ్యటం వెనుక పొంచివున్న సాతాను ఉరులను ఎరిగిన వారై, మమ్మల్ని ప్రార్థన ఎక్కువ చెయ్యాలని, వీటిపై మనస్సు ఎక్కువ పెట్టకూడదని తరచూ

హెచ్చరిస్తూ వుండేవారు. కడుగ బడిన హృదయాంత రంగం నుండి రావలసిన స్తుతి, కృతజ్ఞతకు ఈ డ్రామాలు, మ్యూజిక్ ఎన్నడూ సమ వుజ్జీలు కావని ఎరిగినవారై అయన, వాటి స్థానం ఇవి ఎన్నడూ ఆక్రమించకూడదు అని చెప్తూ వుండేవారు.




చిత్రం *5: 1978* బందరు సెమీక్రిస్మస్ కూటము లో ప్రసంగిస్తున్న ఏబెల్ గారు



చిత్రం *4:* ఆ నాటి సండేస్కూల్ పిల్లలు, యువకులతో ఏబెల్ దంపతులు *(షుమారు 1967)*

<u>కూర్చున్న మొదటి వరుస</u>*:* నాను, బాబ్జి, చిన్ని, లియోనా, యోహాను, యేసుపాదం, చంటి, కుమార్ అతని తమ్ముడు, విజిటర్, ఫ్రాన్సిస్

<u>కూర్చున్న రెండో వరుస</u>*:* శోభన్ కుమార్, స్వర్ణలత, మెర్సీ,చిట్టమ్మ, బుజ్జి, చిన్నూ, సుకన్య, జెరూషా, సునీతి, విజిటర్, సునీల్

<u>మూడవ వరుస</u>*:* చెల్లమ్మ, రాజు, ఏబెల్ దంపతులు

<u>నిలుచున్న వరుస</u>*:* నోబుల్, జేమ్స్, వెంకటేశ్వర రావు, ప్రసాద్, ఫ్రెడ్డీ, ప్రభాకర్ రావు

# 8

# చర్చ్ విస్తరణ

1960s లో దాదాపు ప్రతి సంవత్సరం రెండు సార్లు మా చర్చ్ కూటాలు జరిగేవి: జూలై లేక ఆగస్టు నెలలో విద్యార్థులకు, ఇక నవంబరు నెలలో అందరికీ కూటాలు జరిగేవి. ఒక్క 1966 నవంబరు లో తప్ప ఈ కూటాలన్నీ మా చర్చ్ కాంపౌండ్ లోనే జరిగేవి. ఇక 1970s లో సేవ జరిగే స్థలాలు పెరగటం, సువార్తికు లకు తీరిక లేని కారణం తో నవంబరు లో జరిగే కూటాలు రెగ్యులర్ గా జరుగలేదు; కానీ విద్యార్థుల కూటాలు మాత్రం సాధ్యమైనంత వరకూ ప్రతి ఏడూ జరిగేవి. కూటములకు వెదురు బొంగులు వాడి పందిరి వేసి పైకప్పుకు లోకల్ ఏజెన్సీస్ నుండి అడిగి తీసుకొన్న టార్పాలిన్స్ ఉపయోగించే వాళ్ళము. ఆ దినాలలో ఇప్పటిలా నవంబరు లో తుపానులు లేక పోయినా, జూలై ఆగష్టు నెలలలో

వచ్చే నైరుతీ ఋతుపాతము వల్ల వచ్చే వర్షాల వల్ల కొంత ఇబ్బంది ఉండేది. తర్వాతి కాలం లో ఈ టార్పాలిన్ పందిళ్ళకు బదులు షామియానాలు వాడుకలోకి వచ్చాయి.




చిత్రం *5: 1970s* మధ్య కాలం లో బందరు లో ఒకానొక కూటముల సమయం

ప్రతి సంవత్సరం జరిగే ఈ కూటాల లో సువార్త చే ముట్టబడిన అనేకులు కూటాల అనంతరం చర్చ్ కి రెగ్యులర్ గా వచ్చి రక్షణానుభవం సంపాదించుకొని, మా తల్లితండ్రులసేవద్వారా

లోతైన అనుభవం లోనికి నడిపించబడుతూ వుండేవారు. వీరిలో అనేకులు ఆ తర్వాత కాలం లో సువార్తికులు గా (పాక్షికం గా లేక పూర్తి సమయ సేవకులుగా) పనిచేసేవారు.

## 8.1 చర్చ్ స్థలాన్ని కొనుగోలు చేయుట

1967 వ సంవత్సరం లో ఎవరినుండి అయితే మా నాన్న అయిదు రూపాయలకు అద్దెకు తీసుకున్నారో, ఆయన ఆ స్థలంను  అప్పుడు ఢిల్లీ లో నున్నా తన కుమార్తె కు ఇవ్వటం జరిగింది. ఆమె ఈ స్థలాన్ని అమ్మివేయాలని ఉద్దేశించి స్థలం ఖాళీ చెయ్యమని నోటీస్ ఇచ్చింది. దానితో ఈ విషయాన్ని మద్రాస్ లో నున్నా ఎల్ ఈ ఎఫ్ ముఖ్య కేంద్రానికి తెలియజేసి, ఇక పాకలతో  మారేందుకు మరో స్థలం చూసుకోటం మా నాన్న ప్రారంభించారు.

ఎల్ ఈ ఎఫ్ ముఖ్య కేంద్రం నుండి వచ్చిన ఆదేశాల మేరకు ప్రస్తుత ఓనర్ను స్థలం ఖరీదు అడిగినప్పుడు చాలా మొత్తం చెప్పింది.  చాలా బేరం చేసిన తర్వాత, ఖరీదు కొంత తగ్గించి స్థలాన్ని అమ్మే0దుకు  అంగీకరించారు. ఇక ఈ సమయం లో మునుపటి లాగే ఎన్నో నెలల పాటు విశ్వాసం తో, ఎన్నో ఉపవాస

ప్రార్థనలు చేసి ఆ స్థలాన్ని కొని ఎల్ ఈ ఎఫ్ చర్చ్ పేరున రిజిస్ట్రేషన్ చెయ్యటం జరిగింది.

## 8.2 నూతన చర్చ్ నిర్మాణం - 1973

అనేక సంవత్సరాలపాటు పది రూపాయలు చేతిలో పెట్టుకొని విశ్వాసం తో కట్టటం ప్రారంభించి, పూర్తి చేసిన ఈ మొదటి తాటాకు పాక లో - క్రమ క్రమం గా ప్రార్థనకు వచ్చేవారి సంఖ్య పెరుగుతుండటం తో, ఆరాధన సాగేటప్పుడు చిన్న పాట పాడిస్తూ, ప్రజలను నిలబెట్టి ముందుకు జరగ మని అభ్యర్ధించి కూటానికి ఆలస్యం గా వచ్చే వారు చర్చ్ చివరి భాగం లో కూర్చొన టానికి తగినంత జాగా వుండేలా చేస్తూ వుండేవారు. అంతేకాకుండా పాక గోడలు మట్టివి కావటం తో తరచూ మా అమ్మ, ఇతర స్త్రీ లతో కలసి గోడలకు మట్టిపూత తరచూ పూయవలసివచ్చేది. ఇక తాటాకు కప్పు రెండు లేక మూడు ఏండ్లకు ఒకసారి మార్చవలసి వచ్చేది. దీనితో మరింత పెద్ద ఆలయ నిర్మాణం అవసరం కావటం తో దాని విషయమై మా తల్లి తండ్రులు సంఘ సభ్యులకు తెలియజేసి భారం తో దాని విషయం

ప్రార్థించేవారు. ఇక ఈ విషయాన్ని మద్రాసు లో ముఖ్య కేంద్రానికి కూడా తెలియ జేయటం జరిగింది.

ఆ సమయం లో అవసరమైన మందిర నిర్మాణానికి అవసరమైన నిధులు చర్చ్ కి లేకపోటం వల్ల ఎప్పటివలే కేవలం ప్రార్థన, విశ్వాసాలపై మాత్రమే వారు ఆధారపడ్డారు. దేవుని చిత్తానుసారమైన పనులకు ఆయనే తగిన నిధులు తగిన కాలం లో సమకూర్చుతాడు అని నమ్మే వ్యక్తులు గా మా తల్లితండ్రులు ఏ పని కైనా చందాలు పోగుచెయ్యటము, వాటి కోసం అభ్యర్థన చెయ్యటం - చేసే వారు కారు. వారి జీవితం అంతా విశ్వాసము పైనే నిలిచి కొనసాగిన వ్యక్తులు గా వారికి ఇలాటి విషయాలు కొత్తేమీ కాదు.

ఎట్టకేలకు 1973 లో 60' x 30' విస్తీర్ణం లో ఒక ఆస్బెస్టాస్ రేకుల షెడ్ నిర్మించాలని నిర్ణయించి కేవలం పునాదికి సరిపోయిన డబ్బు చేతిలో వుండి విశ్వాసం తో నిర్మాణ పని ప్రారంభించారు. మొదటిగా వడ్రంగి పని ప్రారంభించి షెడ్ వెయ్యటానికి కావలసిన ట్రస్ ల నిర్మాణ పని పూర్తి చేశారు. ఆ సమయం లో ఎల్ ఈ ఎఫ్ సంఘం లోని ఇలాటి చర్చ్ నిర్మాణ పనులలో సాధారణం గా సహాయం చేస్తూ వుండే బ్రదర్. జి. బి. సాల్మన్ గారు ఎన్నో

వారాల పాటు మా స్థలం లో వుంటూ నిర్మాణ పని చూసుకోవటం చాలా సహాయకరం గా వుండింది. ఆయన తన జీవిత సాక్షాన్ని బహు భయం తోనూ వణకు తోనూ ప్రభువు సన్నిధిలో అంతము వరకూ కాపాడుకొనిన, మేము చూసిన అతిగొప్ప దైవజనులలో ఒకరు. తన జీవితం లో బ్రహ్మచారిగా వుండి సేవ చెయ్యటం ప్రభువు చిత్తమని గ్రహించిన ఆయన చివరి వరకూ తన సాక్షాన్ని అదే విధంగా కాపాడుకున్నారు.

ట్రస్సులు పూర్తి అయ్యాయి, అయితే మునిసిపాలిటీ వారు కట్టడ నిర్మాణానికి పర్మిషన్ ఇవ్వకపోవటం వల్ల మిగిలిన పని అప్పటికి ఆపివేయబడింది. పూర్తి చేసిన ట్రస్సులు బయట ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ ఉండేవి. దానితో రోడ్డు పైన వెళ్తున్నా ప్రతిఒక్కరూ (క్రైస్తవులు సహితం) విదేశాల నుండి నిధులు అందకపోవటం వల్ల పని ఆగిపోయిందని తలంచారు. అయితే అసలు కారణం వారికి తెలీదు. ఆలయ నిర్మాణానికి కావలసిన నిధులు లేకపోయినా విశ్వాసం తో పనులు ప్రారంభించినప్పటికీ, అదే విశ్వాసం తో తమ అడుగులు ముందుకు వేస్తున్నప్పుడు దేవుడు కావలసిన ప్రతి అవసరతను తీరుస్తాడు - అని మా తల్లితండ్రులు ధృడం గా నమ్మే వారు.

అనేక నెలలపాటు వేచియున్నా తర్వాత పని ప్రారంభించి ఫ్లోరింగ్ తప్ప మిగిలినది అంతా పూర్తి చేయబడినది. దీనితో ఒకే కప్పు కింద మరింతమంది ఒకేసారి కూర్చొని దేవుని ఆరాధించేందుకు మార్గం ఏర్పడింది. ఆలయానికి చుట్టూ చెక్క తడికెలు ఏర్పాటు చెయ్యటం జరిగింది. బోధకుని వెనుక వున్నా చెక్క తడికెల వద్ద కేవలం కొన్ని  సామాన్య తెరలు మాత్రం ఉపయోగించేవాళ్ళం.


ఫ్లోరింగ్ పని ఇంకా పూర్తి కాకున్నా, ఈ ఆలయం లో మొదటి కూటము 1973 క్రిస్మస్ రోజు జరిగింది. కింద నున్న ఇసుక లోనే ఈతాకు చాపలు పరిచి ఆరాధనలు కొనసాగించేవాళ్ళం. అయితే ఈ ఆలయ ప్రతిష్ట ఆరాధన తదుపరి కొద్దినెలలలో జరిగిన విద్యార్థి కూటములలో పూర్తిచెయ్యటం జరిగింది. ఏదో సంప్రదాయం గా రిబ్బన్ కత్తిరించటం, ఇలాటి వాటికి తావు లేకుండా, కూటము జరిగింది. కేవలం ఒకటి రెండు ప్రత్యేక పాటలు, కూటములకు వచ్చిన బోధకుల ఒకటి రెండు ప్రసంగాలతో ఈ ఆలయ ప్రతిష్ఠ సభ ముగిసింది.



చిత్రం *6: 1973* లో నిర్మాణం లో వున్నా రెండవ ఆలయం

ఈ నూతన ఆలయం లో ఆరాధనలు జరపటం 1973 క్రిస్మస్ దినం నుండి ప్రారంభం అయినప్పటికీ దాని ఫ్లోరింగ్ పని 1976 వరకూ పూర్తి కాలేదు. ఈ పని మరో విశ్వాస ప్రయోగ పరీక్ష గా సాగింది. ఒకానొక సోదరుడు తమ స్థలం లోని పాత పాకను తొలగించటం తో వచ్చిన కొన్ని నాపరాళ్ళు గుడిలో వాడేందుకు ఇచ్చారు. అవి చాలని కారణం గా మా నాన్న మరో లారీ లోడ్

నాపరాయి మాచెర్ల నుండి తేవలసి వచ్చింది. దానితో గుడిలో ఫ్లోరింగ్ పని పూర్తి చేసి దేవుని అంతా స్తుతించి ఆరాధించాము.



చిత్రం *7:* చర్చ్ ఆరాధన కు హాజరైన పురుషులు, బాలురు - *1973*



చిత్రం *8: 1973* లో నూతన ప్రార్థనాలయ నిర్మాణ అనంతరం అప్పటివరకూ ఉపయోగించిన మొదటి ప్రార్థన పాకను తొలగిస్తున్న దృశ్యం

## 8.3 చర్చ్ పక్కనున్న స్థలం కొనుగోలు చేయుట

అది 1975 మేమున్న స్థలం పక్కన వున్నా పాత ఇల్లు మా తండ్రికి స్నేహితుడైన ఒక ముస్లిం సోదరునిది. ఆయన హైదరాబాద్ లో వుంటూ చనిపోవటం తో ఆయన భార్య ఇల్లు అమ్మకానికి పెట్టింది.

క్రమ క్రమం గా పెరుగుతున్న చర్చ్ కి హాజరయ్యే వారు ఎక్కువ అవుతుండటం తో భవిష్యత్ లో చర్చ్ అవసరాలకు మరింత స్థలం అవసరం కావచ్చు అని భావించిన మా తల్లితండ్రులు, మద్రాస్ లోని ముఖ్య కేంద్రానికి ఈ ఇంటి అమ్మకం విషయం తెలియజేయటం జరిగింది. కొన్ని బేరసారాల అనంతరం ఆ ఇల్లు 1976 లో కొని, చర్చ్ పేరున రిజిస్ట్రేషన్ చెయ్యటం జరిగింది. ఈ క్రమం లో అప్పటివరకూ ఆ ఇంటిలో కొనసాగుతున్న మునిసిపల్ ఎలిమెంటరీ పాఠశాల ను వేరొక చోటకు తరలించవలసినది గా నోటీసు ఇవ్వటం జరిగింది. ఏదైనా ప్రభుత్వ లేక ఇతర కార్యాన్ని త్వరిత గతిన జరిగేలా చెయ్యాలంటే లంచం ఇవ్వటం తప్పని సరి అయిన దినాలలో, లంచాలు ఇచ్చే పనికి వ్యతిరేకం గా బోధించే తానే లంచం ఇవ్వటం అనే

మాటకూడా ఎత్తని మా నాన్న, 1980 వరకూ రెండు మూడు దినాలకు ఒకసారి వెళ్లి సంబంధిత అధికారులను ఖాళీ చేసేందుకు అభ్యర్థిస్తూ వుండేవారు. అవకాశం దొరికినప్పుడల్లా వారికి తన సాక్ష్యాన్ని, సువార్తను చెప్తూ నాలుగు సంవత్సరాలు ఆ ఇల్లు ఖాళీ చెయ్యించేందుకు వేచి చూడవలసి వచ్చింది.

ఇక దీనికి తోడు ఇన్ని సంవత్సరాలూ - కేవలం ఆయన మాత్రమే కాకుండా ప్రతి ఆరాధన కూటం లోను, విశ్వాసం తో ప్రార్థన చెయ్యమని ఆయన సంఘాన్ని ప్రోత్సాహపరిచేవారు. చివరికి 1980 లో ఆ ఇంటిని మునిసిపాలిటీ వారు చర్చ్ కి అప్పగించారు.

# 9

# మరణము - తుఫానులు

## 9.1 దుఃఖాన్ని దిగమింగుట

అది ఏప్రెల్ 24, 1974: మా నాన్న సువార్త కూటాల నిమిత్తమై మరో వూరు వెళ్లారు. ఆ సాయంత్రం, 60 సంవత్సరాలకు పైగా వున్నా మా అమ్మమ్మ పడకకు పరిమితమై క్రమ క్రమంగా నీరస పడటం ప్రారంభమయ్యింది. ఎవరో చిన్న పిల్లలు ఆమెను ఇంటికి రమ్మని పిలుస్తున్నారు అని ఆమె చెప్పింది. మా అమ్మ, ఇతర సంఘ సభ్యులు ఆమె పడక వద్ద వున్నారు. ఆమె నాడిని పరిశీలించిన కొంత మంది నర్సింగ్ స్టాఫ్ ఆమె ఎక్కువ సేపు బ్రతికి ఉండకపోవచ్చు అని గమనించి తెలసినవారి కందరికీ వార్త తెలియజేయమని మాతో చెప్పారు. ఆ దినాలలో అర్జెంట్ వర్తమానాలు 'టెలిగ్రామ్' ల ద్వారా

తెలియ జేసే వాళ్ళం. అవి పంపవలసిన అందరికీ, మా నాన్నకు సహా పంపించాం. కొంత సేపటికి మా అమ్మమ్మ దేవుని సన్నిధికి వెళ్లిపోయారు. ఒక్కతే కుమార్తె గా పెరిగిన మా అమ్మ మా నాన్నలేని సమయం లో తన తల్లిని కోల్పోటము ఆమెకు తీరని దుఃఖం గా మారింది. మా నాన్నకు పంపిన టెలిగ్రామ్ చేరకపోటం తో ఆయన వెంటనే తిరిగి రాలేక పోయారు. ఇక అది వేసవి కావటం, దేహాన్ని కొంతసేపు చెడిపోకుండా వుంచగలిగిన ఇప్పుడున్నా పరికరాలు ఆ రోజుల్లో లేకపోటం వల్ల సంఘుస్థుల సహాయం తో సమాధి క్రియలు పూర్తి చేశాము.

సమాధి క్రియలు పూర్తి చేసిన మరునాడు ఇంటికి తిరిగివచ్చిన మా నాన్న విషయం తెలుసుకొని బాధ పడ్డారు. మా అమ్మను, మా అమ్మమ్మ ఎలా పెంచి ఆ స్థితికి తెచ్చారో బాగా ఎరిగిన వ్యక్తిగా ఆమెను ఓదార్చారు.

## 9.2 ప్రకృతి వైపరీత్యాలు - విశ్వాసం సార్ధకం చేసికొనుట

ఎప్పుడు గాలి వర్షం వచ్చినా మా కాంపౌండ్ చుట్టూ కట్టిన తడికెల దడి పడిపోతూ ఉండేది. మర్నాడుదానిని తిరిగి సరి చేసుకోటం మా రెగ్యులర్ డ్యూటీ గా ఉండేది.

అయితే మేమున్నా మచిలీపట్టణం (బందరు), వాయుగుండాలతో తుపాను తాకిడి ఎక్కువ గల ప్రదేశం కావటం తో చాలా సార్లు వీటి బారిన పడటం మాకు పరిచయమైన విషయమే.



చిత్రం 9: తుఫానుకు కూలిపోయిన చర్చ్ కాంపౌండ్ దడి ని బ్రదర్. యేసుపాదం గారితో కలసి పునరుద్ధరిస్తున్న బ్రదర్. ఏబెల్ గారు

## 9.2.1 1968 లో తుఫాను

మద్రాసు లో ప్రతి సంవత్సరం మే మాసంలో జరిగే రిట్రీట్ కు 1968 లో మేమంతా వెళ్ళాము. రిట్రీట్ లో వున్నా సమయం లో పెద్ద తుఫాను వచ్చి రైల్వే బ్రిడ్జిలు అన్నీ కూలిపోవటం తో, మద్రాస్ నుండి ఆంధ్రా కు రైళ్ల రాకపోకలు ఆగిపోయాయి. రిట్రీట్

ముగిసింది, అయితే దానికి హాజరైన వారంతా తిరిగి తమ తమ ఊళ్లకు వెళ్లే విషయం ప్రశ్నార్థకం గా మారింది.

చాల గంటల సందిగ్ధత తర్వాత ఆ రోజు మధ్య రాత్రి 11:30 కు మద్రాస్ లో బయలుదేరి ఒక రైలు పాసెంజర్ సర్వీస్ గా ఒంగోలు వరకు మాత్రమే వెళ్లనైవుంది అని తెలిసింది. ఇక ఆంధ్ర వెళ్ళవలసిన వారంతా మొదట ఒంగోలు వరకు చేరి ఆ తర్వాత ఆలోచించుకుందాం అన్నరీతిలో అలోచించి సెంట్రల్ స్టేషన్ కు చేరాము.

చాలా సేపు ట్రైన్ కోసం వేచివున్నా తర్వాత ఎట్టకేలకు ట్రైన్ ప్లాట్ఫారం మీదికి రాటం ప్రారంభించింది. ఆరోజుల్లో రైలు పెట్టెల కిటికీలకు ఊచలు ఉండేవి కాదు; దానితో ట్రైన్ కదులుతున్న సమయంలోనే మనుష్యులు కిటికీలగుండా లోపలకు దూరెయ్యటం చాల సామాన్యంగా జరిగే విషయం. ఇక పిల్లలు, సామానులతో ప్రయాణించే మా నాన్నలాటి వారి బాధలు అర్థం చేసుకోవచ్చు. పైగా కొంతదూరమైనా వెళ్తున్న ట్రైన్ అదొక్కటే! దీనితో రైలు పెట్టె లోకి చావకుండా లోపల పడిన మా పిల్లలకు చుట్టూ వున్నా మనుష్యులు, వారి సామానులతో వూపిరాడక ఉక్కిరిబిక్కిరి అయ్యాం. మరో గత్యంతరం లేక అందరం చూస్తూ

శ్రమను భరించాం. చివరికి ట్రైన్ కదిలింది. అది పాసెంజర్ ట్రైన్, అంటే ప్రతి స్టేషన్ లో ఆగుతూ నత్తనడకన పోతున్నది.

మరుసటి మధ్యాహ్నం 11:30 కి ఒంగోలు లో దిగిన మేము సమీపం లో వున్నా సత్రానికి వెళ్ళాం. వున్నా చెట్ల కింద నీడలోనే అటూఇటూ సర్దుకొని హోటల్ నుండి భోజనం తెచ్చుకొని ఏదో తిన్నాము అనుకొని, ఇంకా ఆంధ్ర లో ముందుకు వెళ్ళవలసిన రిట్రీట్ కు వచ్చిన వారంతా కలసి ఒక ప్రైవేట్ బస్సు మాట్లాడుకొని దాని నెక్కి కూర్చున్నాం.

ఒంగోలు లో మధ్యాహ్నం 2:30 కు బయలుదేరిన బస్సు దారి సరిగా లేకపోవటం, బ్రిడ్జి లు కూలిపోవడంతో చుట్టూ తిరిగిన మార్గాలలో ప్రయాణిస్తూ, దారివెంబడి దిగవలసిన వారిని దిగబెడుతూ, గుంటూరు చేరేటప్పటికి సాయంత్రం దాదాపు 8 అయ్యింది. ఇక అక్కడ రైలు ఎక్కిన మేము బందరు చేరేటప్పటికి మధ్యరాత్రి దాటింది. మా నాన్న క్షేమం గా మమ్మల్ని స్వస్థలానికి తీసుకొని వచ్చిన దేవుని స్తుతించిన తర్వాత అది వేసవి కావటం తో మేమంతా ఆరుబయట పడుకున్నాం. ఇక అసలైన నిద్ర అంటే ఆ రోజు పోయిన నిద్రే !

## 9.2.2 1976 లో తుఫాను

అది నవంబరు 4 వ తేదీ 1976. ఉదయం నుండి జల్లు జల్లు గా ప్రారంభం అయిన వర్షం సాయంత్రం అయ్యేసరికి పుంజుకొని 7 గంటల సమయం లో అతి తీవ్రమైన గాలులతో భారీగా వర్షం పడటం ఆరంభించింది. ఆ సమయం లో మేముంటున్న తాటాకు పాకలో మా కుటుంబం అంతా ఒకే చోట చేరాం. కరెంటు పోయింది, హరికెన్ దీపం వెలికి వెలిగించే వీలు లేకపోటం తో కేవలం మాకు అందుబాటులో వున్నా బాటరీ లైట్ లు ఉపయోగిస్తూ జాగ్రత్త పడుతున్నాం. పైన వున్నా ఇంటి కప్పు గాలి వస్తున్నప్పుడు అతి కిందకు దిగుతుండటం తో మా నాన్న మా అందరినీ తన చేతులలోకి తీసుకొని ప్రార్ధించటం ప్రారంభించారు. ఈ సమయం లో స్వతఃగా కొంత ధైర్యం గల వ్యక్తిగా, మా నాన్నను ధైర్యపరుస్తూ మా అమ్మ కూడా ప్రార్థిస్తూ వున్నారు.

ఎప్పుడు ఈ ఉధృతమైన గాలులు తగ్గిపోతాయా అని ఎదురు చూస్తూ కాలం గడుపుతున్న సమయం లో ఒక్కసారిగా పెద్ద శబ్దం వినబడింది. ఏదో ఒక పిడుగు మా చర్చ్ మీద పడినట్లు మాకనిపించింది. చర్చ్ లో ఏదో జరిగింది అని తెలిసినా ఆ

గాలులకు బయటకు వచ్చే పరిస్థితి లేకపోటం తో ఏమి జరిగిందో తెలియలేదు. ఏమి జరిగిందో, జరుగుతుందో తెలియని పరిస్థితులలో ఒక్కొక్క క్షణం గడిపిన ఒక రెండు గంటల తర్వాత, గాలులు కొంత తగాయి! తలుపు తీసి గుడిలో చూస్తే, గుడికి ఆస్బెస్టాస్ రేకులతో వేసిన కప్పు కొంత భాగము గాలికి ఎగిరిపోయింది! చాలా బాధతో ఇంట్లోకి తిరిగి వెళ్ళాం.

కొద్దీ రోజుల్లో కప్పు ఎగిరిపోయిన భాగాన్ని ఒక టార్పాలిన్ తో కప్పి ఆరాధనలు యధావిధిగా కొనసాగించారు. ఇక చాలా కాలం తర్వాత దానిని తిరిగి రేకులతో కప్పి మరమత్తులు చెయ్యటం జరిగింది.

## 9.2.3 ఉప్పెన - 1977

దినాలు త్వరగా గడిచాయి, మరుసటి సంవత్సరం నవంబరు 4 వ తేదీన, అంతకు ముందు గడచిన సంవత్సరం తుఫాను ద్వారా జరిగిన విపత్తు నుండి కాపాడిన ప్రభువుని స్థుతించాం. కొద్ది రోజులు సజావుగా సాగాయి. ఇక ఈ ఏడాది 18 వ తేదీ ఉదయం నుండి ఈదురు గాలులతో ప్రారంభమైన తుపర వర్షం మరుసటి ఉదయం వరకు పెద్ద సమస్య లేకుండా కొనసాగింది. అయితే 19

వ తేదీ ఉదయం నుండి గాలులు, వర్షం మరెంతో తీవ్రతరం కావటం తో, మా ఇద్దరు తమ్ముళ్లను, మా తల్లి తండ్రులు ఇంటిలోనికి పిలిచి తలుపు వేసి మునుపటి సంవత్సరం వలెనే ప్రార్ధన చెయ్యటం ప్రారంభించారు. అంతకు ముందు సంవత్సరం సాయంత్రం చీకటి పడిన తర్వాత వారు ఆలా చేశారు; అయితే ఈ సంవత్సరం ఇది ఉదయ కాలం లోనే జరిగింది.

వర్షం, గాలి యొక్క ఉధృతి ఏ మాత్రం తగ్గక పోగా క్రమ క్రమం గా పెరుగుతుండటం తో మా నాన్న ఆ దినాల్లో ఉన్న ఒక విద్యార్థి థియోఫిలస్ తో కలసి మా అమ్మను, మా ఇద్దరు తమ్ముళ్లను ఎందుకైనా మంచిది అనే ఉద్ద్యేయం తో కొద్ది దూరం లో వుండే మా మేనత్త ఇంటికి వారిని అతి కష్టం గా తరలించి, అక్కడ వారిని విడిచి తిగిరి థియోఫిలస్ తో కలసి ఎట్టకేలకు మా ఇంటికి వచ్చారు.

అయితే వీరు ఇంటికి చేరిన తర్వాత గాలి, వర్షం మరింత ఉధృతం కావటం తో, వారు తాటాకుపాక గా వున్నా మా ఇల్లు ఎప్పుడు కూలుతుందో అనే భయం తో ఇంట్లోకి వెళ్లకుండా మా ఇంటికి ఎదురుగా నున్నా ఎల్లైసీ లో పని చేస్తూ, ఇంటివద్ద హోమియో వైద్యం చేసే ఒక డాక్టర్ గారింట్లో తలదాచుకునేందుకు వెళ్లారు.

ఆ డాక్టర్ గారు సౌమ్యుడైన పెద్దమనిషి; వారికే అంత దృఢ మైన ఇల్లు, సరైన ఫెసిలిటీ లేకపోయినప్పటికీ వీరు వుండేందుకు వసతి కల్పించారు. వీరిద్దరితో పాటు బ్రదర్. నోబుల్ గారు కూడా ఆ రోజు అక్కడే వీరితో వుండిపోయారు.

తలదాచుకున్న డాక్టర్ గారింటి కిటికీ తలుపు కొద్దిగా తెరచి ఎదురు గా నున్న కాంపౌండ్ లో ఏమి జారుతుంది? అని చూస్తున్న మా నాన్న కు మొదట మా ఇల్లు కూలిపోవటం కళ్లారా చూడవలసి వచ్చింది. ఆ తర్వాత దాదాపు సాయంత్రం 3:30 సమయం లో అంతకు ముందు కేవలం 4 సంవత్సరాల క్రితమే నిర్మించిన చర్చ్ (ఆస్బెస్టాస్ కప్పున్న షెడ్) ముందు భాగం లో రేకులు గాలికి ఎగిరిపోయి, వాటి కింద వున్నా మొదటి రెండు ట్రస్సులు కూలిపోటం గమనించి, మా నాన్న అక్కడున్నా నోబుల్ గారికి, థియోఫిలస్ కు “నేను ఆలయం ఇంకా ఇలా డేమేజ్ కాటం చూడలేను; కిటికీ మూసెయ్యండి” అని చెప్పటం తో వారు ఆలా మూసేసి లోపల వుండి పోయారు.

19 వ తేదీ ఉదయం ప్రారంభమైన ఈ ఉధృతమైన గాలి, వర్షం ఏ మాత్రం ఎడతెరిపి లేకుండా ఆ రోజు మధ్య రాత్రి దాటి 20 వ తేదీ తెల్లవారు ఝూమున దాదాపు 3 గంటల సమయం లో కొద్ది

కొద్ది గా తగ్గటం ప్రారంభించి, షుమారు తెల్లవారు ఝామున 4:30 ప్రాంతం లో అవి పూర్తిగా ఆగిపోయాయి! ఆ చీకటి లో నే - వీధిలో వున్నా నీటిమట్టం చూసి అనుమానం తో నోటిలో వేసుకొని రుచి చూసిన అందరికీ అవి ఉప్పగా ఉండటం తో గుండెలు జారిపోయాయి.

ఈ విషయం తెలుసుకున్నా వీరు ముగ్గురూ వీధుల్లో ఎంతో ఎత్తునీటిలో మునిగిన గాజు పెంకులు,ముళ్ళు, ఏంతో చెత్త - ఇవన్నీ జాగ్రత్త గా దాటుతూ - మా అమ్మ, తమ్ముళ్లు వున్నా మా మేనత్త ఇంటికి వెళ్లి - మా ఇల్లు, చర్చ్ ముందు భాగం కూలిపోయినట్లు చెప్పి వారిని వెంట బెట్టుకొని నెమ్మదిగా కూలిపోయిన మా ఇంటికి ఇంకా చీకటి చీకటి గా వున్నా సమయం లోనే వచ్చారు.



చిత్రం 10: 1977 తుఫాను, ఉప్పెన లో కూలిన మా చర్చ్ ముందు భాగం

ఇంకా పూర్తిగా వెలుతురు రాకముందే మా మేనత్త ఇంటినుండి పడిపోయిన ఇంటికి చేరుకున్నా మా తమ్ముళ్లకు చుట్టూ వున్నా పరిస్థితి చూసేటప్పటికి చాలా భీతావహం గా కనిపించింది. మునుస్యులు ఆతురత తో తమ వారి కోసం, తాము పోగొట్టుకున్న వస్తువులు, పశువుల కోసం ఎదురు చూడటం, ఎక్కడ చూసినా మనుష్యుల కేకలు, అరుపులు, ఇక వీటికి తోడు సముద్రపు నీరుతో నిండిన వీధులు - ఇవన్నీ చూసే సరికి

ఏమి చెయ్యాలో తోచని పరిస్థితి ఏర్పడింది. ఇలా మా తమ్ముళ్లు, థియోఫిలస్, నోబుల్ గారు మా కాంపౌండ్ లో పరిస్థితి చూస్తున్న సమయం లో, మా నాన్న, మా అమ్మతో కొద్దిసేపటి తర్వాత మా మేనత్త ఇంటినుండి అడుగు లో అడుగు వేస్తూ నెమ్మదిగా అక్కడికి చేరుకున్నారు. కాంపౌండ్ లో పరిస్థితి చూసిన మా అమ్మ కన్నీటి పర్యంతం అయ్యారు.

మా ఇంట్లోని వస్తువులన్నీ - పడిపోయిన ఇంటి కప్పు, మట్టిగోడల కింద తడిసి నానుతూ కనిపించాయి. సముద్రపునీరు మా కాంపౌండ్ మెట్ల వరకూ వచ్చి సముద్రపు ఆల వెనుకకు తిరిగిపోయినట్లు వారికి మా నాన్న చెప్పారు.

అది ఆదివారం, అంటే మునుపటి దినం (శనివారం) సాయంత్రం వారు ఎప్పుడు జరిగే ఉపవాస ప్రార్థనకు కూడియుండాల్సింది. పరిస్థితి ఈ విధం గా ఉండటం తో ఎవ్వరూ ఆలా చెయ్యలేక పోయారు. ముందుగా ప్రకటించకుండా ఒక చర్చ్ ఆరాధన కూటము ను రద్దుచేయటం మా చర్చ్ చరిత్ర లో అప్పటివరకూ అదే మొదటి సారి!



చిత్రం *11: 1977* లో ఉప్పెన కు పడిపోయిన చర్చ్ ముందు భాగం, వెనుక కూలిపోయిన మేము నివాసం వుండే ఇల్లు

ఇక ముందు భాగం పడిపోయిన చర్చ్ లో మా తమ్ముళ్లు ప్రవేశించేటప్పటికి ఎక్కడ చూసినా తడిసిన చెత్త చెదారం, నీటిలో నానుతున్న - చర్చ్ లో వాడే ఈతాకు చాపలు, పగిలిన చర్చ్ కప్పు కు సంబంధించిన యాస్బెస్టోస్ రేకుల పెంకులు చెల్లా చెదురుగా పడివున్నాయి. అక్కడ వున్నా నీటిలో చనిపోయి పడి వున్నా ఒక పక్షి కూడా ఉందట.

అప్పటి వరకూ ఇళ్లలో బిక్కుబిక్కు మంటూ గడిపిన ప్రజలకు ఉప్పెన వచ్చిన సంగతి, దాని తాలూకు నీరు ఇంకా నిలిచివుండటం గురించి తెలిసినప్పుడు, వయస్సు తో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ ఆ పరిస్థితిని కళ్లారా చూడాలని వీధులలోవున్నా అన్ని రకాలచెత్త,గాజుపెంకులను దేనినీ లెక్కచెయ్యకుండా కాలినడక రోడ్డు పై మా ఇంటిముందు నుండి నడుచుకుంటూ రెండు ప్రక్కల తుఫాను చేసిన నష్టాన్ని చూసుకుంటూ పోతున్నారు. ఈ క్రమంగా లో పడిపోయిన మా ఇల్లు, గుడినికూడా చూసిన కొందరు తమ సానుభూతిని వ్యక్తపరిచితే, మరికొందరు పడిపోయినవి చర్చ్ కి సంబంధించిన ఆస్తులు గనుక, హేళన గా నవ్వటం కనిపించింది. పడిపోయిన ట్రస్సుల వద్దకూర్చొని ఇలాటి హేళన లను చూస్తున్న మా

తల్లితండ్రులు, సువార్త నిమిత్తం దేనినైనా ఎదుర్కొనటానికి సిద్ధం గా వుండాలి అని నమ్మే వారుగా - ప్రభువు వారిని కూడా దర్శించాలి - అని తమ హృదయాలలో ప్రార్థించారు.

ఉదయం తొమ్మిది గంటలు దాటిన సమయం లో షుమారు ముగ్గురు విశ్వాసులు తమ తమ ఇళ్లకూ, వారి చుట్టుపట్ల జరిగిన నష్టాన్ని కూడా కనీసం చూసుకోకుండా బైబిల్స్ తీసుకొని ఆదివారం ఉదయ ప్రార్థన కూటానికి వచ్చారు. వీరు ఆ రోడ్ల పై నిలిచి వున్నా నీరు, ఆ నీటి కింది భాగం లో వుండి కనబడకుండా వున్నా మరింత అపాయకరమైన గాజు పెంకులు, ముళ్ళు ఇంకా వూహించలేని చెత్త నంతా లెక్కచెయ్యకుండా దాటుకుంటూ ఎలా వచ్చారో మరి!! వీరిలో ఒకరు కొక్కిరిగడ్డ కమలమ్మ గారు. ఆమె బహు బలమైన విశ్వా సురాలు.



చిత్రం *12: 1977* ఉప్పెన కెరటాల ద్వారా కొన్ని కిలోమీటర్ల దూరంకొట్టబడుతూ తేబడి సాక్షాత్తూ బందరు లోని ఒక నడి రోడ్డు పై వదిలివేయబడిన ఒక పెద్ద పడవ .

(చాలారోజుల అనంతరం తీయబడిన ఈ ఫోటో లో రోడ్డు పై వాహనాలు తిరిగేందుకు వీలుగా పడవను ఒక పక్కకు నెట్టటం జరిగింది.*)*

జరిగిన విపత్తు లోనే, ఇంకా చర్చి రోడ్డు మీద ఈ విపత్తు చేసిన నష్టాన్ని చూసేందుకు తండోపతండాలు గా మనుష్యులువెళ్తున్నా సమయం లోనే ఆరాధన నిమిత్తమై వచ్చిన ముగ్గురూ, మా కుటుంబ సభ్యులు, చర్చ్ దగ్గర వుండే యవ్వనస్థులు - ఇలాటివారంతా కలిపి షుమారు 12 మంది పడిపోయిన ట్రస్సులు వున్నా చోటే ఆరాధనకు కూర్చున్నారు. మా నాన్న - ప్రతిఒక్కరినీ, వారి వారి కుటుంబ సభ్యులు, వారి చుట్టుపక్కల వారు ఏ విధం గా ఈ ఉప్పెన సమయం లో తల దాచుకున్నారు అని అక్కడున్న వారిని వాకబు చేసి, అప్పటి వరకు తెలిసిన సమాచారం ప్రకారం గుడికి వచ్చే ఏ ఒక్కరికీ ప్రాణహాని కలుగలేదు అని తెల్లుసుకొని దేవుని స్తుతించారు. ఇక ఆ నాడు ఎప్పుడూ జరిగే క్రమం లో కాకుండా కేవలం ఆ సమయం లో కావలసిన అదరణకొరకు, కావలసిన తదుపరి సహాయము కొరకు దేవుని వేడుకొని ఆరాధనను ముగించారు. ఈ సమయం లో రోడ్డు పై వెళ్తున్నా అనేక మంది తమ ముక్కున వేలు వేసుకొని అంతటి విప్పత్తు లో కూడా పడిపోయిన ట్రస్సుల వద్దే - మా ప్రాణాలను తప్ప అనేక విధాలు గా నష్టపోయిన వారంతా ఆదివారం ఉదయం, అలాటి సమయం లో ప్రార్ధించటం చూసి చాలా ఆశ్చర్యపోయారు.

కొద్ది గజాలు రోడ్డు మీద నడుస్తూ ముందుకు వెళ్తే మా చుట్టుపక్కలే ఎన్నో చనిపోయిన గేదెలు, ఆవులు ఒకదాని ప్రక్కన ఒకటి బారులు తీరి రోడ్డు వెంబడి పడివున్నాయి. అంతే కాదు చనిపోయిన మానవ మృతదేహాలు కూడానీటిలో తేలియాడటం ఇంకొంత దూరం లో, కొద్దిసేపట్లోనే కనిపించాయి.

ఊహించని రీతిగా వచ్చిన ఉప్పెన కెరటాలు, కేవలం మా టౌన్ కు మాత్రమే పరిమితం కాకుండా ఇంకా ఎంతో విస్తీర్ణం లో చాల నష్టం కలుగ చేశాయని, ఊళ్లకు ఊళ్ళు మాయమయ్యాయని ఆ తర్వాత వారికి తెలిసింది. అనేక గ్రామాల నుండి మనుష్యులను రక్షిత ప్రదేశాలకు తరలించి బందరులో వారు ఉండేందుకు శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భం గా ప్రాణాలు కోల్పోయిన మనుష్యుల సంఖ్య నే 50,000 అని ప్రకటించబడింది. ఇక నష్టపోయిన పశువుల సంఖ్య మరెంతో ఉంటుంది. చాలాసార్లు ఈ సంఖ్యను ఉద్దేశ్య పూర్వకం గా తగ్గించి చూపటం జరుగుతుంది. ఈ విపత్తు తో ఆరంభమైన సహాయ చర్యలు అనేక విధాలు గా ఎన్నోమాసముల పాటు సాగి, ఆ పిమ్మట రెండవ దశ లో మొదలైన పునరావాస కార్యక్రమాలు - కొన్ని సంవత్సరాల పాటు కొనసాగాయి.

ఇక మా ఊరిలో దీనికి సంబంధించిన శుభ్రపరిచే కార్యక్రమాలు అప్పటినుండి ఎన్నో వారాల పాటు కొనసాగుతున్న సమయం లో తాగు నీటి సరఫరా, కరెంటు పూర్తిగా నిలిపివేయబడినాయి.

మా కాంపౌండ్ ను శుభ్రపరచటం: ఈ స్థాయిలో మా ఇళ్లకు, వ్యక్తిగత వస్తువులన్నిటికీ ఏంతో నష్టం వాటిల్లిన తర్వాత కాంపౌండ్ ను శుభ్రం చెయ్యటం, పునరావాసం కల్పించుకోటం మా నాన్న మొదటి ప్రాధాన్యత గా వుండింది. మా తల్లితండ్రుల సేవలో ఆత్మీయ మేలుపొంది గుడికి వచ్చే కాలేజ్ విద్యార్థులు, ఇతరులు అందరూ వచ్చి ఈ పనిలో అనేక విధాలు గా సహాయపడ్డారు. ముందు భాగం కూలిపోయిన చర్చ్ బిల్డింగ్ లోనే, వెనుక కొంత భాగం లో తెరలు కట్టి, మా వస్తువులు, వ్యక్తిగత సామాను అంతా అక్కడ తెర వెనుకకు పేర్చారు. ఇక ఈ సమయం లో తెర వెనుక భాగం లో ఈ సామాను వుంటే అవతలి భాగం లో ఆరాధన కూటాలు అన్ని జరుగుతూ ఉండేవి.

వచ్చిన సముద్ర కెరటం తో ఎక్కడెక్కడో ఉండాల్సిన పాములు ఇలాటి వన్నీ వాటికి దొరికిన ప్రతి వస్తువు కింద నక్కి దాగాయి. మా స్థలం శుభ్రపరిచే పరిచేసమయం లో- అత్యంత నమ్మకస్థుడైన విద్యార్థి, థియోఫిలస్ చాలా పాములు

చంపటము తో పాటు కాంపౌండ్ శుభ్రపరిచే పనిలో చాలా సహాయ పడ్డాడు.

అనేక వారాల తర్వాత మ్యునిసిపాలిటీ - తాగేందుకు నీరు సరఫరా చెయ్యటం ప్రారంభించింది. ఇక ఇంకొన్ని వారాల తర్వాత (షుమారు రెండు నెలల అనంతరం) కరెంటు సరఫరాను పునరుద్ధరించడం జరిగింది. ఇక ఈ సమయం లో - అంతకు ముందు కిచెన్ గా వాడే చిన్న గుడిసె వున్నా చోటనే, ఈ పడిపోయిన పాకల నుండి తీసి ఉంచిన వెదురు బొంగులు, ఇతర సామగ్రితో షుమారు 12"x 10' అడుగుల చిన్న పాక వేసి దానికి మట్టి గోడలు పెట్టటం జరిగింది. ఈ పాకను మా కిచెన్ మరియు మా తల్లితండ్రులు వుండేందుకు ఉపయోగించేవారు. ఇక మా తమ్ముళ్లు ఇద్దరూ ఇతర యవ్వన బాలురతో కలసి ఆ పడిపోయిన చర్చ్ నందే వుండేవారు. రాత్రులు ఇబ్బంది లేకపోయినా, పగలు ఆస్బెస్టాస్ రేకుల కప్పు కావటం తో వేసవి దగ్గర పడుతుండటం తో చాల వేడిగా ఉండేది. అయితే, క్రీస్తు సేవకులు గా ఇలాటి పరిస్థితులను ఎదుర్కొని నిలువ వలసిన అవసరతను గుర్తించిన వారుగా మా తల్లితండ్రులు విశ్వాసం తో ముందుకు కొనసాగారు.

ఇదే జీవితం ఉప్పెన ముగిసిన తర్వాత చాల కాలం వరకూ కొనసాగింది. అయితే అప్పటికి ప్రక్కనే వున్నా పెంకుటిల్లు ను చర్చ్ వారు కొని అక్కడ కొనసాగుతున్న ఎలిమెంటరీ పాఠశాల ను వేరొక చోటుకు తరలించుకోవాలని అప్పటికి సంవత్సరం మునుపే నోటీసు ఇచ్చినప్పటికీ, వారికి సరైన స్థలం దొరక లేదంటూ పాఠశాల ను వారు తరలించలేదు. అయితే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, టీచర్లు మేమే ఇల్లు కోల్పోయి బాధపడుతుండటం గమనించి, పై అధికారుల అనుమతి తీసుకోకుండానే వారి రెండు గదులు కొంత కాలం వాడుకునేందుకు మమ్మల్ని అనుమతించటం పట్ల మా కృతజ్ఞతలు వారికి హృదయపూర్వకంగాతెలియజేశాం.



చిత్రం *13:1977* ఉప్పెన అనంతరం కాంపౌండ్ శుభ్రపరచుతున్న ఏబెల్ దంపతులు

## 9.2.4 1979 మే నెలలో తుఫాను

ఇది 1979 మే నెలలో మండు వేసవి లో - మా తమ్ముళ్లు వెస్లీ, ఇమ్మానుయేలు ఇద్దరూ కాలేజీ ఫైనల్ పరీక్షలు రాస్తున్నప్పుడు జరిగింది.

ఇప్పటికే ఎన్నో తుఫాన్ల దెబ్బలు తిని, ఉప్పెన దెబ్బ సహా తిని అప్పటికి ఎంతోకాలం గడవని వారముగా వున్నా మేమంతా తుఫాను ప్రారంభం కాగానే, మాకు సమీపము లో ప్రభుత్వ హాస్టల్ గా వున్నా కాస్త ఎత్తైన భవనంకు చేరాము. ఈ హాస్టల్ నుండి మా చర్చ్ కు అనేక మంది యువకులు చాలాకాలం నుండి రావటం పరిపాటి. అక్కడ రెండవ అంతస్తు లో వున్నా బాలురు కొంతమంది వారి గది ఖాళీ చేసి మేము ఆ రాత్రి అక్కడ తల దాచుకునేందుకు అనుమతించారు. తుఫానులో చాలా ఉధృతం గా వర్షం పడినప్పటికీ ఈ సారి ఉప్పెన లో లాగా ప్రాణనష్టం ఇలాటివి లేవు. మరునాడు మాకు సహాయం చేసిన బాలురకు మా కృతజ్ఞతలు తెలిపి మేము మా ఇళ్లకు తిరిగి వచ్చాము.

## 9.2.5 1990 లో తుఫాను



చిత్రం *14: 1990* లో సంభవించిన తుఫాను లో చర్చ్ కాంపౌండ్ లో జరిగిన నష్టం

ఇది 1990 వేసవి లో సంభవించింది. అప్పటికి మా నాన్న ప్రభువు సన్నిధికి వెళ్ళిపోయి ఎనిమిది సంవత్సరాలు పూర్తి అవుతుంది. ఆ సమయం లో మా అమ్మ, మా చిన్న తమ్ముడు ఇమ్మానుయేల్ మాత్రమే ఇంట్లో వున్నారు. అయితే ఈ సమయానికి చర్చ్ వారు 1976 లో కొనుగోలు చేసి, 1977

ఉప్పెన సమయానికి దానిలో వున్నా ఎలిమెంటరీ పాఠశాల ఖాళీ చెయ్యటం తో మేము ఆ పెంకుటిల్లు లో ఉంటున్నాం.

అయితే ఈ ఇల్లు చాలా పాతది కావటం వల్ల మా అమ్మను వేరొకప్రదేశం కు తీసుకొని వెళ్ళటం జరిగింది. ఈ సమయం లో వీచిన గాలులు ఎంతో బలమైన పైనప్పటికీ ఉప్పెన లేకపోవటం, మెరుగైన ప్రసార సాధనాలు వుండటం, అధికారులు వెంటనే చర్యలు తీసుకొని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించటం తో ప్రాణ నష్టం చాలా తక్కువగా వుండింది.

వీటికి అదనం గా మొదటి నుండి కూడా తాటాకు పాకలలోగాని,లేకప్రస్తుతం వున్నా పెంకుటింటిలోనికి మారిన తర్వాత గానీ, ఎప్పుడు కొంత వర్షం కురిసినా ఇంటికప్పు రంధ్రాలలో నుండి కారే వర్షపునీటిని మేము బకెట్లు, ఇంకా వంటకు వాడే వంటపాత్రలు సహితం - కారే చోట నేలపై వుంచి ఆ నీటిని సేకరించి పారబొయ్యటం అలవాటే!! కొన్ని సందర్భాలలో ఇలా వంటపాత్రలు వాడుతూవాడుతూ ఇంట్లోని పాత్రలన్నీ వాడేసినా ఇంకా వేరే చోట్ల కారుతూ వర్షపు నీరు సేకరించవలసిన ప్రదేశాలు వుండి, ఆ నీరు సేకరించేందుకు పాత్రలు ఇంకా లేని సందర్భాలు కూడా వున్నాయి. ఇలాటి అనేక సందర్భాలలో

కావలసిన ఓర్పు, సహనం చూపేందుకు కావలసిన కృప దేవుడు మా తల్లితండ్రులకు అనుగ్రహించాడు.

# 10

# చెన్నై లో రిట్రీట్లు

## 10.1 చెన్నై లో ఎల్ ఈ ఎఫ్ వారు నిర్వహించే రిట్రీట్ లకు హాజరు కావటము

### 10.1.1 వర్షాంతర రిట్రీట్లు

రక్షణ నొందిన అనంతరం వివాహం కాకుండా యువకునిగా వున్నా సమయం నుండి, మద్రాస్ (చెన్నై) లోని రిట్రీట్లకు మా నాన్న హాజరౌతూ వుండేవారు. ఇక వివాహానంతరం కుటుంబం అంతటితో కలసి వీటికి హాజరు కావటం, అప్పటి వారిస్థితి, స్తోమతకు మరింత సవాలు గా మారింది. 1960s రెండవ భాగం లో వారు మా ఇంట్లోని అందరికీ

కలిపి ఒక్క బెర్త్ మాత్రం రిజర్వేషన్ చేసి, పిల్లలమైన మా ముగ్గురినీ ఒకే బెర్త్ పై సర్ది పడుకోబెట్టి, మా అమ్మ నాన్నలు మాత్రం రాత్రం తా కూర్చొని ప్రయాణం చేస్తూ మేము బెర్త్ నుండి జారి కింద పడకుండా జాగ్రత్త గా చూసుకుంటూ ప్రయాణించేవారు. ఇక 1950s, 1960s మొదటి భాగం లో - రిజర్వేషన్ అనే దానిని గురించి వారు ఏమాత్రం ఆలోచించే పరిస్థితి కూడా ఉండేది కాదు. విశ్వాసం తో చివరి క్షణం వరకు ఎదురు చూసి కేవలం సాధారణ పాసెంజర్ టికెట్ కు, చివరిలో సమకూడిన సొమ్ము తో అప్పటికప్పుడు కొనుక్కొని ప్రయాణించవలసిన పరిస్థితి ఆ రోజుల్లో వుండేది; ఈ అన్ని సమయాలలో కూడా మా తల్లి తండ్రులు విశ్వాసంతో ప్రభువు వైపు చూస్తూ ముందుకు సాగే కృప దేవుడు అనుగ్రహించాడు.

మా చిన్న తనం లో వారు హాజరైన ఒక రిట్రీట్ కు చేసిన ప్రయాణం గురించి మాకు అప్పుడప్పుడు చెప్తూ వుండేవారు. ఆ సమయం లో తుఫాను వల్ల ఒక రైల్వే బ్రిడ్జ్ కూలిపోవటం తో, ఆ సమయం లో విజయవాడ నుండి వచ్చేరైళ్లు - పడిపోయిన బ్రిడ్జి కి ఇవతలి వైపు నిలిపి, ఇక చెన్నై నుండి వచ్చేరైళ్లు ఇదేవిధం గా బ్రిడ్జి కి ఆ పక్క నిలిపి, ప్రయాణికులను - ఇటువైపు వారిని

వారి సామానుతో నడిచి ఆ వైపుకు వెళ్లి అక్కడ ఆగిన ట్రైను ఎక్కమన్నారట! ఇక అటువైపు ట్రైను లో వచ్చిన వారంతా ఇదే విధం గా కాళీ నడకన వచ్చి ఇటుపక్క ఆగివున్న ట్రైన్ ను ఎక్కమన్నారట! ఇక ఇప్పుడు అటు ఆగిన ట్రైన్, అది వచ్చిన మార్గాన్నే వెనుకకు చెన్నై వెళ్ళటం, అలాగే ఇటువైపు ట్రైను విజయవాడ కు వెనుకకు రావటం జరిగిందట! ఈ సమయం లో చిన్నపిల్లలతో, చాలా సామానుతో ప్రయాణిస్తూ వారు చాలా ఇబ్బంది పడినట్లు చాల సార్లు చెప్తూ వుండేవారు.

ఒక సంఘ కాపరిగా మా నాన్న తన కేంద్రం నుండి రిట్రీట్ కు హాజరయ్యే వారందరితో - రిట్రీట్ కు కొద్ది దినాల ముందు నుండి ఉపవాసం వుండి ప్రార్థిస్తూ ఆత్మీయ రీతిగా సిద్ధపడుతూ వుండేవారు. ముందు నుండి వారికి కావలసిన సూచనలు ఇస్తూ, ఇక ప్రయాణం లో మరిన్ని సూచనలిస్తూ అక్కడకు చేరేవరకూ చేస్తూవుండేవారు. ఇక అక్కడ వున్నప్పుడు వారి ప్రతి గమనాన్ని గమనిస్తూ హెచ్చరిస్తూ, తిరిగి మా స్వస్థలం చేరేవరకూ పూచీ వహించేవారు.

రిట్రీట్ లో వున్నా కాలంలో ఇంటి ఖర్చు ఎంతవరకూ, ఏ విధం గా తగ్గించుకొనగలరో అంత, ఆ విధంగా తగ్గించు కునేందుకు

ప్రయత్నించేవారు. మా అమ్మ కొన్ని వారాల పాటు చెడిపోకుండా వుండే - జంతికలు, బిస్కట్లు, ఇలాటి వాటిని ఎక్కువ మొత్తం లో తయారు చేసి మా కోసం, మేముండే బూత్ లో ఇతరులతో పంచుకునేందుకు తీసుకొని వెళ్ళే వాళ్ళం. రిట్రీట్ లలో వున్నప్పుడు మా నాన్న ఆంగ్లం నుండి తెలుగు లోనికి అనువదించవలసిన పని చాలా సార్లు చేస్తూ వుండేవారు. అనేక రోజుల పాటు ఎడతెరిపి లేకుండా ఈ పని చేసిన తర్వాత ఆయన గొంతు బొంగురు పోతూ ఉండేది. ఈ విధం గా కేవలం రిట్రీట్లే కాకుండా, ఇతర అన్నిపెద్ద కూటాల అనంతరం ఆయన ఇలా గొంతు సమస్య తో బాధ పడుతూ వుండేవారు.

విశ్వాసం పై ఆధార పడి పని చేస్తున్న ఒక దైవ దాసునిగా రిట్రీటు లలో అనేక గ్రామాల నుండి వచ్చే చిన్న చిన్న సువార్తికులను, విశ్వాసులను ఆయన అనేక మారులు కలిసికొని వారి సాధక బాధకాలను గురించి తెలుసుకొని ప్రార్థన చెయ్యటం, తాను చేయగల సహాయం చేయటం చేస్తూ వుండేవారు. కొంత మంది గౌరవం తో ఆయన తో మాట్లాడేందుకు చాపపై ఆయన ప్రక్క కూర్చొనేందుకు నిరాకరించేవారు; అయితే తాను కూడా వారిలాటి ఒక వ్యక్తి మాత్రమే అని ఆయన పక్క కూర్చొనేందుకు

వారు ఇబ్బంది పడనక్కరలేదు అని అయన వారికి తెలియజేస్తూ వుండేవారు.

రిట్రీట్ లలో వున్నప్పుడు కొన్ని సార్లు మా నాన్న బాప్తిస్మము లు ఇస్తూ వుండేవారు. సాతాను ముందు ఏ ఒక్కరూ పెద్దవారు కాదని ఎరిగిన వారుగా, ఎవరైనా, ఎప్పుడైనా విశ్వాసం నుండి ప్రక్కకు తొలగిపోయే అవకాశం ఉందని గ్రహించిన వారుగా ఈ పనిని ఆయన హృదయమంతటితోను, విరిగినలిగిన హృదయము తోనూ చేస్తూ వుండేవారు. ఆయన తన జీవితం అంతా తన మాదిరి జీవితం కోసం, ఆత్మీయ పరిపక్వత కోసం ప్రార్థిస్తూ వుండేవారు.

మా నాన్న ప్రభువు యొద్దకు తీసుకొనబడిన తర్వాత 1984 అనంతర రిట్రీట్ లకు హాజరు కావటం మా అమ్మకు కొంత ఇబ్బంది గా ఉండేది. అప్పటి వరకు ఆమె రిట్రీట్ సమయాలలో పెద్దవయసు లో వుంటూ నేలపై చాపమీద పడుకోటం, ఆరోగ్యవంతులైన ఇతరులకు ఏర్పాటు చేసిన టాయిలెట్ వసతులు వాడుకోటం చాల ఇబ్బందిగా వున్నా, ఆమె రిట్రీట్ ను పోగొట్టు కునేందుకు ఏ నాడూ ఇష్టపడేవారు కాదు. దేవుని

బిడ్డలతోను, ఆయన సన్నిధిలోను ఉండాలని ఆమె ఎప్పుడు కోరేవారు.



చిత్రం *15: 1970s* లో చెన్నై లోని ఎల్ ఈ ఎఫ్ సంవత్సరాంత రిట్రీట్ లో సేవకులు

## 10.1.2 విద్యా ర్థుల రిట్రీట్లు

ఆ రోజుల్లో ఈ రిట్రీట్ లు చెన్నై లో జనవరి మాసం లో జరిగేవి. బండారు లోని మా కేంద్రం లో హాజరయ్యే వారిలో విద్యార్థులే అధికం గా వుండేవారు. మా నాన్న కొంత మంది విద్యార్థులతో ఈ రిట్రీట్లకు హాజరయ్యేవారు. ఎంత మంది రిట్రీట్ కు హాజరు అయ్యారు అనే విషయం కాకుండా, వెళ్లిన వారు ఏమైనా ఆత్మీయ గ్రహింపు, మేలుకొలుపు కలిగి తిరిగి రాగలిగారా? అనే విషయం పై మాత్రమే ఆయన కేంద్రీకరించేవారు.

# 11

# పరిసర ప్రాంతాల్లో సువార్త

## 11.1 సువార్త చేరని ప్రదేశాలకు సువార్తను చేరవెయ్యటం

### 11.1.1 పరిసర ప్రాంతాలు, జిల్లాలలో సేవ

మచిలీపట్టణం వచ్చి సువార్త పని ప్రారంభించిన నాట నుండి మా నాన్న ఆనాటి వుమ్మడి రాష్ట్రం లోని కృష్ణ, గుంటూరు, ప్రకాశం, విశాఖపట్నం జిల్లాలలో ఎక్కువగా సేవ చేశారు. ఆరోజుల్లో జరిగే విజయవాడ, స్టువార్టుపురం లాటి కూటాలు అన్నిటిలో మా నాన్న -

విత్తువాని ఉపమానం బోధిస్తూ వుండేవారు. పిల్లలు గా ఆ రోజుల్లో సువార్త పని నిమిత్తం ఇల్లు వదలిన మా నాన్న, ఒక స్థలం లో కూటములు ముగిసిన వెంటనే మరో ప్రదేశం లో

కూటాలు, ఇలా గొలుసు గా ఏర్పాటు చేయబడిన కూటాలలో విరామం లేకుండా పరిచర్య చెయ్యవలసిన అవసరత తో, చాలా రోజుల వరకూ మేము తిరిగి మా నాన్నను చూడగలిగే వారము కాదు. కొన్ని సార్లు పిల్లలు గా మేము నిద్రపోయిన తర్వాత ఒక చోట కూటములు ముగించుకొని చాల పొద్దుపోయినాక ఇల్లు చేరుకున్నా మా నాన్న, తెల్లవారకముందే మరో చోట కూటాల కోసం, మేము నిద్ర లేవకముందే వెళ్ళిపోతూ వుండేవారు. ఈ విషయం - తెల్లవారిన తర్వాత మా అమ్మ చెప్పినప్పుడు చాలా ఆశ్చర్యపోతూ ఉండేవారం. అనేక సార్లు బస్టాండ్ కు వెళ్లేందుకు కూడా సరిపడా డబ్బు లేకపోవటం తో మా నాన్న, మా ప్రార్థన కూటాలకు హాజరౌతూ రాత్రులు గుడిలో వుంటూ చదువుకునే కాలేజీ విద్యార్థులను ఆయన తన సైకిలు పై ఎక్కించుకొని తీసుకొని వెళ్లి బస్టాండ్ లో దిగబెట్ట మని కోరుతూ వుండేవారు.



చిత్రం *16:* స్టువార్టుపురం కూటాలలో జాషువా డేనియల్ గారితో ఏబెల్ గారు, ఇతరులు

## 11.1.2 తరుణములు పోగొట్టుకొనకుండా సేవ చేయుట

మేము చదువుకునే రోజుల్లో మా ఇంటికి అప్పుడప్పుడు వచ్చే మా స్నేహితులను మా తండ్రి ఆప్యాయంగా పలుకరించి వారికి సువార్త చెప్తూవుండేవారు. ఆ తర్వాత వారికి కొన్ని సాక్ష్యాలతో కూడిన పుస్తకాలు ఇచ్చి పంపిస్తూవుండేవారు; ఆయన కలుసుకున్న ప్రతి ఒక్కరి ఆత్మను గురించి ఆయన ఆలోచిస్తూ,

ప్రభువు ఆయన పై ఉంచిన బాధ్యత ను గురించి ఎల్లప్పుడూ ఆలోచించేవారు.

1965 - 75 లలో ప్రతి ఏడాది ఒకసారి మా చర్చ్ కి వచ్చి రక్షణపొందిన కాలేజ్ విద్యార్థులు సమీపం లో వున్నా మంగినపూడి బీచ్ కి వెళ్తూ వుండేవారు. వారితో పాటు ఆ రోజుల్లో చిన్న పిల్లలం గా వున్నా మేమంతా వెళ్తూవుండేవారిమి. ఈ క్రమం లో ఇకటి రెండు సార్లు మా నాన్న కూడా మాతో రాటం జరిగింది. పిల్లలు గా వున్నా మేము సముద్రపు ఒడ్డున ఇసుకలో ఆడుకుంటూవుంటే, యువ్వనస్థులు కొంత దూరం అలల లోనికి వెళ్లేవారు. ఈ సమయం లో సమీపం లోనే వున్నా కొన్ని పడవలయొద్దకు చేరిన మా నాన్న, వారికి యేసు క్రీస్తు ను గురించి, జాలరులైన ఆయన శిష్యుల గురించి, ఆయన లోకానికి ఎందుకు రావలసి వచ్చిందో తెలియజేస్తూ వాక్యాన్ని క్లుప్తం గా చెప్తూ వుండేవారు. చివరిగా మేము మా కాంపౌండ్ లో పండి తీసుకువెళ్లిన కొన్నిబొప్పాస కాయలు వారికిచ్చి వారినుండి శెలవు తీసుకుంటూ ఉండేవారం.

## 11.2 చిన్న పరికరాలే - కానీ సేవలో ఎంతో ఉపయోగం

మా తల్లి తండ్రులు దైవారాధన మన హృదయాంతరంగం నుండి రావాలి కానీ పెదవుల నుండి కాదు అని దృఢం గా నమ్మేవారు. ఈ క్రమం లో వాయిద్యాలు - మనం దేవుని ఆరాధించవలసిన విధం గా ఆరాధించేందుకు ఉపయోగ పడే సాధనాలు గా ఉండాలి కానీ, మన మనస్సును ఉల్లాస పరిచే పరికరాలుగా కాదు అని నమ్మేవారు. చర్చ్ ప్రారంభించిన తొలిదినాలలో కేవలం ఒక డ్రమ్ము, కంజిరి మాత్రం ఉండేవి. మా నాన్న పాటలు పాడేటప్పుడు ఆయన పాటలు నడిపించనట్లయితే, ఒక కుర్చీలో కూర్చొని మోకాలి పై కంజిరి వాయిస్తూ పాడుతూ వుండేవారు.

1968 ప్రాంతం లో బెంగళూరు లోని ఒకానొక క్రైస్తవ సంస్థ పది రూపాయలకు కొన్ని పాటలు, వర్తమానాలు వివిధ భాషలలో వున్నా గ్రామఫోన్ రికార్డులు కొన్నిటితో పాటూ వాటిని వినిపించేందుకు చేతితో తిప్పే 'టర్న్-టాక్' అనే పరికరాన్ని పంపుతున్నారని చెప్పటం తో మా నాన్న ఒకటి తెప్పించారు. ఈ టర్న్-టాక్' చేతితో తిప్పినంత సేపు రికార్డు లోని పాట లేక

వర్తమానాన్ని వినిపించేది. ఈ పరికరం చుట్టుపక్కల గ్రామాలలో సేవ చేసేందుకు మా చర్చ్ లో రక్షణ పొందిన యువకులు తమ తమ గ్రామాలకు తీసుకు వెళ్లి వర్తమానాలు వినిపించి సేవ చేస్తూ వుండేవారు.

ఈ పుస్తకం మొదట్లో పరిచయం చేసిన ఇంజనీర్ డేవిడ్ గారు 1970 లో ఏడెన్ దేశం లో వున్నారు. ఆయన అప్పుడప్పుడు మా నాన్నతో ఉత్తరాలతో సంబంధం కలిగివుండేవారు. ఆయన ఇండియా కు వచ్చే ఒకానొక సమయం లో మా నాన్నకు సువార్త సేవలో ఉపయోగపడుతుంది అనే ఉద్దేశ్యం తో ఒక క్యాసెట్ టేప్ రికార్డర్ తీసుకు వచ్చారు. ఈ టేప్ రికార్డర్ తో అనూహ్యం గా వర్తమానాలు, సాక్షాలు రికార్డు చేసేందుకు, సేవకులు లేని సమయం లో సంఘం లో వర్తమానాలు వినేందుకు, కొత్తపాటలు రికార్డు చేసి నేర్చుకునేందుకు ఉపయోగపడింది. ఆ రోజుల్లో చేసి ఉంచిన కొన్ని బలమైన వర్తమానాలు, సాక్షాలూ మా తమ్ముడు వెస్లీ ఇప్పటికీ సేకరించి వేరే ఫార్మాట్ లలో ఇతరులకు చేరేలా ఈ రోజుకూ చూస్తున్నాడు.

1972 లో ఒకానొక మా కుటుంబ స్నేహితులు రేడియో బహూకరించారు. దీనితో న్యూస్, ఇంకా షార్ట్ వేవ్ లో ఎన్నో

క్రైస్తవ ప్రసారాలను 1070s లో వింటూ వుండేవారిమి. దేవుని కృప వల్ల  ఈ రేడియో ను మా ఆత్మలకు నష్టం కలిగించే ఏ ఇతరమైన ప్రోగ్రామ్స్, మ్యూజిక్ వినటానికి  మేమెవ్వరం (పిల్లలు సహా) వాడలేదు.

సేవ పెరగటం ప్రారంభించినప్పుడు, ఆరాధనలకు  హాజరయ్యే ప్రజల సంఖ్య క్రమంగా పెరగటం ప్రారంభం అయ్యింది.  అయితే ఆ సమయం లో మేము ఆరాధనలు 1973 లో నిర్మించిన ఆస్బెస్టాస్ షెడ్ కు చుట్టూ గోడలు లేకపోవటం వల్ల చాలా గట్టిగ పలికితే కానీ హాలు లోని చివరి ప్రజలకు వినిపించేది కాదు. అప్పటికే ఇరవైఐదు సంవత్సరాలు గా ఆలా చేస్తున్న మా నాన్న వయస్సు లో పెరుగుతుండటం తో అది భారంగా పరిణమించింది. ప్రతీ ఆదివారం ఆరాధన ముగిసిన వెంటనే ఆయన తన షర్ట్, బన్నీ మార్చుకొని వాటిని పిండితే చమట, నీరులా కారేది! ఆయన తన మనస్సు, హృదయం రెంటినీ దేవుని పనిలో ఆ విధం గా పెట్టి ప్రసంగించేవారు. 1968 కు మునుపు మాకు ప్రసంగించే సేవకునికి పెట్టేందుకు ఒక టేబుల్ ఫ్యాన్ కూడా లేదు.

# 12

# దైవ కృప

## 12.1 పొరుగువారితో సంబంధాలు

దేవుని కృపవల్ల మా చుట్టుపక్కల వుండే వారితోనూ, ఇరుగుపొరుగువారితోనూ మేము ఎప్పుడూ మంచి సంబంధాలు కలిగి వుండే వారిమి. మేమున్న పేట లో ఎక్కువమంది ముస్లింలు, కొంతమంది క్రైస్తవులూ వుండేవారు. వీరందరితో మాకు మంచి సంబంధం ఉండేది. అంతేకాకుండా మా చుట్టుపక్కల అనేక చర్చ్ లు కూడా ఉండేవి, ఈ సంఘ కాపరులందరితో మా నాన్న చాల సోదర భావం కలిగి వ్యవహరించేవారు. ఈ కాపరులందరిలో ఒకరిగా తనను తాను భావించుకొని, వీరందరి ఏకైక గురి -

క్రీస్తును ప్రకటించుట మాత్రమే అని గుర్తించి ఆ విధం గా వారితో ఒకరై పని చేస్తూ వుండేవారు.

## 12.2 నేర్చుకునే మనస్సును కాపాడు కొనుట

మా తల్లితండ్రులు వయస్సులో పెద్దవారిని, ఆత్మలో సహచరులను, పెద్దలను - అందరినీ గౌరవిస్తూ వుండేవారు. ఒక సంఘ కాపరిగా మా నాన్న తన పరిధిలోని విశ్వాసులలో ఒకవేళ సరిదిద్దవలసిన అంశాలు ఏమైనా ఉంటే, ఆయనే చూచుకుంటూ వుండేవారు. ఎప్పుడైనా తనకన్నా పెద్దవారికి తెలియజేయవలసిన సందర్భాలు ఒకటి రెండు ఏర్పడి, తప్పని పరిస్థితి అయితే తప్ప - విషయాలు అన్నీ పెద్దలకు చెప్పి ఏదో పెద్దవారి వద్ద అయన పరపతి పెంచుకోవాలి అనే సాతాను శోధన లో ఏనాడూ పడకుండా మాతల్లితండ్రులు ఇద్దరూ జాగ్రత్త పడేవారు. ఆ దినాలలో మా నాన్న గారి అక్క, తమ్ముడు ఇద్దరూ చెన్నై లో వుండేవారు. ఆరోజుల్లో రిట్రీట్ నుండి బయటకు ఏదైనా పని మీద వెళ్లే ఎవరైనా, పెద్దవారి నుండి అనుమతి తీసుకొని బయటకు వెళ్ళవలసివుండేది. ఈ రిట్రీట్ పదిరోజుల వ్యవధి లో ఒకే ఒక్క రోజు మధ్యాహ్నం మా నాన్న వీళ్ళని చూసి వచ్చే0దుకు వెళ్లేవారు. ఆ రెండు, మూడు గంటల వ్యవధిలో వారికి కేవలం కనబడి రావటం తప్ప మాట్లాడే సమయం కూడా వుండేది కాదు. అయినా ఆయన ఎప్పుడూ పెద్దవారి అనుమతి

తీసుకోకుండా బయటకు వెళ్ళేవారుకాదు. ఈ విధమైన అణకువ ను ఆయన చివరివరకూ కొనసాగించి కాపాడుకున్నారు.

## 12.3 ప్రవచన వరము

మా నాన్న గారు రక్షణ నొందిన మొదటి దినాల నుండి ఆయన ప్రార్థించేటప్పుడు కొన్నిసార్లు ఆయనకు తెలియకుండానే వేరే భాషలలో ప్రార్థన చెయ్యటం గమనించిన కొందరు, ఆయన తమ భాషలో ప్రార్థిస్తున్నట్లు చెప్పారట. ఆ సమయం లో ఒకానొక అనుభవం గల సేవకుడు మా నాన్నకు దేవుని సన్నిధి లో ప్రవచన వరం కోసం ప్రార్థించమని సలహా ఇచ్చారట; దానితో ఆయన దానికోసం ప్రార్థించి ఆ వరం పొందారు. ఇక భాషల వరం క్రమక్రమం గా నిలిచిపోయిందట!

ప్రవచన వరంగల దైవసేవకునిగా ఆయన సంఘంలో ఎంతోమందిని ప్రార్థనపూర్వకం గా అనేక విషయాలలో హెచ్చరిస్తూ వుండేవారు. ఆయన ఇచ్చిన హెచ్చరికలు తీసుకున్న, తీసుకోని వారి నుండి కూడా ఆ తర్వాత ఆయన ఏ ఏ విషయాలలో వారిని హెచ్చరించారో - వారు ఎలా స్పందించారో,

వాటి పర్యవసానాలు ఎలా వుండినాయో - మేము వారినుండే స్వయం గా విన్నాము.

ఒకానొక సందర్భంలో అది వెస్లీ కి చివరి పరీక్ష సమయం. ఈ పరీక్ష పాసుకాకుంటే ఎంతో అనిశ్చితి చూడవలసిన పరిస్థితి నెలకొనివుంది. అయితే పరీక్ష కు బాగా సిద్ధపడినప్పటికీ, వెస్లీ అనూహ్యం గా ఆ పరీక్షలో సరిగా రాయలేకపోయాడు. పరీక్షానంతరం పగిలిపోయిన హృదయం తోనూ, దుఃఖం తోనూ హాస్టల్ గదికి తిరిగి వచ్చిన వెస్లీ కి, అంతకు ముందు రోజు మా నాన్న వ్రాసిన వుత్తరం అందింది. దానిలో మా నాన్న, "నాయినా రేపు ఈ సమయానికి నువ్వు పరీక్ష రాయటం పూర్తిచేసి ఉంటావు. నేను నీకోసం ఇంకా ఆసక్తి తో ప్రార్ధిస్తున్నాను; ఎందుకంటే ప్రభువు నువ్వు పరీక్ష సరిగా రాయలేకపోతున్నట్లు నాకు చూపిస్తున్నాడు! ఈ ఉత్తరం అందిన వెంటనే విషయం తెలియజేస్తూ జవాబు వ్రాయి, నేను ఆసక్తి తో ఎదురు చూస్తున్నాను. " అని వ్రాసి ముగించారు.

మా నాన్న ఆయన వుత్తరం లో 24 గంటలు ముందే వ్రాసిన విధం గానే, వెస్లీ తన పరీక్ష సరిగా వ్రాయలేకపోయాడు !

# 12.4 దేవుని కాపుదల పిచ్చుక పై సహితం నిలిచి వుంది

ఇప్పటివరకూ నేను ప్రస్తావించిన విషయాలే కాకుండా ఇంకొన్ని విషయాలూ మీతో పంచుకోవాల్సినవి వున్నాయి -

## 12.4.1 దేవుని కాపుదల

మేము ఆ దినాలలో నివాసం వుండి ప్రార్థన కూటాలు కొనసాగిస్తున్న కాంపౌండ్ లో ఎన్నో పాములు కనిపించేవి. మా కాంపౌండ్ జన నివాసం వుండే ప్రదేశం లోనే వుండి, దానిని ఎప్పుడూ శుభ్రం గా ఉంచినా, ఎక్కడి నుండి ఎలా వచ్చేవో తెలీదు గాని మేము డజన్ల కొద్దీ కట్లపాములను చంపాము. ఇవి గేట్ ల పైనా, సైకిల్స్ పైన, మేము పడుకునే చాపల మీద, నీటి కుళాయిల మీద సహితం వుండటం చూసి చంపివేశాము. ఒకానొక సారి మా చిన్న తమ్ముడు కి నాలుగేండ్లు వున్నప్పుడు వాడిని మేమున్న పాక లో దోమతెర కింద పడుకోబెట్టి రాత్రి ఉపవాస కూటానికి మా అమ్మవెళ్లారు. మా నాన్న ఉజ్జీవ కూటాల లో ప్రసంగించేందుకు వేరే వూరు వెళ్లారు. శనివారం రాత్రి ఎనిమిది గంటలకు ప్రారంభమైన ఉపవాస కూటము మధ్య

రాత్రి దాటిన తర్వాత ముగిసినప్పుడు, మా అమ్మ వచ్చి వాడి పక్కన పడుకున్నప్పుడు దోమతెరపై బెడ్ లాంప్ మసక కాంతిలో ఎదో ఒక తాడులాగా కనిపించింది. కొంత సేపటికి అది కొంతసాగుతూ కపించటం తో ఆందోళన చెందిన మా అమ్మ పక్కనే చర్చ్ లోనే వున్నా - ఆ రోజుల్లో చర్చ్ కి వచ్చి రక్షణ నొంది, హాస్టల్ లో తింటూ, గుడి కి సంబంధించిన చాపలు పరచటం, తిరిగి చుట్టి వాటి స్థానం లో పెట్టటం వంటి పనులు చేసే కొంత మంది కాలేజ్ విద్యార్థుల వద్దకు వెళ్లి విషయం తెలియజేసేసరికి వారు వచ్చి చాలా చాకచక్యం గా పిల్లవాడిని నిద్రలేవనివ్వకుండానే పామును చంపివేశారు. ఇలా పాములు చంపటం అనేది మా కాంపౌండ్ లో ఎప్పుడూ జరిగే పనిగా ఉండేది. మా తల్లితండ్రులు ఆ కాంపౌండ్ లో అడుగు పెట్టిన దగ్గరనుండి మా అమ్మ ప్రభువు సన్నిధిలోనికి వెళ్లిపోయే 2004 వరకూ ఈ పని కొనసాగుతూనే వుండింది. కానీ ఏ సందర్భం లోనూ పాములు ఏ ఒక్కరిని కాటు వెయ్యకుండా దేవుడు ప్రతిఒక్కరినీ భద్రపరిచాడు.

## 12.4.2 బెదిరింపులు, అవమానాలు ఎదుర్కొనటం

నిజమైన దైవ సేవకులుగా, దేవునికి మాత్రమే భయపడి పనిచేసే సువార్తికులు - బెదిరింపులు, అవమానములు ఎదుర్కొనటం సర్వసాధారణం! భయపెట్టే ఉత్తరాలు రాటం, ముఖం మీదే నోటికి వచ్చినట్లు మాట్లాడటం - ఇవన్నీ మా తల్లితండ్రులకు కొత్తేమీ కాదు.

మా చర్చ్ కి హాజరయ్యే వారిలో ఎక్కువ మంది ఆ దినాలలో విద్యార్ధులే వుండేవారు. ప్రతి సంవత్సరం కొంత మంది బందరు లో తమ విద్య పూర్తి చేసుకొని తిరిగి స్వగ్రామాలకు వెళ్తూ ఉండేవారు. వారిలో కొందరు తమ తమ గ్రామాలలో సేవ ఆరంభించేవారు. ఇది కొంత పెరుగుతున్న సమయం లో మా నాన్న ఆ గ్రామాలూ దర్శించి అవసరమైతే అక్కడ కూటాలు పెడుతూ వుండేవారు. ఈ విధం గా సేవ ఇతర ప్రదేశాలకూ వ్యాప్తి చెందేది.

ఇలా చిన్న చిన్న గ్రామాల నుండి వచ్చిన కొందరు విద్యార్థులు మా చర్చ్ ఆరాధనలకు వచ్చి వాక్యం విన్నా తర్వాత తమ హృదయం లో గ్రహింపు కలిగి, తాము తప్పు సమాచారాన్ని

తమ స్కాలర్ షిప్ అప్లికేషన్స్ లో ఇచ్చి ఉపకారవేతనాన్ని పొందటం తప్పు అని తెలుసుకొని, ఆ డబ్బును తీసుకొనటానికి నిరాకరించేవారు. ఈ సమయం లో ఈ విషయం తెలుసుకొన్న వారి తల్లితండ్రులలో కొందరు మా తల్లి తండ్రులపై కన్నెర్ర చేస్తూ, నిందిస్తూ, వారి సువార్త పరిచర్య వలననే తమ పిల్లలు వచ్చే ప్రయోజనాన్ని నిరాకరిస్తున్నారు అని నిందించేవారు. ఇలాటి పరిస్థితులు, సమయాలు చూడవలసిన వారిగా తమ్మును తాము ప్రభువు సేవకు సమర్పించుకున్న దినముననే తీర్మానించుకున్న వారిగా - మా తల్లితండ్రులు ప్రభువు నందు తమ ఆదరణ ను పొందుతూ వుండేవారు.

ఒకానొక సమయం లో ఒకానొక యవ్వనుడు మా నాన్న, సువార్తను ప్రకటించినందువల్ల ప్రభువును తెలుసుకొని తాను ప్రేమించిన యువతిని విడిచిపేయవలసిన అవసరతను గుర్తించి ఆలా చేసినందువల్ల, ఆ అమ్మాయి తరపు వారు ఆ యువకుని, అందుకు కారణం అయిన మా నాన్నను కూడా మట్టుపెట్టేయాలి అని ఆలోచిస్తున్నా సమయం లో ఆ సమాచారాన్ని తెలుసుకున్న వీరు దేవుని కృపను బట్టి వారి బారిని పడక ముందే అక్కడ నుండి తప్పించుకోగలిగారు.

మరో సందర్భం లో మా గుడికి వచ్చే ఒకానొక సోదరుని కుటుంబానికి మా నాన్న చెయ్యదలచిన సహాయాన్ని తప్పుగా అర్థం చేసుకున్న ఆ సోదరుని భార్య ఒక ఉదయం అందరూ హడావిడిగా స్కూల్స్ కూ, ఆఫీసు లకు వెళ్తున్న సమయం లో మా కాంపౌండ్ గేట్ ముందు నిలబడి మా నాన్నవైపు తిరిగి శపించటం, కేకలువెయ్యటం, అరవటం మొదలు పెట్టింది. విషయం గమనించిన మా నాన్న ఏ జవాబూ చెప్పలేదు. కొంతసేపటి తర్వాత ఆమె వెళ్ళిపోయింది. తర్వాత ఆమె నిమిత్తం మా తల్లితండ్రులు, సంఘము ప్రార్ధించినప్పుడు అనూహ్యం గా ఆమె వైఖరి మారి ప్రార్థన కూటాలకు రావటం ప్రారంభించింది.

### 12.4.3 దేవుని చిత్తానికి లోబరుచుకొనుట

చనిపోయే వరకు మా నాన్న సైకిల్ మాత్రమే వాడేవారు. ఆయనకు సేవలో ఉపయోగపడుతుంది అని ఎవరో ఒకరు ఒక పాత స్కూటర్ ఇవ్వజూపినప్పుడు దాని విషయమై ప్రార్ధించి, దానిని వారి నుండి పొందేందుకు ఆయనకు ప్రభువు నొద్దనుండి సెలవు లేనట్లుగా గ్రహించి, సున్నితంగా వారు ఇవ్వజూపిన బహుమతిని తిరస్కరించారు.



చిత్రం *17:* ఆయన పాత సైకిల్ తో ఏబెల్ గారు

# 13

# ఏబెల్ దంపతుల 25 వ వివాహ వార్షికోత్సవం - జూన్ 1981

జూన్ 11, 1981 కి మా తల్లితండ్రులు తమ వివాహమై ప్రభువు నామాన్ని మహిమపరుస్తూ ఇరవైఐదు సంవత్సరాలు పూర్తిచెయ్యటం జరిగింది. వారు తమ సేవ ప్రారంభించిన దినం నుండి సంఘ సభ్యుల సంఖ్య క్రమ క్రమంగా పెరుగుతూ, పరిస్థితులు కూడా చాలా మారాయి. ఆ సమయం లో నేను, మా చిన్నతమ్ముడు ఇమ్మానుయేల్ బందరులో మా అమ్మానాన్నలతో వున్నాము, కానీ మా పెద్దతమ్ముడు వెస్లీ చదువు నిమిత్తం విశాఖపట్నం లో వున్నాడు.

ఒక చిన్నస్తుతి  ప్రార్థన కూటం ఏర్పాటు చేసి, మా తల్లితండ్రులు ఇద్దరూ తమ తమ సాక్ష్యాలను

ఇచ్చారు.  కూటమునకు హాజరైన అనేకమంది ప్రభువు నామం మహిమ పరచబడినందుకు ఆనంద భాష్పాలతో ప్రభువును

స్తుతించారు. ఆ తర్వాత ఇంకొందరు మాట్లాడిన పిమ్మట ప్రార్థన తో కూటము ముగించబడినది. ఇచ్చిన సాక్షం లో మా నాన్న ఆ సమయం లో తన మనస్సు లో మెదులుతున్న రెండుప్రశ్నలు - 1) ఒక భర్తగా, ఒక తండ్రి గా ఆయన వ్యక్తిగత జీవితం ఎంత మాదిరికరము గా వున్నది అనే ప్రశ్న 2) మా కుటుంబం అంతా ఎంతమాదిరి కరము గా వున్నది అనే ప్రశ్న - అని తెలియజేశారు

# 14

## వెస్లీ సాక్షం (తన సొంత మాటల్లో)

నేను బందరు లోని ఎల్ ఈ ఎఫ్ సువార్తికులు గా పని చేసిన ఏబెల్ దంపతుల రెండవ సంతానము, మొదటి కుమారుడను. ఇంటిలోని కఠినమైన క్రమశిక్షణ, ప్రార్ధన వాతావరణం స్వాభావికం గా చెడును ఆశించే మానవ స్వభావం నుండి నన్ను ఆపలేకపోయాయి. వయస్సు తో పాటు నాలో చెడును ఆశించే స్థితికూడా పెరిగింది. నా తల్లితండ్రుల దండన, శిక్ష - దాని నుండి నన్ను ఆపలేక పోయాయి.

ఎలిమెంటరీ, హై స్కూల్ చదివే సమయం లో మొదటి రాంక్ లలో వుండే నా చదువు

ఇంటర్మీడియట్ కు వచ్చిన తర్వాత, నా మనస్సు లోక సంబంధమైన వాటివైపుకు మళ్లటం వల్ల వెనుకబడిపోటం ప్రారంభించింది. ఆ సమయం లో దేవుని విషయాలలో నాలో ఆసక్తి తగ్గటం గమనించిన మా నాన్న, దాని పర్యవసానం

జీవితం లోని మిగిలిన అన్ని రంగాలపై వుంటుందని ఒక అనుభవం గల సేవకునిగా గ్రహించి నన్ను ఘాటుగా హెచ్చరించారు. అయితే ఆ రోజుల్లో ఒక టీనేజ్ బాలునిగా ఆయన మాటను నేను పెద్దలెక్కచెయ్యలేదు. దీనితో నా ఇంటర్మీడియట్, డిగ్రీ చదువులో నా మార్కులు ఇంకా వెనుక బడ్డాయి.

ఆ దినాలలో దేవుని వాఖ్యాను సారం గా నా బ్రతుకులేక పోవటం గమనించిన కొంత మంది యువకులు నన్ను గేలి చేస్తుండేవారు. బహు సున్నితమైన మనస్సు గల వాడిగా వారి హేళనను తట్టుకోలేక, నేను పట్టణ శివారు ప్రాంతాలకు పోయి నా పరిస్థితిని గురించి ఒక్కడినే చాలా బాధ పడుతూ ఉండేవాడిని. బాగా పొద్దుపోయిన తర్వాత ఇంటికి తిరిగి వచ్చిన నన్ను మా తల్లితండ్రులు ప్రశ్నించితే చిరాకు పడుతూ వారికి అబద్దాలు చెప్తూ వుండేవాడిని. ఇక పడకకు వెళ్లిన అనంతరం కూడా నిద్రలేకుండా, చాలా బాధతో కాలం వెళ్లబుచ్చుతూ ఉండేవాడిని. అప్పటివరకు ఎన్నడూ అలా వుండని నేను ఎందుకు అలా ఉంటున్నాను అనే విషయం వారికి అర్థం అయ్యేది కాదు. ఇక ఈ మానసిక క్ష్యోభ్యత ను భరించాలంటే చుట్టుపక్కల ఎవ్వరికీ

కనబడకుండా ఎక్కువకాలం వూరు కాని మరో వూరులో ఉండటం నాకు తప్పనిసరి అని అనిపించింది. ఆ సమయం లో నా చదువులో నేను పెద్దగా రాణించకపోయినా దేవుని కృప వల్ల బీ యస్సీ పూర్తి చేయగలిగాను.

ఇదే సమయం లో విశాఖ పట్నం లో ఆంధ్రా విశ్వవిద్యాలయం లో సీట్ రావటం తో బందరు నుండి అక్కడకు వెళ్ళాను. అమ్మయ్య వూరునుండి బయటపడ్డాను అని అనుకుంటున్నా సమయం లోనే - నేను ఇల్లు విడిచి మొదటి సారి వేరొక ఊరిలో ఉండటం, అక్కడ హాస్టల్ లో ఇంకా ఏడుగురితో ఒకలసి ఒకే గదిలో ఉండాల్సిన పరిస్థితి రావటం, ఇక వీటన్నిటికీ తోడూ నా బ్రతుకు లో ఆత్మీయం గా ఏ మార్పు లేకపోవటం తో, నాకు అప్పటికే వున్నా శాంతి, సమాధానం లేని పరిస్థితి మరింత దిగజారింది. దీనితో చదువులో మరింత వెనుకబడిపోటం, పరీక్షల సమయం లో పరీక్షలు రాయకుండా వుండటం - ఇవన్నీ కలసి నా పరిస్థితి ని మరింత క్రుంగ జేశాయి.

రెండో సెమిస్టర్ లోనూ నా చదువు లో ఏ విధమైన మార్పూ లేదు. మళ్ళీ ఇక ఆ సెమిస్టర్ చివరిలో రాయవలసిన పరీక్షలు కూడా ఏవీ రాయకుండా వదిలెయ్యటం తో నా పరిస్థితి -

'మింగలేను, కక్కలేను' అన్న విధంగానూ, 'మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు' గానూ తయారయ్యింది!

ఈ సమయం లో ఇంటిలో ఉగ్గుపాలతో నేర్పిన అలవాట్లయిన - ప్రతి ఆదివారం చర్చ్ కివెళ్ళటం, సిగరెట్లకు అలవాటు పడకపోవటం, సినిమాలకు వెళ్ళకపోవడం - ఇవన్నీ షరా మామూలుగానే కొనసాగుతూ ఉండేవి. ఇవన్నీ చూసే నా స్నేహితులకు, క్లాసుమేట్స్ కు - ఏ దురలవాటు లేకుండా, కనీసం సినిమాలు కూడా చూసే అలవాటు లేకుండా దైవ భక్తి తో వుండే నేను ఎందుకు చదువులో వెనుక బడి వున్నానో అర్థం అయ్యేది కాదు.

మొదటి సంవత్సరం పూర్తి అయ్యింది, అయితే ఆ సంవత్సరం లో పూర్తి చెయ్యవలసిన ఎనిమిది పేపర్స్ లో ఏ ఒక్కటీ పూర్తి కాలేదు! రెండో సంవత్సరం ప్రారంభం అయ్యింది, ఇప్పుడు ఇద్దరిద్దరికి ఒక గది హాస్టల్ లో కేయించినప్పటికీ నా పరిస్థితి ఏమాత్రం మెరుగుపడలేదు, కానీ ఇంకా దిగజారింది. ఇప్పుడు అసలు క్లాసు లకు హాజరు కావటమే మానేసి రోడ్లపై ఒక గురి, లక్ష్యం లేని వాడిగా తిరుగుతూ, కాలం గడుపుతూ ఒక పిచ్చి వాడిలా తిరుగుతూ ఉండేవాడిని. రాత్రులు నిద్ర పట్టక చాలా

బాధ పడేవాడిని. ఇక చదువు విషయం గుర్తు వస్తేనే ఒళ్ళంతా చల్లగా అయిపోయి వణుకు వచ్చేసేది.

రోజులు జరిగిపోయాయి, తొందరలో మూడవ సెమిస్టర్ పూర్తి కాబోతున్నది!! ఇక నేనున్నా పరిస్థితితో జీవితం విషమంగా తయారయ్యింది. మానసికంగా కృంగి పోయిన నేను, నాలో నేనే ఎన్నో మార్లు ఏడుస్తూ ఉండేవాడిని, ఇక చుట్టూ ఎవరు లేని సమయం లో గట్టిగా వెక్కెక్కి పడి ఎన్నో మార్లు ఏడ్చేవాడిని. ఏ గురి, గమ్యం లేని పిచ్చివాడిగా రోడ్ల పై రోజంతా తిరిగి రాత్రికి వచ్చి హాస్టల్ లో పడుకోటం నా దినచర్య గా మారింది.

నాకు గాని, మరెవ్వరికైనా ఉపయోగం లేని నా జీవితాన్ని నాకు నేనే ముగించెయ్యటం తప్ప నాకు వేరొక మార్గం కనిపించలేదు అనిపించింది. ఆ సమయం లో మా తల్లి తండ్రులను గురించి నేను ఆలో చించినప్పుడు, వారిజీవితం, వారు చేసే ఆత్మల రక్షణ నిమిత్తమైన  దేవుని సేవ, నా పట్ల వారికున్న ప్రేమ, ఆప్యాయత - ఇదంతా గుర్తుకు వచ్చినప్పుడు నా భావోద్వేగాన్ని అపుకోలేక గట్టిగా ఏడ్చేసాను.

ఆ దినాలలో ఒకానొక సమయం లో బందరు లోని మా ఇంటికి వెళ్లి ఒకటి రెండు రోజులు వున్నా తర్వాత తిరిగి యూనివర్సిటీ కి బయలుదేరాను. ఎప్పటిలాగే ప్రయాణానికి ముందు మా అమ్మ ప్రార్థన చేశారు, కానీ ఈ సారి ఆమె చేసిన ప్రార్థన చాలా వ్యత్యాసం గా అనిపించింది! ఈ సారి చేసిన ప్రార్థన లో ఆమె "ఈ నా కుమారుడు మరుసటి సారి ఇంటికి వచ్చేటప్పుడు నిన్ను అంగీకరించి తెలుసుకొన్న వాడై వచ్చేలా చెయ్యి" అని ప్రార్థించారు. అప్పుడు నాకున్న పరిస్థితి నాకు తప్ప ఆమెకు ఏ మాత్రం తెలీదు; ఇక ఇటీవలే నా జీవితాన్ని సహితం ముగించి వెయ్యాలి అనే తలంపు నాలో చోటు చేసుకోవటం నాకు గుర్తు వచ్చి, నా పరిస్థితి ఏమాత్రం తెలియని నా తల్లితండ్రుల ప్రేమ నాకు ఎదురుగా ప్రత్యక్షం గా కనబడు తున్నప్పుడు, నా ఉద్వేగం క్షణికం గా ఆపుకున్నా, రిక్షాలో బస్టాండ్ కు వెళ్ళేటప్పుడు ఆపుకోలేక చేతిరుమాలు తో నా ముఖం కప్పుకొని ఏడుస్తూ బస్టాండ్ చేరాను.

తిరిగి విశాఖపట్నం చేరిన నాకు రోజులు చాల అతి భారం గా గడుస్తున్నాయి. ఒక ఆదివారం ఆ బాధను కనీసం తాత్కాలికంగాఅయినా మర్చిపోయేందుకు సినిమా కు వెళ్తే ఎలా

ఉంటుంది? అనే తలంపు వచ్చి నా క్లాసుమేట్ ఒకతని దగ్గరకు వెళ్లి "సినిమాకు వెళ్దాం వస్తావా?" అని అడిగాను. నేను జోక్ చేస్తున్నాను అనుకున్నాడు అతను! చాల సేపు నమ్మని అతను చివరకు అంగీకరించి వచ్చాడు. ఎందుకంటే అప్పటివరకు నేను ఒక్క సినిమా కూడా చూడలేదని, మా ఇంట్లో ఆ అలవాటు ఎవ్వరికీ లేదు అని నా క్లాసుమేట్స్ అందరికీ తెలుసు. వెస్లీ ని సినిమాకి తీసుకు వెళ్లగలిగితేఇంత పందెం, అంత పందెం అని నా గురించి పందాలు కూడా వారు వేసుకునే వారు! అయితే ఆ దినం నా పరిస్థితి అలా దిగజారింది!

మేమిద్దరం కలసి విశాఖపట్నం లోని జగదాంబ టాకీస్ లో ఒక ఇంగ్లీష్ సినిమా చూడటానికి ప్రవేశించాం. అదే మొదటి సారి ఒక సినిమా చూసేందుకు నేను సినిమా హాల్ లో ప్రవేశించటం! సినిమా మొదలయ్యింది, కానీ నేను ఆశించిన రీతిగా సినిమాకు వెళ్ళటం వల్ల నా కృంగిన మానసిక స్థితి నుండి నాకు సడలింపు ఏ మాత్రం లేక పోగా ఇంకా పెరిగింది! అక్కడ వున్నా సమయం లో మా అమ్మనాన్నలు నాకు జ్ఞాపకం వచ్చి, నేను ఏ విధం గా ప్రతి ఆదివారం చర్చ్ కి హాజరయ్యే విధం గా పెంచబడ్డానో, అయితే ఆ ఆదివారం మధ్యాహ్నం మాత్రం సినిమా హాల్ లో

తయారయ్యానో అనే విషయం ఆలోచించినప్పుడు దానిని నేను జీర్ణించుకోలేక పోయాను.

సినిమా ముగిసింది, అయితే నేనాశించిన మానసిక శాంతి గాని, ఒత్తిడి నుండి నాకు స్వాతంత్ర్యం గాని నేను పొందలేదు గాని నా పరిస్థితి ఇంకా జటిలం గా మారింది! అన్ని వైపుల నుండి అన్ని విధాలు గా నన్ను చుట్టుకున్న సమస్యల గురించి అలోచించి ఒక తీవ్రమైన నిట్టూర్పు విడిచాను.

ఆరోజు మరింత కృంగిన స్థితిలో పడకకు వెళ్లాను. మధ్య రాత్రి దాదాపు రెండు గంటల సమయం లో ఒక దురాత్మ నన్ను పట్టి పీడిస్తున్న సమయం లో నేను ఒక కట్టివేయ బడిన వాడిలా విదిలించుకునే ొందుకు ప్రయత్నిస్తూ వున్నాను. పోనీ సహాయం కోసం అడుగుదాం అంటే నోటి నుండి మాట బయటకు రావటల్లేదు! కొంత సేపు ఈ పెనుగులాట సాగిన తర్వాత దురాత్మ నన్ను ఒక్కసారిగా విడిచిపెట్టడం తో నా చెయ్యి పక్కనే వున్నా గోడను కొట్టుకొని నిద్రలేచాను. పక్కనే హాయిగా నిద్రపోతున్న మా రూమ్మేట్ పడకదీపం మసక మసక కాంతిలో కనిపించాడు. తలుపు తీసి వరండా లోకి వచ్చాను! నాలుగు వందల మంది విద్యార్థులు వుండే ఆ హాస్టల్ లో మధ్యరాత్రిలో

అంతా నిశబ్దం ఆవరించింది. ఆకాశం వైపు చూస్తే చుక్కలు మినుకు మినుకు మంటూ కనిపించాయి. దేవుడు సమస్తాన్ని ఏంతో పదిలంగానూ, అందం గానూ చేశాడు, నా జీవితాన్ని తప్ప (!) అనుకోని కన్నీళ్లు పెట్టుకున్నాను.

ఉదయం అయ్యింది, బ్రేక్ ఫాస్ట్ చేసిన అనంతరం అందరూ క్లాస్ కు వెళ్లిపోయారు - నేను తప్ప! ఆ సమయం లో నేను జీవితం లో మానసికం గా అత్యంత దిగువ స్థాయిలో వున్నాను. ఇంతలో వరండాలో వస్తున్న పోస్టుమాన్ చెప్పుల శబ్దం వినిపిస్తుంది. అతను నా గదిలో కూడా ఉత్తరాలు వేసినట్లు గమనించి వెళ్లి నాకు వచ్చిన ఒక వుత్తరం తీసుకొని విప్పి చదవటం ప్రారంభించాను. ఒకానొక ఫ్రెండ్ నుండి వచ్చిన వుత్తరం అది. ఆ వుత్తరం చదివిన తర్వాత నేను అప్పటివరకూ ప్రేమిస్తున్న లోకం, దానిలోని వన్నీ కేవలం వ్యర్థమైనవని, అవి అప్పుడే కనబడి అంతలోనే అదృశ్యం అయ్యే 'నీటి ఆవిరి' వంటివని తెలిసింది. అయితే ఇలాటి స్థిరము లేని లోకం కోసం నేను ఇంతకాలముగా గాలి కోసం వెతుకుతున్నట్లు వెతుకుతున్నానా? అని నన్ను నేను ప్రశ్నించుకున్నాను. 'అవును' అనే జవాబు తప్ప మరి ఏ ఇతర జవాబు నాకు లేదు! సాతాను ద్వారా నేను అప్పటివరకూ

మోసగించబడి పోయిన మోసము, పడిన నష్టాన్ని బట్టి నేను దుఃఖాన్ని ఆపుకోలేకపోయాను. ఎవ్వరూ చుట్టూ లేకపోవటం తో గదిలో బోల్ట్ వేసి చాలా ఏడ్చాను. ఆ సమయం లో నాకు విముక్తి కలిగించే ఒకే ఒక మార్గం ఏమిటా అని ఆలోచిస్తే - దేవుని కృప, కరుణ గలిగిన హస్తాలలోనికి వెళ్లి నా జీవితాన్ని సరిచేసుకొని, తిరిగి దానిని పునర్నిర్మించుకోవటం తప్ప మరి ఏ ఇతర మార్గం లేదు అని గ్రహించాను! ఇక ఏమాత్రం సమయం వృథా చెయ్యకుండా ఆ పని చెయ్యాలని నిర్ణయించుకున్నాను. నా జీవితాన్ని గురించి మొదట నాతల్లితండ్రులతో వెంటనే సరి చేసుకోవాలి అనుకున్నాను.

ఆ సమయం లో ఎం ఫిల్ చేసే నిమిత్తం అక్కడే వున్నా మా చర్చ్ కి వచ్చే బ్రదర్. పుష్పరాజ్ గారిని కలిసి నా పరిస్థితి గురించి చెప్పి ఇంటికి బయలుదేరాను. విశాఖ రైల్వే స్టేషన్ చేరిన నాకు, అనుకోకుండా మా క్లాసుమేట్ ఒకతను నేను వెళ్లబోయే ట్రైన్ లోనే కొంత దూరం నాతోపాటు ప్రయాణించేందుకు అక్కడ కనిపించాడు. పగిలిపోయిన హృదయం తో వున్నా నా ఫీలింగ్స్ ఏ ఒక్కరు చూసేందుకు ఇష్టం లేని ఈ సమయం లో “ఇతనితో పాటు అన్ని గంటల పాటు, అదే ట్రైన్ లో ఎలా ప్రయాణించాలి?”

అనుకున్నాను! అయితే చేసేది లేక ఇద్దరం ట్రైన్ ఎక్కితే ఎక్కడా సీట్లు లేవు; ఎదురుబదురుగా వున్నా రెండు బెర్త్ లపై వున్నా ఇతరుల సామానులు కొంత అవతలకు నెట్టి, బెర్త్ ల పైకెక్కి ఎదురుబదురుగా కూర్చున్నాం. ఇక నా ముఖం అతనికి ఎదురుగా ఆలా కనబడుతూ వుంది. దీనితో నా పరిస్థితి మరింత దయనీయం గా తయారయ్యింది. ఎంత దాచుకుందామనుకున్నా నేనైతే ఉత్సాహం గా లేను అని మాత్రం అతనికి అర్థమయ్యింది. సుదీర్ఘ నిరీక్షణ అనంతరం అతను దిగాల్సిన స్టేషన్ ఎట్టకేలకు వచ్చింది, అతను దిగిపోయాడు! అమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్న నేను చేతి రుమాలుతో ముఖం పూర్తిగా కప్పుకొని సాతాను ద్వారా నేను మోసగించబడిన రీతిని తలంచుకొని బాగా దుఃఖ పడ్డాను. ప్రయాణం చాలా భారం గా సాగింది.

ఎట్టకేలకు మధ్యరాత్రి లో ఇంటికి చేరి తలుపు తట్టిన నాకు మా అమ్మ తలుపు తీసి, అంతకు మునుపే ఇంటికి వచ్చి వెళ్లిన నేను ఇంతలోనే ఎందుకు వచ్చానని అడిగారు."నాన్న లేరా?" అని ప్రశ్నించాను. కుటాలకు వెళ్లినట్లు మరుసటి రోజు రానైయున్నట్లు చెప్పారు. ఇక నేరుగా నేను ఇంటికి ఎందుకు

వెళ్ళింది అనే విషయం చెప్పి నా హృదయం లో అప్పటివరకూ దిగమింగుతున్న భారాన్ని ఆమెతో పంచుకొని, నా హృదయం విప్పి మాట్లాడి ఆమె క్షమాపణ కోరాను. ఒక రెండుగంటల పాటు సాగిన మా సంభాషణ అనంతరం మా అమ్మ నాకోసం ప్రార్థించి కొంత సేపు పడుకోమని పడక గదికి పంపించారు.

మరునాటి మధ్యాహ్నం కూటాలు పూర్తి చేసుకొని ఇంటికి తిరిగి వచ్చిన మా నాన్న తో మాట్లాడాలి అంటే భయపడిన నేను, ఆ రోజు సాయంత్రం, మా తల్లితండ్రుల సేవలో రక్షణ నొంది మేము సొంత అన్నగా అలవాటు పడిన ప్రభాకర్ రావు గారి తో కలసి ఒంటరి ప్రార్థనకు వెళ్ళాను. విషయాలు ఆయనతో పంచుకొని ప్రార్థించిన అనంతరం, అది శనివారం కావటం తో ఉపవాస ప్రార్థనకు వచ్చి చర్చిలో కూర్చున్నాం. పుట్టిన వద్ద నుండి నాకు మా చర్చ్ లో కూర్చొని వాక్యం వినటం అనేది ఉగ్గుపాలతో పోసిన విధ్య; అయితే ఆ రోజు నేను గుడిలో కూర్చొని వాక్యం విన్న తీరు, విధానం మాత్రం నాకు ముందెన్నడూ అనుభవించిన అనుభవం లేదు. మా నాన్న ప్రసంగించేందుకు నిలబడి ప్రసంగిస్తున్నప్పుడు, ఆయన నోట నుండి వచ్చే ప్రతిమాట నాకోసమే వచ్చినట్లు వుండింది. ప్రసంగం ముగించిన తర్వాత

సంఘుమంతా ఉపవాస ప్రార్థన చెయ్యటానికి ఒక్కొక్కరు మొదలు పెట్టినప్పుడు దేవుని ఆత్మ నన్ను బలం గా దర్శించటం తో ప్రభువు లేకుండా నేను గడిపిన జీవితం విషయమై బాగా లోతుగా పశ్చాత్తాప పడి ప్రార్థించాను. ఆ సమయం లో నా చుట్టూ ఎవరున్నారు? నన్ను ఎవరైనా గమనిస్తున్నారా, లేదా ? అనే విషయాలు ఏ మాత్రం పట్టించుకోలేదు. సంఘు సభ్యులంతా ప్రార్థించిన అనంతరం మా నాన్న ముగింపు ప్రార్థన చేసి ఆశీర్వాదం తో ముగించారు. గుడికి వచ్చిన వారంతా వెళ్ళిపోయిన అనంతరం, నేను మా నాన్న దగ్గరకు వెళ్లి నా మోసకరమైన జీవితం గురించి ఆయనకు చెప్పి క్షమాపణ కోరాను, మేమిద్దరం ఆ రాత్రి సమయం లో చాల సేపు ప్రార్థించిన తర్వాత, నా నాన్న నా కోసం ఆయన తన గదిలో ప్రార్థిస్తూ వుంటాను అని చెప్పి, నన్ను మాత్రం ఒంటరిగా ప్రార్థించమని చెప్పి పంపించారు.

ఉదయమైనప్పుడు లోకం అంతా కొత్తగా మారిపోయినట్లు వుండింది. ఆ ఆదివారం రోజు సంఘుం గా నేను వారితో కూడటం, వారితో ఆరాధించటం అంతకు ముందు ఎన్నడూ నేను పొందని ఒక విన్నూత్న మైన అనుభం గా అనిపించింది.

ఇక ఆ సమయం లో నా ముందు నిలిచి వున్నా అడ్డంకి - ఇతరులతో కూడా నా తప్పులు సరిచేసుకోవటం! అంతకు మునుపు ఈ విషయం అంటేనే నాకు చాలా పెను భయం గా ఉండేది. అయితే దేవుని ఆత్మ ప్రేరేపించినప్పుడు దేనినైనా, ఎవరివద్దకైనా నేనువెళ్ళి నా తప్పిదములు సరి చేసుకుందుకు సిద్ధపడి, ఆవిధంగా నా తప్పులు సరి చేసుకోగలిగాను. ఈ సమయం లో నేను ఎన్నడూ పొందని ఆనందం, ప్రభువు రక్షణ లో అనుభవించే సమాధానం నాకు ప్రాప్తించటము నేను అనుభవించగలిగాను.

ఇక ఆ సమయం లో నా ముందు నిలిచి వున్నా సవాలు: నా చదువు! మొదటి సంవత్సరం లో ఏఒక్క పేపర్ పూర్తిచెయ్యని నాకు, ఇక కొద్ది దినాలలో రాయవలసిన మూడవ సెమిస్టర్ పరీక్షలు సమీపిస్తుండటం తో - నేను ఇదంతా చదివి పూర్తిచేసి డిగ్రీ పూర్తి చేయగలనా? అనే సందేహం తో సాతాను నన్ను ప్రతి క్షణం నిరాశ పెట్టటం ప్రారంభించాడు. దేవుని మీద భారం వేసి నా ప్రయత్నం నేను చేస్తాను, దేవుని పై ఆధార పడతాను అనే విశ్వాసం తో తిరిగి హాస్టల్ కు చేరుకున్నాను.

నేను హాస్టల్ గదిలో ప్రవేశించిన వెంటనే దేవుని నడిపింపు కోసం ప్రార్థించి అసాధ్యమైన నా చదువు పూర్తి చేసే విషయం లో సహాయం కోసం దేవుని వేడుకొని, అప్పటినుండి దేవుని పై పూర్తిగా ఆధారపడటం ప్రారంభించాను. ఎంత పని వున్నా- ఉదయం, సాయంత్రం ప్రభువు తో కొంత సమయం ఒంటరి గా గడపటం నా అలవాటు గా మారింది. మూడవ సెమిస్టర్ పరీక్షలకు చాల కొద్ది సమయం మాత్రమే వుండింది, అయినా వున్నా సమయం లోనే సబ్జెక్ట్ లకు సమయం కేటాయించి ప్రణాళికా బద్ధం గా చదవటం ప్రారంభించి ముందుకు సాగినప్పుడు, దేవుని హస్తం నాకు సహాయం చెయ్యటం నేను గమనించాను. చాలా సార్లు ఎత్తులు, పల్లాల గుండా వెళ్ళవలసిన రావటము, మహా సంతోషం - ఆ వెంటనే తెలియని దుఃఖం కలగటము, నిరాశ - ఆ వెంటనే నిరీక్షణ కలగటము, ఇలా ఒకదాని వెంట ఒకటి ఏది ఎప్పుడు కలుగుతుందో తెలియని పరిస్థితి లో - నా జీవితాన్ని నేను సరిద్దిదుకునే ఈ కాలం అంతా అనుభవించాను. ఈ సమయం లో ఏ మాత్రం చెదరి పోని విశ్వాసం. నేను చెయ్యవలసిన అతి కఠోర మైన ప్రరిశ్రమ చెయ్యటం, క్రమ శిక్షణను తూ చ తప్పకుండా పాటించటం తప్పని సరిగా చెయ్యవలసి ఉండేది.

ఆ మూడవ సెమిస్టర్ పరీక్షలు ముగిసాయి. అయితే వున్నా అతి కొద్ది దినాల వ్యవధిలోనే నేను నాలుగింటిలో మూడు పేపర్స్ పాస్ కాగలగటం నాకు ఆశ్చర్యాన్ని, ప్రోత్సాహాన్ని కలిగించింది.

అప్పటికే లేట్ అయిపోయిన కోర్స్ ముగింపును మరింత ఆలస్యం కాకుండా చేసే ఉద్దేశ్యం తో యూనివర్సిటీ వారు కేవలం రెండు నెలల్లో మిగిలివున్న నాల్గవ సెమిస్టర్ ను పూర్తిగా బోధించి ముగించారు. అయితే దేవుని దయ వల్ల నేను ఈ చివరి సెమిస్టర్ లో నాలుగు పేపర్స్ కూడా పాస్ కాగలిగాను. ఆ పిమ్మట ఇంకొంత కాలం లో నేను మిగిలిన పేపర్స్ అన్నీ పూర్తి చేసి ఎం. ఎస్సీ డిగ్రీ పూర్తి చేయగలిగాను,

ఆ తర్వాత గవర్నమెంట్ ఉద్యోగాలకై జరిగిన పోటీ పరీక్ష లో నెగ్గి పాలిటెక్నిక్, తదుపరి జూనియర్ కాలేజీలలో లెక్చరర్ గా పనిచేసేముందు, రెండు చోట్ల తాత్కాలికం గా పని చేసే అవకాశం దేవుడు అనుగ్రహించాడు. అంతే కాకుండా నేను పని చేసిన ప్రతి స్థలం లో మంచి పేరు కూడా కాపాడు కునేందుకు దేవుడు నాకు సహాయం చేశాడు. నేననేకసార్లు ఆత్మీయం గా బలహీనుడి గా వున్నా దేవుడు నా చెయ్యి వదిలిపెట్టలేదు. ఎన్నో విధమైన

ప్రాణాపాయ పరిస్థితులలో సహితం దేవుడు నన్ను కాపాడి రక్షించాడు.

అప్పటినుండి ఇప్పటికి మధ్య ఎన్నో సంవత్సరాలు ముగిసాయి. ఈ దినమున నా ముందున్న సవాళ్లు అన్నీ అప్పటితో పోల్చినప్పుడు చాలా భిన్నమైనవి. అయితే చావు నుండి బ్రతికించి, నిరీక్షణ ననుగ్రహించి, జీవింపచేయు వాడు క్రీస్తు ప్రభువే అని చెప్పేందుకు నా జీవితం కన్నా వేరొక సాక్ష్యం కావాలా??

ఈ దినం నేను ఈ నా సాక్షం రాస్తున్నప్పుడు నాకు వివాహమై ఒక కుమార్తె సహితం వుంది. దేవుని యందు, ఆయనకుమారుడైన క్రీస్తు యేసు నందు విశ్వాసం నిలిపి, నిరీక్షణ తో ఆయన సహాయం కోసం ఎదురు చూసే ప్రతివారికి దేవుడిచ్చే మనశాంతి ఎంతోగొప్పది! ఆయనకే నా సమస్త స్తుతులు, స్తోత్రములు. ఆమెన్.

# 15

# ఏబెల్ గారి ప్రభువు పిలువు

## 15.1. ముందే ఎరుగుట

అది 1981 వేసవికాలం! ఉదయాన్నే మేమంతా కుటుంబ ప్రార్థనకు కూర్చున్న సమయంలో  మా నాన్న "రాత్రి నాకు వచ్చిన కలలో నేను నా నిత్యనివాసానికి వెళ్లిపోతున్నట్లు చూశాను; కాబట్టి ఈ లోకంలో నా సమయం అయిపోయింది అనుకుంటు న్నాను" అన్నారు!  ఈ మాట మాకెవ్వరికీ, మరి ముఖ్యం గా మా అమ్మకు సహించలేదు. వెంటనే ఆమె, "అయితే ఈ కుటుంబ బాధ్యతలు అన్నీ ఎవరు భరించాలి?" అన్నారు. దీనికి  ముఖం పై చిరునవ్వు తో స్పందించిన మా నాన్న, "ఇక అదంతా నీ పని"

అన్నారు. దీనితో ఆందోళన చెందిన మా అమ్మ, "అసలు మీకు వచ్చిన కల ఏమిటి?" అని ఆతృతగా అడిగారు.

దానితో మా నాన్న, " నేను వెళ్తూ వెళ్తూ కాలువ వున్నా ఒక ప్రదేశానికి వచ్చాను, అక్కడ ఒక పడవ వుండటం తో దాని నెక్కి అవతలకు చేరాను. అక్కడ చాలా మంది చిన్న పిల్లలు ఆడుకుంటూ వున్నారు. వారిలో కొంతమంది మన సండేస్కూల్ కు వచ్చే పిల్లలూ  వున్నారు! అక్కడే మన పరిసరాల్లో వుండే ఒక ముస్లిం పిల్ల కూడా కనిపించటం తో - "అమ్మా, నువ్వేలా వచ్చావు ఇక్కడికి?" అని అడిగాను. నేను ప్రభువును తెలుసు కున్నాను గదండీ, అందుకే రాగలిగాను! అని చెప్పింది. ఇక అక్కడి నుండి చుట్టూ తిరుగుతూపోతుంటే ఏంతో ఎత్తైన ఎన్నో గాజు మేడలు కనిపించాయి. అదంతా చూడటం పూర్తి చేసుకొని ఇంటికి తిరిగి వెల్దాము అని పడవ దిగిన ప్రదేశానికి నేను వచ్చేటప్పటికి అక్కడ పడవ లేదు!" అనగానే మా అమ్మ "పడవ లేదా?" అని ఆతురత గా అడిగారు! అందుకు మా నాన్న, "లేదు, కాబట్టి నేను వెళ్లిపోవాల్సిన సమయం వచ్చింది." అని అన్నారు.

ఈ విషయం విన్నప్పుడు మేమంతా చాలా ఆందోళన చెందాం: ఎందుకంటే, మొదటిగా ఆయన  ప్రార్థన పరుడు, అంతేకాకుండా ఆయనకు ప్రవచన వరము కూడా ఉందని మాకందరికీ తెలుసు.

## 15.2. ఏబెల్ గారు తన నిత్య నివాసము చేరుట

అప్పటికే కొన్ని సార్లు రక్తపోటు వంటి వాటి కొరకు ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి తిరిగి వచ్చిన మా నాన్న(52) తిరిగి అదే విధమైన సమస్య కు ఆసుపత్రిలో చేరారు. అక్కడ వున్నా సమయం లో ఆయన కాలి వ్రేళ్లు మొద్దుబారటం తో మెరుగైన వైద్యం నిమిత్తం నేటి చెన్నై కి తరలించాల్సింది గా తమ్ముళ్లయిన - డేవిడ్, విమల్ రావు లను కోరటం తో వారు దానికోసం రెడీ అవుతున్నారు.

ఆయనకు బాగుండక ఆసుపత్రిలో చేరారని, చెన్నైకు తీసుకొని వెళ్ళ బోతున్నారు అని తెలిసి నప్పుడు, ఆయనను మొదటి నుండి ఎరిగి, ఈ పుస్తకం మొదటిలో పరిచయం చేయబడిన మిషనరీ లేడీ అయిన హైనీ అమ్మగారు హుటాహుటిన ఆసుపత్రికి వచ్చారు. ఫిన్లాండ్ లో వృత్తి రీత్యా నర్స్ అయిన ఆమె మా నాన్న పరిస్థితిని చూసి మా నాన్నను చెన్నై కు తరలించటమే మంచిది అని సలహా ఇచ్చారు.

మానాన్న కదలలేని పరిస్థితిలో ఉండటం తో టాక్సీ లో విజయవాడ వరకూ తీసుకొని వెళ్లి అక్కడ నుండి ట్రైన్ లో చెన్నై

కు తీసుకొని వెళ్లాలని మా ప్రణాళిక. ప్రస్తుతం వున్నా బందరు గవర్నమెంట్ ఆసుపత్రి లో పూర్తి చెయ్యాల్సిన పనులన్నీ పూర్తి చేసుకొని టాక్సీ వెనుక సీట్ లో ఆయనను పరుండ బెట్టక ముందు మా నాన్న ప్రార్ధన ఇలా సాగింది, “దేవా మేము వేరొక ప్రదేశానికి చికిత్స నిమ్మితం వెళ్తుండగా మాకు సహాయం చెయ్యండి. మాపై కృప చూపి మాకు కావలసిన వివేచన అనుగ్రహించండి. ఇక్కడ నాకు సహాయపడిన ప్రతిఒక్క డాక్టర్, నర్స్, ఇంకా ఇతరులందరినీ దీవించండి. నాతో వున్నా సహరోగులను ముట్టి త్వరలో స్వస్థ పరచండి. నీ చిత్తమైతే వీరందరినీ మరోసారి చూసే భాగ్యం దయచేయండి. మీ ప్రశస్త నామం లో వేడుకుంటున్నాను, ఆమెన్.”

చుట్టూ నిలబడి ఆయన ప్రార్ధన వింటున్న మాకందరికీ అది ప్రత్యేకమైన, ఆత్మ నడిపించిన ప్రార్ధన గా అనిపించింది.

బందరు ఆసుపత్రి నుండి నేరుగా టాక్సీ లో ఇంటికి వెళ్లిన మా నాన్నను ఆయన అప్పుడున్న పరిస్థితి దృష్ట్యా మా ఇంటిలోనికైనా, గుడిలోనికైనా తీసుకొని వెళ్లేందుకు వీలు పడలేదు. దీనితో టాక్సీ వెనుక సీట్ లోనే పడుకొని వున్నా ఆయనను చూసేందుకు అక్కడ కూడిన జనం కన్నీళ్లతో గుమి కూడారు.

ఇలా ప్రతి ఒక్కరూ మా నాన్న ను చూస్తున్న సమయం లో, మా చిన్న తమ్ముడైన ఇమ్మానుయేలు ను పిలవమని కోరిన అయన, వాడితో "నాయనా, నేను తిరిగి రాగలిగితే సరి, లేకపోతే నిన్ను నేను తప్పని సరిగా పరలోకం లో చూడాలి!" అని అనగానే, వాడు కండ్ల వెంట నీరు పెట్టుకొని మా తండ్రిని చాలా సార్లు గాయపరిచినందుకు క్షమాపణ కోరాడు. ఆయన వాడితో ఈ విధం గా చెప్పటానికి కారణం - వాడు ఇంకా అప్పటికి సరైన గ్రహింపు లోనికి, రక్షణ అనుభవం లోనికి రాలేదు అనే బాధ ఆయన లో వుండింది. దీనికి తోడు ఒక వేళ ఆయనకు తన ఆత్మలో ఇక ఆయన తన చిన్న కుమారునితో మాట్లాడబోయే అవకాశాలు అతి తక్కువగా వున్నాయి అని గ్రహించి ఉండవచ్చు.

టాక్సీ లో మా అమ్మ, పెద్దతమ్ముడు వెస్లీ ఇంకా మా అంకుల్ డేనియల్ గారు మా నాన్నతో వెంట వెళ్లారు. మా నాన్న తమ్ముళ్లయిన డేవిడ్ బాబాయి, విమల్ రావు బాబాయి కూడా వేరుగా వెంట వచ్చారు. ఇక మా నాన్న ను చెన్నైకు తీసుకు వెళ్లేందుకు సీట్లు దొరకటం, ఆయనను ట్రైన్ లోనికి తీసుకొని

వెళ్ళి బెర్త్ పై పడుకోబెట్టటం - చాలా శ్రమతో కూడిన పని అయినా దేవుని కృప వల్ల సాధ్యపడింది.

ట్రైన్ లో వెళ్తున్న రాత్రి సమయం లో మా నాన్న, మా అమ్మను చూసి - ఆమె  ప్రార్థించేటప్పుడు ఆమె కు ప్రభువు ఏమైనా విషయాలు తెలియ జేశారా అని అడిగారు.  మా అమ్మకు జరుగబోయే విషయాలు కొంత అర్థం అయినప్పటికీ, అప్పటి ఆయన పరిస్థితి ని గుర్తించి దానికి సంబంధించిన విషయాలు ఏవీ మా అమ్మ ఆయనతో పంచుకునేందుకు సాహసించలేదు. ఆ సమయం లో మా నాన్న, మా అమ్మకు కొన్ని సలహాలు ఇవ్వటం జరిగింది, వాటిలో కొన్ని: 1. కొన్ని కష్టమైన పరిస్థితులు ఎదుర్కొనవలసిన పరిస్థితి ఎదురైనప్పటికీ దేవుని పిల్లల సహవాసం లో, సంఘం లో కొనసాగు. 2. ఒకవేళ నన్ను తన సన్నిధిలోనికి ప్రభువు పిలుచుకుంటే, నా శరీరాన్ని బందరు తెచ్చి సమాధి చెయ్యండి. 3. ప్రభువు సేవ లో స్థిరంగా కొనసాగుతూ భవిష్యత్ లో జరుగబోయే అన్ని విషయాలలో ప్రభువు పై ఆధారపడండి.

చెన్నై లోని ప్రైవేట్ హాస్పిటల్ కు వెళ్లిన వెంటనే డాక్టర్ మా నాన్నను పరీక్షించి వాడవలసిన మందుల జాబితా రాసి, వాటిని

వాడటం ప్రారంభించారు. పదిదినాలు మందులు వాడుతూ తరచూ వైద్య పరీక్షలు చేస్తున్నప్పటికీ ఆయన ఆరోగ్యం మెరుగు పడలేదు. చివరిగా ఆయనకు ఒక అరుదైన వైద్య పరిస్థితి ఉన్నట్లు గుర్తించి, దానికి అవసరమైన ఒక మందు అమెరికా నుండి తీసుకురావటానికి వీలవుతుందా అని డాక్టర్ మమ్మల్ని అడిగారు; అది సాధ్యం కాలేదు.

నేను, ఇమ్మానుయేలు బందరు నుండి ప్రయాణించి క్రిస్మస్ రోజు చెన్నై చేరుకున్నాము. ఆ రోజు మా అమ్మ పిల్లలు అంతా ఆయన పక్కన ఉండటం ఆయనకు కొంత ఊరట నిచ్చింది. మా తల్లితండ్రుల సేవ లో విద్యార్థి గా రక్షణ పొందిన ఏసురత్నం గారు, మరో మహిళ ఆయనను చూసేందుకు కొద్ది రోజుల క్రితమే చెన్నై చేరారు.

1982 క్రిస్మస్ రోజు ముగిసింది. మర్నాడు ఉదయం 10 గంటలకు మా నాన్నకు, ఆయనకు తెలియకుండానే ఆయన పరలోకం లో ఉన్న అనుభూతిని పొందుతున్నట్లు చాల సంతోషం తో కండ్లు మూసుకొని ఆయన వింటున్న బ్యాండ్ శబ్దాలకు అనుస్వరం కలుపుతూ ఆనందించటం ప్రారంభించారు. పక్కనే వున్నా మా అంకుల్ డేనియల్ గారు, తమ్ముళ్లిద్దరూ అది

చూస్తూ ఆయన ఏమి చూస్తున్నారు? ఏమి వింటున్నారు? అని ఆశ్చర్య పడుతున్నారు. ఒక ప్రక్క అనేక ట్యూబ్ లకు ఇతర వైధ్య పరికరాలకు ఆయన అను సంధానించబడి ఉన్నప్పటికీ ఆయన ఇలా సంతోషించటం వారికి కొంత కంగారు కూడా కలిగించింది. ఇది దాదాపు నలభై నిముషాలు కొనసాగింది.

ఆ సమయం లో రూమ్ లోనికి ప్రవేశించిన ఒక నర్స్ చాల కంగారు పడి, మిస్టర్ ఏబెల్ అని చాల సార్లు పిలిచినా, ఆయన తన పంథా లోనే ఆనందిస్తూ, ఆమెతో "అమ్మా, నేను పరలోక మీటింగ్ లో వున్నాను, నన్ను ఆటంకపరచ వద్దు " అని అలానే కొనసాగించారు. ఆమె బయటకు వెళ్ళి డ్యూటీ డాక్టర్ ను తీసుకొని వచ్చినప్పుడు, మా నాన్న ఆయనకు కూడా అదే సమాధానం చెప్పినప్పుడు వారికి ఏమి చెయ్యాలో తెలియక కొద్ది నిముషాల తరువాత ఇద్దరూ బయటకు వెళ్లారు. మా నాన్న దాదాపు ఒక గంట తర్వాత అంతకు ముందు కొంత సేపునుండి ఆయన ఆనందిస్తున్నా సమయం ముగిసిన తర్వాత నెమ్మదిగా కళ్ళు తెరిచారు.

వెస్లీ నెమ్మది గా పక్కకు వెళ్లి "నాన్నా, ఏమవుతుంది మీకు" అని అడిగితే, ఆయన "నేను పరలోక దర్శనం లో వున్నాను"

అన్నారు! గత గంట నుండి అక్కడ ఆయన ఏమి చేస్తున్నారో వెస్లీ ఆయనతో చెప్పినప్పుడు, “ఔనా? నేను ఆయనతో మాట్లాడుతున్నాను కదా, ఇదంతా ఎప్పుడు జరుగుతుంది?” అని ప్రశ్నించారు. ఆయన ఎవరితో ఏమి మాట్లాడుతున్నారో వీరికి అర్థం కాలేదు కానీ అక్కడ జరిగినదంతా చాలా అరుదుగా జరిగే విషయం అని మాత్రం వీరంతా గ్రహించారు.

డిసెంబెర్ 26 వ తేదీ ఒక ఆదివారం! ప్రతిరోజూ ఆయన ఎలా వున్నారో చూసేందుకు వచ్చే స్నేహితులు, చర్చ్ మెంబెర్స్, బంధువులు అంతా చీకటి పడిన తర్వాత వెళ్లిపోయారు. రాత్రి సమయంలో ఆయన పరిస్థితి కొంత ఆందోళన గా ఉండటం తో, ఈ మందులు వెంటనే తీసుకురండి అని డాక్టర్ రాసిచ్చిన చీటీ తీసుకొని, ఆదివారం కావటం తో దగ్గరలోని మందుల షాప్ లు అన్నీ కట్టేసి ఉండటం తో - వెస్లీ, మాకు బంధువై ఆ సమయం లో చెన్నై లోనే బైబిల్ ట్రైనింగ్ పొందుతున్న డేవిడ్ రాజ్ తో కలసి నుంగంబాక్కం లోని స్టార్ హోటల్స్ లో ఏవైనా మెడికల్ షాప్ లు తెరచి ఉండొచ్చేమో అని తొండియార్ పేట నుండి నుంగంబాక్కం వరకూ అర్ధరాత్రి సైకిల్ పై వెళ్ళారు.

వారు సైకిల్ పై వెళ్లిన తర్వాత మా నాన్న ఆరోగ్యం క్షీణిస్తూ ఉండటం తో ఇమ్మానుయేలు డాక్టర్ జయసింగ్ (ఆ రోజుల్లో చెన్నై లో ఒక ప్రఖ్యాత సర్జన్ గారు, మా నాన్న గారి స్నేహితులు) గారి ఇంటికి వెళ్లి ఆయన సహాయం కోసం పిలిసినప్పుడు, ఆయన ఆ సమయం లో మా నాన్న కోసం ప్రార్ధన చేస్తూ ఉన్నారట! వెంటనే అయన, ఇమ్మానుయేలు కలసి మా నాన్న వున్నా ఆసుపత్రికి వచ్చారు. ఆయన వచ్చిన తర్వాత ఆయనతో చివరిసారిగా మాట్లాడిన మా నాన్న ఒక ప్రక్క దేవుని సన్నిధిలోనికి వెళ్లిపోతున్నారు అనే సంతోషం, మరోప్రక్క ఎటూ స్థిరపడని పిల్లలూ, ఎన్నో బాధ్యతలు భరించాల్సి వున్నా మా అమ్మ ను జ్ఞాపకం చేసుకుంటూ అనుభవిస్తున్న వేదన తో ఆయన చివరి ఘడియ లు గడిచాయి. ఆ దినాలలో మా సంఘ నాయకులు గా వున్నా జాషువా డేనియల్ గారిని మా నాన్న పిలవమని అడిగారు. అలాగే ఆయన కోసం “దూత పాట పాడుడీ.... “ అని పాడుతూ వేచి చూస్తున్నప్రజలకు తాను ప్రసంగించవలసి వుంది అని చెప్పారు. ఇలా మాట్లాడుతూ డిసెంబర్ 27, 1982 తెల్లవారు ఝామున ప్రభువు సన్నిధి లోనికి మా నాన్న వెళ్లిపోయారు.

అంబులెన్స్ లో ఉదయం 8:30 ప్రాంతంలో చెన్నై లో బయలుదేరిన మా నాన్న దేహము రాత్రి 11 గంటల ప్రాంతం లో బందరు చేరింది. అప్పటికే ఏంతో సేపటి నుండి వేచివున్నా అక్కడి సంఘ సభ్యులు, స్నేహితులు, ఇరుగుపొరుగు వారంతా ఒక్క సారిగా ఉద్వేగానికి లోనయ్యారు. రాత్రి గడచింది.

తెల్లవారిన తర్వాత తొమ్మిది గంటల కు సమాధి కార్యక్రమం జరిగే ఏర్పాట్లు అన్ని పూర్తి అయినాయి. ఉదయం సమాధికి హాజరయ్యే అందరితో మా చర్చ్ కాంపౌండ్ కిక్కిరిసింది. అక్కడ జరగాల్సిన విషయాలు అన్నీ ముగిసినాక ఊరేగింపుగా పాటలు పాడుతూ మా నాన్న దేహం వున్న బరియల్ గ్రౌండ్ బండి ముందుకు కదిలింది. సమాధి జరిగే సెయింట్ మేరీస్ చర్చ్ పూర్తిగా మనుష్యులతో కిక్కిరిసింది. మా నాన్నకు స్నేహితులు మరియు సహ సేవకులైన బ్రదర్ జీ. బీ. సాల్మన్ గారు - అక్కడ వున్నా ప్రజలంతా తమ జీవిత గురిని, గమ్యాన్ని సరైన విధం గా స్థిర పరచుకునే లా ప్రతి ఒక్కరినీ ఆలోచింపచేసే బలమైన వర్తమానాన్ని సెయింట్ మేరీస్ చర్చ్ లో ఇచ్చారు. చర్చ్ లో జరగాల్సిన ఇతర లాంఛనాలు అన్నీ పూర్తి అయ్యాక, బరియల్ చెయ్యాల్సిన స్థానానికి అంతా చేరాము.

ఇదే సమయం లో ప్రభువు పరిచర్యలో మా నాన్న చేస్తున్న సేవను అభిమానించిన మిస్సెస్. నికోదేము అమ్మగారు బందరు లో వుండి మా నాన్న బరియల్ కు హాజరు కావటం మాకు కొంత ఊరట నిచ్చింది. ఆమె బందరు లో జరిగే సేవ నిమిత్తం, ఆ పట్టణము లో వున్నా అనేకమంది ఆమె బంధువర్గం కొరకు బహు భారము కలిగిన వారు. బరియల్ పూర్తి అయ్యింది, భారమైన హృదయాలతో వచ్చిన వారంతా తిరిగి వెళ్లిపోతున్నారు.

ఇక మేము కూడా వెళ్ళిపోటానికి సిద్ధపడుతున్న సమయం లో ఎవరో మమ్మల్ని దిగబెట్టేందుకు కారు ఎక్కమని అడిగారు; ఎక్కికూర్చున్నాం. ఇంతలో గట్టిగా ఏడుపు వినిపించటం తో అటు చూస్తే మా నాన్న ను సమాధి చేసిన స్థలం వద్ద, ఆయనను రక్షణ అనుభవం లోనికి నడిపించిన ఆయన చిన్నాన్న, చిన్నమ్మ కనిపించారు.

ఆ రోజు సాయంత్రమే ఆయనతో కలసి పనిచేసిన అనేక మంది సేవకులు బందరు లో వున్నా సమయం లోనే ఒక స్మారక కూటము ఏర్పాటు చేశారు. బ్రదర్. సాల్మన్ గారు, బ్రదర్.

దేవసహాయం గారు ఇంకెతోమంది సేవకులు, మా తల్లితండ్రుల సేవలో మేలు పొందిన ఇతరులు మాట్లాడారు.

## 15.3. మా అవసరత లో సాటిలేని సహాయం

మా నాన్న ను చూస్తేనే కొండంత అండగా భావించే మమ్మల్ని ఆయన మరణానంతరం ఏదో తెలియని వెలితి ఆవరించింది. అనేక వారాల పాటు మాతోనే వుంటూ మా ఇందిర ఆంటీ, ఆమె కుటుంబం అన్ని విషయాలలో తోడు నీడగా వుండి ఈ వెలితిని భర్తీ చేశారు. వారి సహాయ సహకారాలు ఆ సమయం లో లేకపోతే మేము ఆ విధంగా కోలుకొని వుండేవారిమి కాదు. ఇక మా అంకుల్ డేనియల్ గారు (మా ఇందిరా ఆంటీ భర్త గారు) చెన్నై లో వున్నా సమయం లో అంతా మా నాన్న దగ్గరే వుండి ఇంకెవ్వరూ సహాయం లేకపోయినా రాత్రి, పగలు అనే తేడాలేకుండా ఆయన ను చూచుకునే వారు. వారు చేసిన సహాయం, సేవలకు మేమెల్లప్పుడు వారికి ఋణస్థులమే! ఇదే సమయం లో ఆంటీ రాజేంద్రం, అంకుల్ విమల్ రావు గారు హాస్పిటల్, మందులు, ఇతర ఖర్చులన్నీ భరించిన తర్వాత మమ్మల్ని తరచు గా దర్శిస్తూ మా అవసరతలు, అక్కరలు

అడిగి తెలుసుకొని ఎప్పటికప్పుడు తీర్చుతూ వుండేవారు. వీరు చేసిన సహాయం, ఆదరణ లకు సహితం మేము సదా ఋణస్థులము!

ఆ సమయం లో కొన్ని వారాల పాటు మా తల్లితండ్రుల సేవలో మేలు పొందిన కొంతమంది యవ్వనస్థులు, మా తమ్ముళ్ళతో కలసి పడుకునేందుకు చర్చ్ కి వస్తూ వుండేవారు. వారు రాత్రి సమయంలోనూ, తెల్లవారు ఝామునసే చేసే ప్రార్థనలు మమ్మల్ని అంతా మానసికంగానూ, ఆత్మీయం గానూ ఎంతో పైకి ఎత్తిపట్టుకున్నాయి. వీరికి మా హృదయపూర్వక వందనాలు.

# 16

## పద్మా ఎబెల్ గారి సేవ

మా నాన్న ప్రభువు సన్నిధికి చేరటం తో మా కుటుంబం లో ప్రతి ఒక్కరి జీవితం లో నూతన శకం ప్రారంభం అయ్యింది - మరి ముఖ్యం గా మా అమ్మ జీవితం లో! మా అమ్మమ్మ ఏకైక ముద్దుబిడ్డగా పెంచబడిన ఈమె జీవితం లో - ఆమె వివాహానికి ముందు కానీ, తర్వాత కానీ కేవలం తనంతట తానే కఠిన సమస్యలను ఎదుర్కొని, కీలకమైన నిర్ణయాలు తీసుకొనవలసిన అవసరం ఆమెకు రాలేదు. ఇక ఇప్పుడు అదంతా మారిపోయింది. ఇప్పటి నుండి ఆమె ప్రభువు పై మరింత విశ్వాసం తో ఆధారపడుతూ ముందుకు వెళ్ళటం - ఆమె పట్ల దేవుని చిత్తం గా గ్రహించిన ఆమె, తన ఆయుధం గా ప్రార్థన పై

మాత్రమే ఆధారపడ్డారు. తన పక్షం గా ప్రభువు తన సమస్యలన్నీ తీర్చి దరి చేర్చుతాడు అనే పూర్తివిశ్వాసం తో ముందుకు కదలటం ప్రారంభించారు. ఆమె కు వివాహమై,

మేము బాగా చిన్న పిల్లలు గా వుండి న దినాలలో సెకండరీ గ్రేడ్ టీచర్ ట్రైనింగ్ చదివే విద్యార్థులకు బందరు లేడీ ఆంప్తిల్ స్కూల్ లో ప్రతి వారం లో ఒక రోజు కూటము నిర్వహించేవారు. ఇక గవర్నమెంట్ లేడీస్ హాస్టల్ లో వుండే కాలేజ్ విద్యార్థినులకు తరచుగా ప్రార్థన కూటాలు నిర్వహించటం, ఇంటి వద్ద తాను ప్రభువు లోనికి నడిపించిన కాలేజ్ పిల్లల తో కలసి ప్రతిరోజు ప్రార్థించటం, కొన్ని సార్లు బూసి ఇజ్రాయెల్ గారి ఇంటిలో జరిగే చిన్న చిన్న ప్రార్థన కూటాల కు హాజరై అక్కడి స్త్రీ లతో మాట్లాడటం - ఆమె తరచూ చేసే సువార్త పనిలో భాగాలు గా ఉండేవి. ఈ విధం గా ఆమె ద్వారా ప్రభువు యొద్దకు నడిపించబడిన ఆ నాటి యవ్వన బాలికలైన హనుమాన్ జంక్షన్ లోని విజయ పాల్ గారు, ప్రభువు సన్నిధిలోనికి వెళ్ళిపోయిన రాజమణి అమృతకుమార్ గారు, కేవలం మంచి విశ్వాసులు గా తయారవ్వటం మాత్రమే కాకుండా, ప్రభువు సన్నిధి లో సేవా భారం కలిగి న స్త్రీ లు గా మారారు.

మా నాన్న ప్రభువు సన్నిధి కి చేరాక, మా అమ్మ ముందు ఎదుర్కొన వలసిన సవాళ్లు ఎన్నో వుండినాయి. నా వివాహం చెయ్యటం ఆమె ముందున్న ప్రధాన సమస్య! ఆ రోజుల్లో నేను

పార్ట్ టైం లెక్చరర్ గా పని చేసిన నెలలకు మాత్రం, నెలకు ఐదు వందల రూపాయల చొప్పున జీతం వచ్చేది; అంటే వేసవి సెలవులలో జీతం ఉండదు! ఇక వెస్లీ కి ఇంకా కొంత కోర్స్ వర్క్ పూర్తి కావలసి వుండింది, ఆ సమయం లో ఇమ్మానుయేలు ఇంకా డిగ్రీ చదువు తున్నాడు! అంటే కుటుంబానికి ఫైనాన్సియల్ ప్రాబ్లెమ్ వుండింది. ఇక మేము అప్పటి వరకూ వుంటున్న ఇల్లు చర్చ్ పేరున ఉండటం వల్ల, ఒకవేళ మేము ఆ ఇల్లు వెంటనే ఖాళీ చేసి బయటకు వెళ్లాల్సి వస్తే, అద్దె ఇల్లు తీసుకున్నా దాని భారం భరించటం ఎలా? అనేది మరో సమస్య!

బందరు సంఘం లో సువార్త సేవలో మా నాన్న లేని వెలితిని తీర్చేందుకు వారం వారం, చెన్నై లోని ముఖ్య కేంద్రం వారు ఎవరో ఒకరు బోధకులను ప్రతి ఆదివారం బోధించేందుకు 1983 నుండి, 1984 లేక 85 వరకూ పంపుతూ వుండే వారు. 1984 లో దైవసేవకులు జాషువా డేనియల్ గారు బందరు లో కొద్ది రోజుల కూటాలు ఏర్పాటు చేసి మా సంఘాన్ని దర్శించటం జరిగింది.

సమయం చకచకా గడిచిపోయి అప్పటికే మా నాన్న ప్రభువు సన్నిధికి వెళ్లి మూడు సంవత్సరాలు పూర్తి అయ్యింది. దానితో

నా వివాహం ఇంకా సెటిల్ కాని పరిస్థితి తో మా అమ్మ ఆ రోజుల్లో (1986 వేసవి కాలం) రాత్రి సమయం లో ఆరు బయట పడుకున్నప్పుడు, ప్రతి రాత్రి ప్రభువు సన్నిధి లో కన్నీటితో, పెనుగులాడుతూ ప్రభువు సన్నిధి లో ప్రార్థించటము మేము చూసేవారిమి.

ఇలా దినాలు గడుస్తున్నప్పుడు ఒకరోజు తెల్లవారు ఝామున ఆమె నిద్ర లేచి ఏంతో కన్నీటి తో ప్రభువు సన్నిధి లో గోజాడుతూ నా వివాహ విషయం ప్రార్థించటం గమనించాము. ఇక సూర్యుడు రాబోతూ, ఇంకా పూర్తిగా వెలుగు కాకముందు, దగ్గరలో నున్నా ఒక చెట్టుపై ఒక పిట్ట నిలిచి కూయటం ప్రారంభించి, దాదాపు మా అమ్మ ప్రార్థన పూర్తి చేసే వరకూ ఆలా కూస్తూనే వుంది. . ఆ కూత వింటుంటే - "ఏంటది? ఏంటది?" అని అన్నట్లు గా వినిపిస్తున్నది. ఇక నిద్ర లేవబోతున్న మాకు మా అమ్మ చేసే ప్రార్థన, పిట్ట కూత రెండు వినిపిస్తున్నాయి. ఆమె ప్రార్థన పూర్తి చేసినప్పుడు వెస్లీ నిద్రలేవటం తో, మా అమ్మ "చెట్టుపై పిట్ట చాలాసేపు కుయ్యటం గమనించావా?" అని అడిగినప్పుడు "గమనించాను" అని సమాధానం ఇచ్చాడు.

అప్పుడు ఆమె “ఆ కూత ఎలా అన్నట్లు వుంది నీకు?” అని అడిగినప్పుడు, వెస్లీ ఇంకా సమాధానం ఇవ్వబోతుండగా, ఆమె “నాకు అది కూసే ‘ఏంటది? ఏంటది?’ అనే కూత విన్నప్పుడు - ప్రభువు నన్ను “ఎందుకంత బాధగా, భారం గా వున్నావు?””అని అడుగుతున్నట్లు వుంది అని అన్నారు. ఇక అప్పటి నుండి చుట్టూ వున్నా పరిస్థితులు ఏమీ పెద్దగా మారనప్పటికీ, ఆమె సొంత వైఖరి లో చాలా మార్పు ఆ నాటి నుండి కలిగింది.

ఇలాటి కొంత అనిశ్చితి, అయోమయ పరిస్థితుల అనంతరం జాషువా డేనియల్ గారు 1986 జులై నెలలో బందరు లో కూటాలు చేసి ముగించిన తర్వాత రోజు నా వివాహం, దైవ సేవకులైన విట్సన్ పాల్ గారిచే, జాన్ క్రిసోస్టమ్ గారితో జరిపించ బడింది. ఆ సమయం లో మా నాన్న గారి చిన్నాన్న అయిన గంటా జాన్ గారు వచ్చి నా చేతిని క్రిసోస్టమ్ గారి చేతికి చాల సంతోషం తో అప్పగించారు.

క్రిసోస్టమ్ గారు బందరు లో మా నాన్న వున్నా కాలం లోనే కొంత కాలం వుండి మా చర్చ్ ఆరాధన లకు హాజరౌతూ వుండినప్పటికీ వివాహం అయ్యేంత వరకూ ఆయనకున్న కొన్ని అసాధారణ మైన మంచి లక్షణాల గురించి మాకు అవగాహన

లేదు. మా కుటుంబం లో అన్ని విషయాలలో ఒకరిగా వుంటూ మాతో కలసి సాగే వ్యక్తిని మా కుటుంబము లోనికి తెచ్చిన ప్రభువును బహుగా స్తుతించాము. దీనితో మా అమ్మ పై ఒత్తిడి కలిగించే పెద్ద సమస్యను దేవుడు ఆయన ఏర్పాటు చేసిన సమయం, ఆయన నిర్ణయించిన విధం గా తీర్చటం జరిగింది.

ఈ మధ్య కాలం లో ఇమ్మానుయేలు బీ ఏ పూర్తి చేసి చదువు కొనసాగించేందుకు మరో వూరు వెళ్లి 1985 లో తిరిగి వచ్చాడు. అక్కడ వున్నా సమయం లో దేవుడు ఆశ్చర్య రీతిగా అవసరాలు తీర్చాడు. ఇక 1984 నుండి 87 వరకూ రెండు చోట్ల పనిచేసిన వెస్లీ 1988 లో గవర్నమెంట్ లో వుద్యోగం రావటం తో మరో వూరు వెళ్ళాడు.

ఈ మధ్య కాలం లో మాకు ఇద్దరు మగ పిల్లలు కలిగారు.

ఇక వెస్లీ వివాహ సమయం వచ్చినప్పుడు దేవుని సేవకులతో సంబంధం కలిగి వుండి వారి ప్రార్థనలు, సలహాల కొఱకు వేచి చూసిన తాను 1992 లో వివాహం చేసుకొనిన తర్వాత, 93 లో వారి కుటుంబం లో కుమార్తె పుట్టుక తో ఆశీర్వదింప బడ్డారు.

నా వివాహ విషయం లోనూ, వెస్లీ వివాహ వివాహ విషయం లోనూ, అంతిమ  నిర్ణయాలు అన్నీ  వివాహ తేదీ లకు ముందు, చివరి కొద్ది వారాల వ్యవధిలో నిర్ణయించబడి, సమస్తం సమకూడి మేలుకరం గా జరిగాయి. ఈ విషయం లో మేము ప్రభువు యొక్క ప్రత్యేకమైన సహాయాన్ని చూడగలిగాము.

ఈ సమయం లో మా అమ్మ సేవలో చురుకు  గా పని చేస్తూ వుండేవారు. కొన్ని సార్లు మా చర్చ్ సాయంత్ర కూటాలలో ప్రసంగించే ఆమె, తరచుగా పట్టణం లోని అనేక ప్రాంతాలలో చిన్న చిన్న స్త్రీల గ్రూప్ మీటింగ్ లలో పరిచర్య చేస్తూ వుండేవారు. మా చర్చ్ లో అనేక 'ఒక దిన స్త్రీల కుటాలు' ఆమె నిర్వహించారు. 1983 లో బందరు లోని  గృహాల ను దర్శించి అక్కడి స్త్రీల మధ్య చేసే ఆమె సేవ, 1990s మధ్య కాలం లో మోకాలి నొప్పితో బాధపడుతూ ఉండటం వల్ల ఆ పరిచర్య స్థానం లో ఇంటివద్దనే, అవసరం వున్నా వారికి  కౌన్సెలింగ్ ఇవ్వటం, అప్పుడప్పుడు చర్చ్ లో బోధించటంవంటివాటికి పరిమితం చేశారు. ఆమె గృహ దర్శనం ద్వారా చేసిన పరిచర్య ద్వారా అనేక మంది కొత్త వారు సువార్తకు పరిచయం చేయబడ్డారు; కొంతమంది రక్షణ అనుభవం లోనికి వచ్చారు.  మా నాన్న

ప్రభువు సన్నిధి లోనికి వెళ్లిన అనంతరం ఆయన అంతకు మునుపు వరకూ చేసే చర్చ్ అకౌంట్స్ అన్నీ నిర్వహించటాన్ని, ఇక ఆమె ప్రభువు సన్నిధి లోనికి వెళ్లబోయే సమయానికి, రెండు మూడు సంవత్సరాల ముందు వరకూ కొనసాగించారు. ఇంతేకాక, ఆమె తన సొంత పిల్లల వివాహాల విషయం లో పూచీ వహిస్తూనే చర్చ్ కి వచ్చే అనేక మంది పేదవారి వివాహాల విషయం లోనూ పూచీ వహించారు.

వయస్సు లో పెద్దవారు, ఎదిగిన పిల్లలు గల కుటుంబం లోని తల్లితండ్రులు తమ క్లిష్టమైన సమస్యల నిమిత్తం, ప్రార్ధనల నిమిత్తం ఆమె వద్దకు వస్తూ వుండేవారు. విశేషానుభవం గల సేవకురాలిగా ఆమె వాటి విషయం లో ధైర్యం తోనూ, నిబ్బరత తోనూ వ్యవహరించేవారు. హృదయాంతరంగాన్ని చూసే దేవునిని మాత్రమే మహిమ పరచాలి అనే ఆమె గురి చివరివరకూ ఆమెను దేవునికోసం ప్రయాసపడి జీవించేలా చేసింది.

కొందరు తమ వ్యక్తిగత విషయాలు ఆమెతో పంచుకొని ప్రార్ధన కోసం అభ్యర్థించేవారు. అయితే ఈ విషయాలు అన్నీ ఇతరుల వద్ద అనాలోచితంగా పంచుకోటం ఆమె ఎన్నడూ చేసేవారు కారు.

ఇదేవిధం గా ఇంకొందరు ఇతర విశ్వాసులపై ఫిర్యాదులతో వస్తూ వుండేవారు; అయితే ఆమె వున్నా సమస్యలను ఎప్పుడూ పెద్దవిగా చేసే వారు కారు. ఈ విధం గా జ్ఞాన యుక్తం గా నడుచుకోవటం వల్ల విశ్వాసుల మధ్య అప్పుడప్పుడు తలెత్తే వైశమ్యాలను శాంతియుతం గా సర్ది సరిచెయ్యటానికి దేవుడు ఆమెకు వివేచన అనుగ్రహించాడు.

కొద్ధి కాలం తర్వాత ఇమ్మానుయేల్ వివాహం జరిగింది; ఇద్దరు కోడళ్ళు ఇంటికి మరింత సహాయకరం గా వున్నారు. ఇమ్మానుయేల్, తన భార్య అయిన నిర్మల కు జన్మించిన రొనాల్డ్ తో మా అమ్మ తన వృద్దాప్యం లో సమయం గడుపుతూ ఆనందించే వారు.



చిత్రం *18:* ఆమె చివరి దినాలలో తన చిన్న మనుమడి తో పద్మా ఏబెల్ గారు

# 17

# పద్మా ఎబెల్ గారి ప్రభువు పిలుపు

## 17.1 పెస్లీ కి చివరి వీడుకోలు

జూన్ 2004 లో మా అమ్మ వీల్ చైర్ కు పరిమితం అయిపోయి ఆమెతో అనునిత్యం (రాత్రి, పగలూ) ఎవరో ఒకరు వుండి చూసుకొనవలసిన అవసరం ఉండటం చూసిన పెస్లీ కి బాధ అనిపించింది. ఈ విషయం లో అప్పుడప్పుడూ అనేక మంది ఆమెకు సహాయ పడినప్పటికీ, సుమతీ లాల్ దాదాపు తన సమయమంతా మా అమ్మకు సేవ చేసేపని నిమిత్తమే వెచ్చించి విశేషమైన తన సేవలు అందించింది. ఆమెకు మేమంతా సర్వదా కృతజ్ఞులం.

రోజులు గడిచాయి, ఇక దూరం నుండి ఇంటికి వచ్చిన పెస్లీ తిరిగి వెళ్లిపోవాల్సిన ఘడియ రానే వచ్చింది. అందరికీ వీడ్కోలు చెప్పిన పెస్లీ మా అమ్మకు కూడా చెప్పి ఆమెను

కౌగలించుకున్నాడు. వెస్లీ కళ్ళలోనికి నేరుగా చూస్తూ ఆమె కన్నీళ్ల పర్యంతం అయ్యారు. ఈ విధం గా ఒకరినొకరు కౌగలించుకొని కన్నీళ్లు విడిచిన మా అమ్మ, వెస్లీ ప్రయాణం కోసం (తన చివరి సారి) ప్రార్థించి ముగించారు. ఇక వెళ్లేందుకు వెనుకకు తిరిగి రెండు అడుగులు వేసిన వెస్లీ కి మా అమ్మ ఏదో చెప్తున్నట్లు అనిపించి వెనుకకు తిరిగి, "అమ్మా, ఏమంటున్నారు?" అని అడిగాడు. "నేను మరలా నిన్ను చూడగలనా?" అంటున్నాను అని ఆమె చెప్పారు. ఆ మాట విన్న వెస్లీ కి తన భావోద్వేగాలను ఆపుకోటం కష్టంగా అనిపించింది. అయితే, వెళ్ళక తప్పదు కదా!!

## 17.2 తిరిగి మనమంతా కలుసుకునే వరకూ....

అక్టోబరు 2004 లో ఆమెకు ఛాతీ లో నొప్పి రావటం తో ఆమెను అప్పుడప్పుడూ చూసే హోమియో వైద్యుని సలహా మేరకు బందరు లోని ఒక పబ్లిక్ నర్సింగ్ హోమ్ లో చేర్పించి ఆక్సిజెన్ ఇవ్వటం ప్రారంభించారు. అయితే అక్కడి డాక్టర్ సలహా మేరకు వెనువెంటనే ఆమెను గవర్నమెంట్ హాస్పిటల్ కు తరలించిన అనంతరం ఆమె ఒక అరగంట లో కొంత కోలుకున్నారు.

విషయాలు జరుగుతున్న విధానం చూస్తున్న మాకు, ఆమె పరలోక ద్వారం వరకూ వెళ్లి తిరిగి మాకోసం తిరిగి వచ్చారా? అని అనిపించింది. ఒక వారం రోజులు చికిత్స అందించాల్సి వచ్చింది.. తీవ్రమైన అపాయం లో వున్నా ఆమె అక్కడ నెమ్మది గా కోలుకొనటం తో - ఆమె, మేమూ వేగం గా జరుగుతున్నా పరిణామాలకు అన్ని విధాలా సిద్ధపడేందుకు దేవుడు మమ్ము్మను తన మార్గాల ద్వారా తీసుకువెళ్తున్నట్లు గ్రహించాం.

డిశ్చార్జ్ తర్వాత ఇంటికి వచ్చిన అనంతరం తరచుగా ఆమెకు ఛాతీ నొప్పి వస్తుండటం తో విజయవాడ లోని ఒక నెఫ్రాలజీ క్లినిక్ లో చేర్పించాము. ఆమెకు ఊపిరితిత్తులలో సమస్య ఉండటం తో ఆమెను వెంటిలేటర్ పై ఉంచకుండా ఏదో ప్రత్యేకమైన చికిత్స చేశారు. ఈ చికిత్స పొందుతున్న సమయం లో మేము చూడలేని ఎవరో వ్యక్తులతో ఆమె మాట్లాడుతుండేవారు, ఈ క్రమంలో "....ఇంకొంత సమయం వేచి ఉండాలి..." అనే మాటలు ఆమె తరచూ అంటూ వుండేవారు. ఆ సమయం లో విజయవాడ లోని ఎల్ ఈ ఎఫ్ సంఘ సభ్యులు చాలా మంది ఆమెను దర్శించేందుకు వస్తూవుండేవారు. వచ్చిన వారిలో ఒకామె "ఆంటీ, మీరు ప్రభువును చూస్తున్నారా?" అని అడిగినప్పుడు,

అవును అన్నట్లు గా తల ఊపారు. ఈ సమయం లో ఆమెకు అవసరం అయిన రక్తం మా చిన్నాన్న అయిన విమలరావు గారి చిన్న కుమారుడు సునీల్ రక్తాన్ని ఇచ్చాడు. ఈ విషయం మేము ఎల్లప్పుడూ తనకు కృతజ్ఞులం. ఈ సమయం లో ఆమె ప్రతివారితో "నేను ఉండను కనుక నన్ను ఇంటికి తీసుకొని వెళ్లిపోండి" అంటూ వుండేవారు. అనివార్య కారణాల వల్ల, నేనూ, ఇమ్మానుయేలు ఇద్దరం మచిలీపట్టణం వెళ్ళవలసి వచ్చింది.

నవంబరు 30 వ తెదీ న ఉదయం 7:30 కు ఆమెకు గుండె నొప్పి రావటం తో డాక్టర్లు ఆమెను వెంటిలేటర్ పై ఉంచి, ఆమె ఆరోగ్య పరిస్థితి పూర్తిగా క్షీణించినందువల్ల ఆమె ఎక్కువకాలం వుండరు అని తెలియజేయడంతో, ఆ విషయాన్ని దూరం గా వున్నా వెస్లీ కి, ఆ సమయం లో అస్సాం లో పని చేస్తున్న నా భర్త గారు - క్రిసోస్టమ్ గారికి తెలియ జేశాం. చివరిగా డాక్టర్ల సలహా మేరకుఆమెను వెంటిలేటర్ పై నుండి తొలగించి దేహాన్ని మచిలీపట్టణం చేర్చాం.

విషయం తెలుసుకున్నా అనేకమంది (బంధువులు, మరి ముఖ్యం గా సంఘసభ్యులు) మచిలీపట్టణం చేరుకున్నారు. అంత్యక్రియలకు సంబంధించిన సమావేశాన్ని విజయవాడ కు

చెందిన బ్రదర్ ప్రియనాధ్ వచ్చి పూర్తి చేసిన అనంతరం, దేహాన్ని ఊరేగింపుగా సెయింట్ మేరీస్ చర్చ్ కి చేర్చి మా నాన్న సమాధి ప్రక్కన ఆమెను సమాధి చెయ్యటం జరిగింది.

అనంతరం ఆమె జ్ఞాపకార్థ కూటము లో బ్రదర్ విట్సన్ పాల్ గారు తో పాటు అనేకమంది ఇతరులు ప్రసంగించారు.

కొన్ని నెలల తర్వాత అప్పటికి మా అమ్మతో కలసి చర్చ్ కాంపౌండ్ లో ఉంటున్న ఇమ్మానుయేల్ ఆ స్థలం నుండి వేరొక చోటకి మారి, ప్రాపర్టీ ని చర్చ్ వారికి పూర్తిగా అప్పగించాడు.

ఆ సమయం నుండి ఈ నాటి వరకూ ప్రభువు - మమ్ముసూ, సంఘాన్ని విడిచి పెట్టక కాచి, కాపాడాడు. ఆ నాడు మాతల్లి తండ్రులు ప్రారంభించిన ఆ సేవను, ప్రభువు ఈ నాటికీ కొనసాగిస్తూ వున్నాడు. ఆరాధన లకు హాజరయ్యేందుకు క్రమంగా పెరుగుతున్నవారిని కూర్చోబెట్టేందుకు ఎన్నో సార్లు తాత్కాలిక ఏర్పాట్లు చేసిన అనంతరం ఈ రోజు, ఒకే సారి ఏంతోమంది కూర్చొని వాక్యాన్ని వినగల ఒక పెద్ద మంచి ఆలయాన్ని దేవుడు అక్కడ అనుగ్రహించాడు. అనేక నేపధ్యాల నుండి వచ్చే ప్రజలు, దేవుని వాక్యం విని, లోబడి, రక్షణ

అనుభవం లోనికి వచ్చునట్లు, అక్కడ జరిగే ప్రతీ కార్యం ప్రభువు నామము ను మహిమ పరచు విధంగా ఉండునట్లు, ఆయనకే సమస్త మహిమ, ఘనత చెల్లునట్లు ప్రార్థించండి.

# 18

# ఏబెల్ దంపతులు ఇచ్చిన కొన్ని ప్రసంగాలు

## 18.1 ఏబెల్ గారి ప్రసంగం - 1. పరలోక ప్రార్థన

వాక్య పఠనం: లూకా **11: 1-4**

ఇక్కడ మనం ప్రభువు శిష్యులు ఆయన యొద్దకు వచ్చి వారికి ప్రార్థించటము నేర్పించమని అడుగుతున్నారు. మా పిల్లలు చిన్న వారిగా వున్నప్పుడు మొదటిగా మేము వారికి "దేవా, నన్ను మంచి వానిగా చెయ్యి; ఈ రోజు నన్ను కాపాడండి. నిన్ను త్వరగా తెలుసుకునే వానిగా నన్ను

చెయ్యండి........ ఇలా చిన్న చిన్న ప్రార్థనలు నేర్పిస్తూ వుండేవారిమి. వారు ఇంకొంచెం పెరిగిన తర్వాత, పరలోక ప్రార్థన వారికి నేర్పించాము. ఇంకొంత కాలం తర్వాత, పరలోక ప్రార్థన

ను ఇంగ్లీష్లో నేర్పించాం. ఈ విధం గా అంచెలంచెలు గా ప్రార్ధన ను చేసే విధానాన్ని వారికి క్రమంగా నేర్పుతూ వచ్చాము. తల్లితండ్రులు ప్రార్ధించని వారైతే, వారి పిల్లలు ప్రార్ధన ను చేసేవారిగా అయినా, దానిని ఇష్టపడేవారిగా అయినా వుండరు. మనం ఆత్మలో ప్రార్ధించేటప్పుడు, మన చుట్టూ వున్నా వారు సహితం ప్రార్ధిస్తారు.

మనం ఇక్కడ చదివిన భాగం లో- శిష్యులు ప్రభువు ను ఆయన ప్రార్ధిస్తూ వున్నప్పుడు ఆటంకం కలుగజేయకుండునట్లు గా, ఆయన ప్రార్ధన చేసి ముగించిన తర్వాత వచ్చి ఆయనను వారికి ప్రార్ధన ను నేర్పించమని అడుగుతున్నారు. ప్రార్ధన చేసే సమయం లో అయినా, ప్రార్ధన కూటం లో అయినా - ఎవ్వరూ మాట్లాడకూడదు, ఇతరులను ఆటంక పరచకూడదు. ఒకవేళ తప్పని పరిస్థితి లో బయటకు వెళ్ళవలసి వస్తే, ఇతరులకు ఇబ్బంది లేకుండా నెమ్మది వెళ్ళాలి. ఉదయాన్నే లేచి ప్రార్ధన చేసే ముందు నోటిని శుభ్రం చేసుకొనగలిగితే మంచిది.

ఒక కంపెనీ మేనేజర్ గారికి, తాను పని చేసే ప్రదేశానికి వచ్చి పని మొదలు పుట్టకముందు ప్రతిరోజూ పదిహేను నిముషాల పాటు ప్రార్ధించే అలవాటు ఉండేది. ఒకానొక రోజు ఆయన ఇలా తన

ప్రార్థన లో వున్నప్పుడు, తన బాస్ అయిన ప్రెసిడెంట్ గారు ఫోన్ చేస్తే, ఆ ఫోన్ మేనేజర్ గారి పీఏ ఎత్తి "మేనేజర్ గారు కాన్ఫరెన్స్ లో వున్నారండి, ఈ సమయం లో ఎవరైనా ఆయనకు భంగం కలిగించటం ఆయన ఇష్టపడరండీ" అని తెలియజేసాడట! ఏ కాన్ఫరెన్స్ లో మేనేజర్ గారు వున్నారో అని స్వయం గా ప్రెసిడెంట్ గారే వచ్చి, ఆయన మోకాళ్ళ మీద వుండి ప్రార్థించటం చూసి, ఆ తర్వాత మేనేజర్ గారితో " మిమ్మల్ని భంగపరిచినందుకు క్షమించాలి, ఇది మీరు రోజూ చేసే అలవాటుందా?" అని ప్రశ్నించారట! దానికి స్పందించిన మేనేజర్ గారు, అవునండి అని ప్రసిడెంట్ గారితో చెప్పారట! మనం దిన చర్యను పార్రంభించేముందు ప్రార్థన తో ప్రారంభించటం నేర్చుకోవాలి.

మనం చేసే ప్రార్థన ఏ విధం గావుండాలి అనే దానికి ప్రభువు ఇక్కడ నమూనా ను ఇస్తున్నాడు.

పరలోక ప్రార్థన - 'పరలోక మందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధ పరచబడును గాక, నీ రాజ్యం వచ్చు గాక, నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందునూ నెరవేరును

గాక' అని ఆరంభించబడుతుంది. ఇక్కడ చెప్పబడిన మూడు అంశాలు దేవునికి చెందినవి.

ప్రార్థన ను ప్రారంభించి 'తండ్రీ' అని నువ్వు దేవునిని సంబోధించే ముందు, దేవుడు నిజముగా నీ తండ్రి అయి వుండేలా చూచుకొనవలసి వుంది. ప్రతివారినీ, యాచకులు ( భిక్షం ఎత్తుకునే వారు) 'నాయినా' అని పిలిచినట్లు అర్థము తెలియకుండా, దానిని మనస్సున పెట్టకుండా, దేవునిని మనం 'తండ్రీ' అని అలవాటుగా పిలిచే విధం గా ఉండకూడదు. మొదటిగా నువ్వునూ, నేనునూ - ఆయన మన తండ్రి గా మనకు కాకుండా మనం ఆయన రాజ్యము నిమిత్తమూ, ఆయన చిత్తము యొక్క నెరవేర్పు నిమిత్తమూ ప్రార్థించలేము.

దేవుని పిల్లలం గా అయ్యేందుకు మొదట మనము ప్రార్థన చేయవలసిన ప్రార్థన - తండ్రీ నీ కుమారుడనని అనిపించుకొనుటకు నాకు యోగ్యత లేదు అని చేయబడిన ఆ తప్పిపోయిన చిన్న కుమారుని ప్రార్థన చెయ్యాలి. రక్షణానుభవం లేని వారు మొదట దాని కొరకు ప్రార్థించాలి. చాలా సార్లు మనలో రక్షణ అనుభవం కూడా లేని వారు కొందరు ఇతరుల కోసం, సేవ నిమిత్తం పొడపైన విజ్ఞాపన ప్రార్థనలు

చెయ్యటం చూస్తూ ఉంటాం. ఇలాటి వారు మొదట తమ సొంత రక్షణ నిమిత్తం ప్రార్థించాలి. ఈ అనుభవం మన సొంతమైన తర్వాత అప్పుడు మనం ఇతరుల కొరకు, సేవ కొరకు సరిగాను, భారం తోనూ ప్రార్థించ వీలవుతుంది.

నీ నామము పరిశుద్ధ పరచబడును గాక - అని చెప్పటం లో అర్థము: పరిశుద్ధమైన నీ నామము అన్ని విధములు గా మహిమ పరచబడును గాక అని అర్థం. ఆయన నామము నీ జీవితం ద్వారా దినదినము మహిమ పరచబడుతున్నదా? ఒకామెకు ఆమె అత్తగారు వారి ఇంటికి వస్తున్నారు అని తెలియగానే జ్వరం వచ్చేసేది; ఇక ఆ జ్వరం అత్తగారు ఇంటినుండి వెళ్ళిపోయిన తర్వాతనే తగ్గేది! ఇలాటి జీవితాల ద్వారా దేవుడు మహిమ పరచ బడ గలడా?

నీ రాజ్యము వచ్చును గాక! రక్షణ లేని వారు, ఈ లోకాన్ని దాని లోని తాత్కాలిక ఆనందాన్ని ప్రేమించే వారు, దేవుని రాజ్యం నిమిత్తమై భారం కలిగివుండలేరు. ఎక్కడ ఇద్దరు ముగ్గురు దేవుని బిడ్డలు ఆయన నామమున కూడతారో అక్కడ దేవుని సన్నిధి, ఆయన రాజ్యం ఉండగలదు. అయితే ఎక్కడ దైవభయం

లేని వారు తమ శరీరాశలు నెరవేర్చుకునేందుకు కూడతారో అక్కడ సాతాను ఏలుబడి చేస్తాడు.

పరలోకమందు నీ చిత్తము జరుగుచున్నట్లే భూమి మీదనూ జరుగును గాక! దేవుని దూతలు, పరిశుద్ధులు అందరూ పరలోకమందు దేవుని చిత్తాన్ని నెరవేర్చుతారు. అయితే భూమి మీద కొందరు మాత్రమే ఆయన చిత్తాన్ని చేసే వారుగా వుంటారు. విద్యార్థి గా ప్రభువును నేను తెలుసుకున్న తర్వాత, నా విద్య ముగించిన అనంతరం నేను దేవుని చిత్తానుసారంగా ఏమి చెయ్యవలసి వున్నది అని ప్రార్థిస్తున్నప్పుడు, రెండు సంవత్సరాలు పని చేసిన అనంతరం నేను దేవుని పరిపూర్ణ సేవ చెయ్యవలసి వున్నది - అని ప్రభువు నాకు తెలియ జేశాడు. ఈ దినాలలో దేవునిచిత్తం కొనుగొనటం, దానిని చెయ్యటం అనే విషయం అడుగంటి పోతున్నది; అనేకులు వారి సొంత ఇష్టానుసారం గానే తమ పనులు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. కొన్ని సంవత్సరాల క్రితం నేను మా పిల్లలు ఒకరి విషయం లో దేవుని చిత్తం కొరకు ప్రార్థిస్తూ వున్నప్పుడు, ఆ సమయం లో నాకు, ఆ విషయం లో, నా మనస్సు లో

వున్నా ప్రణాళిక ప్రకారం నేను ముందుకు వెళ్ళటం దేవుని చిత్తం కాదు అని గ్రహించాను.

పరలోక ప్రార్థన లో అటు తర్వాత చెప్పబడిన మూడు అంశాలు దేవునికి, మానవునికి సంబంధించినవి -

మా అనుదిన ఆహారము నేడు మాకు దయచేయుము! ప్రతి దినము మనము మన ఆహారము కొరకు ప్రార్థించాలి. దేవుడు రేపటి గురించి చింతించవద్దు అని చెప్పాడు. రానున్న నెలలలో నీ ఆహారము గురించి ఇప్పుడే నీవు ఆందోళన చెందవలసిన పని లేదు. ఆయన వాక్యము నుండి ప్రతి దినం నువ్వు నీ ఆత్మీయ ఆహారాన్ని పొందగలుగుతున్నావా? ఆ వాక్యము నీ ఆత్మీయ లోతులలోనికి వెళ్లి నీ ఆత్మను పునరుజ్జీవింప చేయగలుగుతున్నదా ? అలా లేకపోతే, ప్రతి దినం మనం దాని నిమిత్తమై దేవునిని కోరవలసి వుంది. మనలో కొంతమంది తమ అవసరతలు ఏ దినమునకు ఆ దినము సమకూరుతున్నట్లయితే, మనము ఆత్మీయముగా మరింత బలవంతులము గా ఉండగలం. ఇది నా సొంత జీవితం లో నా వ్యక్తిగత అనుభవం గా నేను చూశాను.

మా ఋణస్థులను మేము క్షమించి యున్న ప్రకారము మా ఋణములను క్షమించుము! కొందరు, ఒకసారి రక్షణ పొంది ప్రభువు బిడ్డలమైన తర్వాత మరల మరల మన తప్పిదముల విషమై ఎందుకు క్షమాపణ కోసం ప్రార్థించవలసిన అవసరం వుంది? అని ప్రశ్నిస్తుంటారు. మారుమనస్సు పొందిన తర్వాత సహితం, ఆ పాపము చేసే నైజం మనలో వుండి, మనం ఆత్మ లో అజాగ్రత్త గా ఉంటే, తిరిగి ఆ నైజము నుండి వచ్చే మొలక పెద్దది కాగలిగే అవకాశం వుండటము వల్ల మనం తప్పులను తిరిగి చెయ్యవచ్చు. అందు నిమిత్తమై మనము క్షమాపణ కోరతాము. మనము ఇతరుల తప్పిదములను క్షమించే వారిమి గా ఉండాలి. మనము తప్పిదము చేసినప్పుడు గ్రహింపుతోనూ, పశ్చాత్తాపము తోనూ క్షమాపణ కోరే వారిమి గా ఉండాలి. నేను పని చేసే సమయం లో ఒకానొక రోజు న అధికారి వచ్చి, ఆ రోజు ఇన్స్పెక్టర్ వచ్చాడా? రాలేదా? అని ప్రశ్నించాడు. నేను ఏమి చెప్పకుండా మౌనంగా వున్నాను. ఇక ఆయన వెళ్ళిపోయిన తర్వాత నా మనసాక్షి చాలా గలిబిలి గా తయారయ్యింది. దానిని సరిగాను, పూర్తిగాను సరిచేసుకునే వరకూ నా మనసాక్షి నన్ను గద్దిస్తూనే వుండింది.

మమ్ము ను శోధన లోనికి తేక దుష్టుని నుండి తప్పించుము! సాతానుకు, మనకు ఏ వల వేసి ఎలా మోసగించాలో బాగా తెలుసు! ఒక ఉచ్చు (వల) సరిగా పనిచేయకపోతే వాడి దగ్గర ఎన్నో ఇతర ఉచ్చులు వాడేందుకు వున్నాయి. అందువల్ల మనం ఎల్లప్పుడూ మెలకువ గా వుండి ప్రార్థించేవారిమి గా ఉండాలి. పేతురుకు తన విశ్వాస విషయంలో అతివిశ్వాసం (overconfidence) వుండటము వల్ల "నేను ప్రభువును ఎరుగనని బొంకుతానా?" అని అనుకున్నాడు; అయితే తర్వాత ఏమి జరిగిందో మన కందరికీ తెలుసు!

ఒకతను పరీక్షకు వెళ్లేముందు నాతో ప్రార్థన చెయ్యించుకునేందుకు వచ్చాడు. ఎందుకో ప్రార్థించిన తర్వాత అతనితో నేను - ఒకవేళ పరీక్ష హాల్ లో నీకు కాపీ చెయ్యాలనే ఆలోచన వస్తాదేమో జాగ్రత్త - అని హెచ్చరించాను. దానికి స్పందించిన అతడు, "అదేంటన్నా .... నేను రక్షణ పొందిన వాడిని! అదెలా జరుగుతుంది?" అని చాలా తనపై తనకు అతివిశ్వాసం తో సమాధానం చెప్పాడు.

అయితే పరీక్ష హాల్ లో అతడు కాపీ చేస్తూ పట్టుబడ్డాడు. అతివిశ్వాసం చాల ప్రమాదకరమైనది. చాలా మంది నాకు అలాటి

శోధన వస్తాదా ? ఒకవేళ వచ్చినా దానికి నేను లోబడి పోతానా? అని అనుకుంటారు. వారు అదే అతివిశ్వాసం తో కొనసాగితే అతి త్వరలోనే పడిపోతారు. అందుకే ప్రభువుపై ఆనుకుంటూ ఆయన సహాయం నిమిత్తం మనం ఎప్పుడూ ప్రార్ధించే వారిగా ఉండాలి.

రాజ్యము, శక్తి, మహిమా నిరంతరం నీపైనవి! ఈ మాటలు - ఈ చెప్పినవన్నీ, ఎల్లప్పుడూ కేవలం ప్రభువుకు మాత్రమే చెందుతాయి అని తెలియ జేస్తున్నాయి. ఈ దినాలలో (1981 - 82) మొరార్జీ దేశాయి మతమార్పిడి చట్టం తేవాలని ఆలోచిస్తున్నది ముఖ్యం గా క్రైస్తవులుగా మారే ఇతర మతాల వారిని అడ్డుకునేందుకు! మనం ప్రార్థిస్తూ వున్నప్పుడు, అతని ప్రభుత్వాన్ని దేవుడు తొలగించాడు. మన పరలోకపు తండ్రి సర్వ శక్తిమంతుడు, సర్వాధికారి అయి వున్నాడు. ఆయన ఆధిపత్యంనకు విశ్వము లోని సమస్తము లోనై వుంది.

అందువల్ల మొదటిగా మనము ప్రభువు నందు విశ్వసించి ఆయన బిడ్డలము గా కావాలి. తర్వాత దేవుని నామము మహిమ పరచబడునట్లుగా ప్రార్థిస్తూ, ఆయన రాజ్యం వచ్చునట్లు ప్రార్థించాలి. ఆ పిమ్మట పరలోకం లో నెరవేరుతున్నట్లు గా భూమి యందును ఆయన చిత్తం నెరవేరునట్లు ప్రార్థించాలి.

తర్వాత మనం - మన ఆత్మీయ, శారీరక 'మన్నా' ల నిమిత్తం ప్రార్థించాలి. అప్పుడు ఇతరుల తప్పిదములను ముందు మనము క్షమించిన తర్వాత, ప్రభువును మన తప్పిదములను క్షమాపణ నిమిత్తమై కోరాలి. ఆ పిమ్మట తరచూ మనకు కలిగే శోధనలనుండి మనలను తప్పించు నట్లు ప్రభువును ప్రార్థించాలి. ఇక చివరిగా - రాజ్యము, సమస్త శక్తి, మహిమ ప్రభువునకు మాత్రమే మనము చెల్లించాలి.

# 18.2 ఏబెల్ గారి ప్రసంగం - 2. ప్రార్థించుట

వాక్య పఠనము: లూకా **11: 5 – 8**

ఈ చదువబడిన భాగం లో ఒకని స్నేహితుడు తనవద్దకు మధ్యరాత్రి వేళ సహాయం కోరే నిమిత్తం వచ్చినట్లు చూస్తున్నాం.

ప్రార్థన లో అనేక రకాలు వున్నాయి.

## 18.2.1. పట్టుదల తో ప్రార్థించుట:

ఇప్పుడు చదివిన వాక్య భాగం లో - సహాయం కోసం వచ్చిన వ్యక్తి, వేళకానివేళ వచ్చినప్పటికీ తనకు కావలసిన సహాయం, అతడు - పదే పదే పట్టుదలతో అడిగినందు వల్ల, అడిగినది పొందగలిగాడు. ప్రభువును మనం అడిగే టప్పుడు ఇదే విధం గా మనము ప్రార్థించవలసివుంది. మనము ప్రభువు నందు విశ్వసించినప్పుడు ఆయన స్నేహితులం కాగలము; ఆయన స్నేహితులం గా ఆయనను, మన అవసరతల నిమిత్తం పట్టుదలగా అడిగేవారమై ఉండాలి.

## 18.2.2 వ్యర్ధమైన మాటలు, పునరావృతం అయ్యే మాటలు లేకుండా ప్రార్ధన చేయుట:

కొండమీది ప్రసంగం లో క్రీస్తు ప్రభువు "మీరు ప్రార్ధించే సమయం లో అన్యజనులవలె వ్యర్థమైన మాటలు వచింపవద్దు" అని సెలవిచ్చాడు. "విస్తరించిమాట్లాడుట వలన తమ మనవి వినబడునని వారు తలంచు చున్నారు, మీరు వారి వలె ఉండకుడి." అని వ్రాయబడి వుంది. ఒకానొక సంఘం లో ఒకతను ' సర్వశక్తి గల, కరుణామ యుడవైన, సర్వసృష్టిని సృష్టించిన, అద్వితీయసత్య దేవుడవైన......" అంటూ ఇలా దేవునిని సంబోధించటానికే చాలా మాటలు వాడుతూ ప్రార్ధన మొదలు పెట్టాడు. అదే సంఘంలో మరొకరు కూడా అలాటి విధం గానే, ఇలాటి పదజాలాన్నే వాడుతూ ప్రార్ధించటం నేను గమనించాను. ఇలాటి తిరిగి తిరిగి అదే పదజాలం వాడుతూ ప్రార్ధించవద్దు అని ప్రభువు సెలవిస్తూ వున్నాడు. మనము ప్రభువు తో సరైన సంబంధం లేకుండా వున్నప్పుడు, మొదటిగా దానిని సరిచేసుకొని ప్రార్ధన కొనసాగించే వారమై ఉండాలి. ప్రార్ధనలు అనుకరించేవిగా ఉండ కూడదు. మన హృదయ పరిస్థితి, అవసరతను బట్టి మనం ప్రార్ధించేవారిమి గా ఉండాలి.

## 18.2.3. అర్థసహితమైన ప్రార్థన:

మన ప్రార్థన వ్యర్థమైన మాటలు లేకుండా అర్థసహితమైనదై ఉండాలి. మనము దేవుని 'ప్రభువా' అని సంబోధించినప్పుడు నిజముగా నీవు అది నీ హృదయాంతరంగం నుండి చెప్పే సంబోధన గా ఉండాలి. నేను ప్రభువు యొద్దకు రాకమునుపు ఎన్నడూ ఆయనను 'ప్రభువా' అని సంబోధించలేదు. ఆ దినాలలో - ఆయన నాకెలా ప్రభువు అవుతాడు అని నేను వాదించేవాడిని. అయితే నాకు గ్రహింపు కలిగి పశ్చాత్తాపపడినప్పుడు నా హృదయాంతరంగం నుండి నేను ఆయనను 'ప్రభువా' అని సంబోధించాను. "నీవు పాపాన్ని, మరణాన్ని జయించి తిరిగిలేచావు ప్రభువా" అని నేను చెప్పగానే దేవుని ఆత్మ నన్ను ఆవరించింది.

## 18.2.4. ఒకే ప్రార్థన ను తిరిగి, తిరిగి చేయుట:

మనం చేసే ప్రార్థన, పుస్తకము లోనుండి చదివే ప్రార్థన గా ఎప్పుడూ ఒక్కటే గా ఉండకూడదు. ఒకానొకసారి ఒక పాస్టర్ గారిని సుందర్ సింగ్ గారు ఒక వ్యక్తి చనిపోయినసందర్భం లో అంత్యక్రియల కూటం లో ప్రార్థించమని అడిగినప్పుడు, ఆ పాస్టర్

గారు తన ప్రార్థన పుస్తకం తెచ్చుకోటానికి అదే పనిగా పరిగెత్తు తున్నారట! కొందరు పుస్తకం లేకుండా ప్రార్థన చెయ్యలేరు. కొంతకాలం క్రితం ఒక ఇంటికి నేను వెళ్తే "బాగున్నారా?" అనే స్వరం వినిపించింది. వెంటనే నేను "ఆ .... బాగానే వున్నాను" అంటూనే అడుగుతున్నది ఎవరా అని చుట్టూ చూస్తే ఎవ్వరు కనిపించలేదు. ఇలా మరల జరిగింది. నాకేమీ అర్ధం కాలేదు! ఇంతలో ఆ ఇంటి యజమాని నవ్వుతూ వస్తూ వుంటే, "ఆలా నన్ను అడుగుతున్నది ఆయనేనా?" అని నేను ప్రశ్నించాను. ఆయన పక్క పంజరం లో వున్నా ఒక 'మైనా' పక్షి వైపు చూపించి నన్ను అడుగుతున్నది అది అని చెప్పాడు. ఆసక్తిగా నేను ఆయనతో ఆ పక్షి ఇంకా ఏమైనా మాట్లాడితే, మాట్లాడించమని అడిగాను. అదొక్కటే మాట అది నేర్చుకున్నది, అంతకు మించి మాట్లాడలేదు అన్నాడు. మన ప్రార్థనలు ఆ 'మైనా' పక్షి మాటల్లా ఉండకూడదు.

## **18.2.5.** ఆత్మ చేత నడిపించబడే ప్రార్థన:

దేవుని ఆత్మ యేసు ప్రభువును ప్రార్థించు నిమిత్తం అరణ్యం లోనికి తీసుకొని వెళ్ళింది. కడుగబడిన హృదయం లో దేవుని ఆత్మ ప్రవేశించినప్పుడు ఆ వ్యక్తి ఎడతెగక ప్రార్థన

చేయగలుగుతాడు. రోమా 8:26 లో - 'అటువలె ఆత్మయు మన బలహీనతను చూచి సహాయము చేయుచున్నాడు. ఏలయనగా మనము యుక్తముగా ఏలాగు ప్రార్థన చేయవలెనో మనకు తెలియదు గాని, ఉచ్చరింప శక్యముకాని మూలుగులతో ఆ ఆత్మ తానే మన పక్షముగా విజ్ఞాపనముచేయుచున్నాడు.' అని వ్రాయబడివుంది. ఆత్మ చేత నడిపించబడుతూ చేసే ప్రార్థన ఎంత సేపు చేస్తూవున్నా సమయం తెలియదు! కొంత మంది ప్రార్థన లో ఎంతో అసహనం గా ఉండేందుకు కారణం: వారికి ఆత్మ చేత నడిపించబడే ప్రార్థన లేకపోవటమే !

## **18.2.6.** మన అవసరాల కొరకు చేసే ప్రార్థన:

మన అవసరత లను ప్రార్థనలో దేవుని యొద్ద అడుగ వచ్చు; కానీ మనము అడిగేది ఆయన చిత్తానుసారం గా అడగాలి. పాలస్తీనా లో రాళ్లు కూడా రొట్టెల మాదిరిగ కనబడతాయట. అందుకే మత్తయి 7: 7-11 లో - 'అడుగుడి మీకియ్యబడును. వెదకుడి మీకు దొరకును,తట్టుడి మీకు తీయబడును. అడుగు ప్రతివాడును పొందును, వెదకువానికి దొరకును, తట్టువానికి తీయ బడును. మీలో ఏ మనుష్యుడైనను తన కుమారుడు తన్ను రొట్టెను అడిగినయెడల వానికి రాతినిచ్చునా? చేపను

అడిగినయెడల పామునిచ్చునా? మీరు చెడ్డ వారై యుండియు మీ పిల్లలకు మంచి యీవుల నియ్య నెరిగి యుండగా పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి అంతకంటె ఎంతో నిశ్చయముగా మంచి యీవుల నిచ్చును.' అని వ్రాయబడి వుంది.

అన్నామణి గుడ్డ కోసం అడిగి వాటిని పొందింది, సూప్ చేసుకునేందుకు ఎముక కోసం అడిగి దానిని పొందింది. ఒకసారి నా భార్య కట్టెలకొరకు ప్రార్థించి వాటిని పొందింది.

## 18.2.7. శుద్ధ హృదయం తో ప్రార్థించుట:

మార్కు 11:25-26 లో - 'మీకు ఒకనిమీద విరోధ మేమైన కలిగియున్న యెడల, మీరు నిలువబడి ప్రార్థన చేయునప్పుడెల్లను వాని క్షమించుడి. అప్పుడు పరలోకమందున్న మీ తండ్రియు మీ పాపములు క్షమించును.' అని వ్రాయబడి వుంది. కొందరు క్షమిస్తారు గాని మర్చిపోలేరు, వారి మనస్సు లో అదే బాధ కదులుతూ ఉంటుంది. మన పరలోక తండ్రి మన అపరాధములను క్షమించి మరల జ్ఞాపకము చేసికొనడని - ఆయన చెప్తూవున్నాడు. ఒకాయన నా

మీద ఇతరులకు చెడుగా చెప్తున్నప్పుడు నా మనస్సులో బాధ పడుతూ ప్రార్థన చెయ్యలేని స్థితికి వచ్చాను. ఇది సరికాదని గ్రహించిన నేను, ఆ స్థితిపై జయాన్ని పొందాలని రెండు దినములు ఉపవాసం వుండి ప్రార్ధించిన తర్వాత జయాన్ని చూడగలిగాను. మనం ప్రార్థించేటప్పుడు మన ఇరుగు పొరుగు వారి పట్ల మనకు మనస్సు లో బాధ, క్షమించలేని స్థితి ఉండకూడదు.

## 18.2.8. హృదయాంతరంగం లో కోపం లేకుండా ప్రార్థించాలి:

1 తిమోతి 2:8 లో - 'ప్రతిస్థలమందును పురుషులు కోపమును సంశయమును లేనివారై, పవిత్రమైన చేతులెత్తి ప్రార్థన చేయవలెనని కోరుచున్నాను.' అని వ్రాయబడివుంది. కోపమును హృదయం లో ఉంచుకొని ప్రార్థించేందుకు వెళ్ళకూడదు. కొందరు తమ విరోధులను గాయపరిచి అయినా దేవుడు వారికి పాఠం చెప్పాలని ప్రార్థిస్తూ వుంటారు. ఇది తప్పు! నేను ఒక స్త్రీ తో మాట్లాడుతున్నప్పుడు, తాను తన భర్తను క్షమించినట్లు చెప్పింది; అయితే తర్వాత నేను - ఆమె తన భర్త

తో మాట్లాడి ఆరు నెలలు అయ్యింది అని విన్నాను. మన మనస్సు ను కోపము యొక్క యేలుబడి లో ఉంచకూడదు.

బైబిల్ - సూర్యుడు అస్తమించకముందే మనము కోపమును విడచి సరిచేసుకొనవలెను అని చెప్తున్నది. కోపం మన మనస్సులో ఉంచుకొని ప్రార్దించకూడదు. లూకా 9:54-55 లో - 'శిష్యులైన యాకోబును, యోహానును అది చూచి ప్రభువా, ఆకాశమునుండి అగ్ని దిగి వీరిని నాశనము చేయునట్లు మేము ఆజ్ఞాపించుట నీకిష్టమా అని అడుగగా, ఆయన వారితట్టు తిరిగి వారిని గద్దించెను.' అని వ్రాయబడివుంది. ఇక్కడ ప్రభువు గద్దించినట్లు చూస్తున్నాము.కొందర 'దురుద్దేశములను' హృదయం లో ఉంచుకొని ప్రార్థించేవారుగా వుంటారు; ఇలాటి ప్రార్థనలు దేవుడు అంగీకరించడు. భార్య భర్తలైన తమ మధ్య సయోధ్య సరిగా లేకపోవటం వల్ల వారు కుటుంబ ప్రార్థన చేసుకొనలేకపోతున్నారు అని - ఒకరు కొంతకాలం క్రితం చెప్పారు. అది సరైన స్థితి కాదు.

## 18.2.9. సందేహం లేకుండా విశ్వాసం తో ప్రార్ధన చేయుట:

మనం సందేహం లేకుండా విశ్వాసం తో ప్రార్ధన చెయ్యాలి. ఒకానొక సమయం లో ఒక కుంటి బాలుని ఓరల్ రాబర్ట్స్ గారి కూటాలకు స్వస్థత నిమిత్తం తీసుకొని వెళ్లారట. అక్కడికి వెళ్ళగానే ఆ కుర్రవాడు తాను చంకలలో పెట్టుకొని వచ్చిన ఊతకర్రలను తీసుకొని వెళ్లిపొమ్మని తన తల్లి తండ్రులకు చెప్తే, వారు "నీవు స్వస్థత పడిన తర్వాత వాటిని తీసుకొని పోవచ్చులే" అని చెప్పారట. అయితే ఆ కుర్రవాడు, "నేను తప్పని సరిగా స్వస్థత నొందుతాను ఆ వూతకర్రలను తీసుకు పొండి" అని చెప్పాడట! అతని కొరకు దైవసేవకుడు ప్రార్ధించినపుడు అతడు పూర్తిగా స్వస్థత పడినాడట! ఆ బాలునికి వున్నా విశ్వాసం మనము కలిగి ప్రార్ధన చెయ్యగలుగుతున్నామా?

## 18.2.10. దీనత్వముతోను కన్నీటితోను చేసే ప్రార్ధన:

మనం చేసే ప్రార్ధనలు దీనత్వం తోనూ, కన్నీటితోనూ చేసే ప్రార్ధనలై ఉండాలి. ఈ విధం గా చేసే ప్రార్ధనలకు నా జీవితం లో త్వరగా జవాబులు రావటం నేను చూశాను. మనలో చాల

మందిమి ఇలా ప్రార్థన చేసే స్థితిని కోల్పోయాము. దానియేలు ప్రార్థించినప్పుడు తన మనవి ఇరవైయొక్క దినములలోపే అంగీకరించ బడినది. రాజైన హిజ్కియా కన్నీటితో ప్రార్థించినప్పుడు దేవుడు తన ఆయుష్షు ను పదిహేను సంవత్సరాలు పొడిగించాడు. మత్తయి 15:21-28 లో ఒక కానాను స్త్రీ సహాయం కొరకు ప్రార్థించి దానిని పొందినట్లు చూడగలము. మనము కూడా ఆలా ప్రార్థించేవారిలా ఉండాలి.

## **18.2.11.** దేవుని చిత్తానుసారం గా ప్రార్థించే ప్రార్థన:

మనము ఆత్మానుసారం గా జీవిస్తూ, దేవుని వాక్యాన్ని ధ్యానించేటప్పుడు, దేవుని ఆత్మ ఈ విధం గా ప్రార్థించటము మనకు నేర్పిస్తాడు. 1 యోహాను 5:14 లో - 'ఆయననుబట్టి మనకు కలిగిన ధైర్యమేదనగా, ఆయన చిత్తానుసారముగా మనమేది అడిగినను ఆయన మన మనవి ఆలకించుననునదియే' అని వ్రాయబడివుంది. ఒకసారి కీ. శే . ఎన్. దానియేలు గారు తమ పిల్లలు వెళ్లే స్కూల్ చాలా దూరం గా ఉండటం తో అది వారి ఇంటి దగ్గరలోనికి వచ్చేలా ప్రార్థించారట. దేవునికి సన్నిహితం గా జీవించటం వల్ల దేవుని ఆత్మచే నడిపింపబడి, ఆయన ఆ విషయం జరుగక ముందే

దాని విషయం ఆత్మ లో గ్రహించి ప్రార్థన చేయగలిగారు. త్వరలోనే ఆలా జరిగినదట! ఒక సారి నేను పది రూపాయల కోసం ప్రార్థిస్తూ, ప్రార్థిస్తూ ఆ ప్రార్థన లోనే ప్రభువు ఆ అవసరతను తీర్చినందుకు అయనను స్తుతించటం ప్రారంభించాను. ఇంటికి వచ్చిన తరువాత "ఏమైనా డబ్బు అందిందా?" అని నా భార్యను అడిగితే, "అవునండి పది రూపాయలు" - అని ఆమె చెప్పింది.

## 18.2.12. పెనుగులాడుతూ ప్రార్థించుట:

నా కొక వ్యక్తి తెలుసు; ప్రార్థన అనంతరం అతని చొక్కా పిండితే చెమట నీళ్లలా పడేది. ఫెలోషిప్ ఆరంభ దినాలలో సుందర్రావు అనే సేవకుడుండేవాడు. అస్మా తో బాధ పడుతున్న ఒక స్త్రీ ని ఆయన యొద్దకు ప్రార్థన నిమిత్తము తీసుకొని వచ్చారు. అతను ప్రార్థిస్తూ "రక్తం, రక్తం, ..... దిగు, దిగు..... " అంటూ ప్రార్థించేవాడు. అతను ప్రార్థించేటప్పుడు తన ప్రార్థన కు సమాధానం గా అతనికి ఏదో గొడుగు లాటిది దిగుతున్నట్లు కనుపించేదట. దాని కోసం ఆలా ప్రార్థిస్తూ ఉండేవాడు. ఆ అస్మా తో బాగుపడుతున్న ఆ స్త్రీ కోసం ప్రార్థించి ఆ రోజు, ప్రార్థనలోనే "దిగినందుకు స్తోత్రం ప్రభువా!" అని చెప్పి ప్రార్థన నుండి లేచాడు. అస్మా - మరుసటి రోజు మాయమయ్యింది. మా

నాయన పుట్టిన సమయం లో మా నానమ్మ కు పాలు లేకుండటం వల్ల, మా తాత బిడ్డను చేతిలోనికి తీసుకొని ప్రార్థించినప్పుడు, మా నానమ్మ కు సమృద్ధిగా పాలు వచ్చాయట. దీనితో మా నాన్నకు సమూయేలు అని పేరు పెట్టారట!

బొల్లెద్దు జాన్ గారు ప్రార్థిస్తున్నప్పుడు, ఒకసారి ప్రభువు, "జాన్ నువ్వు మొండివాడవు; నువ్వు అడిగింది ఇస్తున్నాను" అని అన్నట్లు చెప్తూ వుండేవారు. ఒకొక్క సారి నా భార్య, "ఏమండీ ప్రార్థన పై పట్టు తప్పింది, సమస్య తీరేవరకూ మనం ప్రార్థించాలి" అని నాతో అంటూ ఉంటుంది.

## 18.2.13. దేవుని రహస్యాలను, ప్రవచ నాలను తెలుసుకొని ప్రార్థించుట:

ఆత్మ లో ప్రార్థించే వాడివిగానూ, దేవునితో ఏకత్వం కలిగిన వాడివైతే - నువ్వు ఆయన ప్రవచనాలను, మనకు గ్రాహ్యం కాని రహస్యాలను తెలుసుకొన గలుగుతాము. మనం ఆత్మీయంగా గుడ్డివారమైపోతే, ఇది సాధ్యపడదు. చాలా సార్లు నేను, "దేవా నీ చిత్తానుసారం గా ఈ స్థలానికి వచ్చి సేవ ప్రారంభించిన నేను,

నీతో సంబంధాన్ని కోల్పోయి ఆత్మీయం గా గుడ్డివాడినైపోయానా" అని నన్ను నేను పరిశోధించుకుంటూ ప్రార్ధిస్తాను. అపో 10 వ అధ్యాయం లో - దైవ దర్శనం కలిగిన కొర్నేలి, పేతురు ను తన గృహానికి పిలుస్తున్నట్లు చూస్తాం. మనం దైవ దర్శనాలు పొందే రీతిలో వున్నామా లేక ఆత్మీయం గా గుడ్డివారమైపోయామా?

దేవుడు, మనలను మనము తగ్గించుకొని ప్రార్ధన జీవితం లో పరిపక్వత గలిగిన వారిమి గా మారి, ఆయన సారూప్యత లోనికి ఎదుగునట్లుగా మనకు సహాయం చేయును గాక.

## 18.3 ఏబెల్ గారి ప్రసంగము - 3. మనస్సును స్వాధీనపరచుకొనుట

“ప్రాకారము లేక పాడైన పురము ఎంతో తన మనస్సును అణచుకొనలేనివాడును అంతే….” సామెతలు *25:28*

ఆ దినాలలో పట్టణాల చుట్టూ వెడల్పైన కోట గోడలుండేవి; బబులోను చుట్టూ వున్నా కోట గోడ వెడల్పు ముప్పై అడుగులు!

మద్రాసు (చెన్నై) లో బ్రిటిష్ వారు ఆ దినాలలో కట్టిన కోట, దాని చుట్టూ కోటగోడ (ప్రాకారము) ఉండేది. ఈ ప్రాకారముల చుట్టూ - శత్రువులు లోనికి రాకుండా చేసేందుకు, కందకాలు తవ్వేవారు. ఇవన్నీ భౌతికంగా శత్రువులు మనలను చేరనివ్వకుండా చేసే కోట గోడలు! అయితే, మన మనస్సును లోబరచుకొని మనలను ఆత్మీయంగా బందీలు గా చేసే సాతాను నుండి మనలను మనం కాపాడుకునేందుకు ‘ ప్రార్థన’ అనే ప్రకారం మనకు అవసరం. అయితే, ఈ ప్రార్థన ప్రాకారాలు మన మనస్సులను, గృహాలను సాతాను నుండి కాపాడుకునే నిమిత్తం మనం కలిగివున్నామా? ఒక పదహారు సంవత్సరాల యువకునిగా నేను మా చిన్నాన్నను - “నాలాటి ఒక యువకునికి తన మనస్సు లోనికి

చెడు తలంపులు రాకుండా నియంత్రించుకొనగల శక్తి ఉంటుందా?" అని అడిగాను. దానికి అయన, "నీకు అది సాధ్యపడదు, అయితే, దైవ శక్తి నిన్ను ఆవరించినప్పుడు, అది నీకు దానిని సాధ్యపరుస్తుంది!" అని జవాబిచ్చారు. నీవును, నేనునూ ప్రభువు శక్తిని పొందుతూ మన దేవునికి వ్యతిరేకమైన తలంపులను నియంత్రించుకొనలేని స్థితి లో ఉంటే, మనము కూడా ప్రాకారములు కూలిపోయిన పట్టణముల వలెనే ఉంటాము.

రెండవ ప్రపంచ యుద్ధము తర్వాత ఈస్ట్ బెర్లిన్ కు, వెస్ట్ బెర్లిన్ కు మధ్య గోడ కట్టారు. అయితే మన మధ్య కూడా ఉండకూడని గోడలు కొన్ని వుంటూవుంటాయి; 'కులం' అనేది ఈ కోవకు చెందిందే. కొంత మంది విశ్వా సులు సహితం తమ కులంలోనే వివాహం చేసుకోవాలని పట్టుపడు తుంటారు. క్రీస్తు లోనికి వచ్చిన తర్వాత కుల పట్టింపా? ఒకామె తాను 'బ్రాహ్మణ క్రైస్తవురాలిని' అని చెప్పుకుంటూ ఉండేది. క్రీస్తు తన ప్రశస్త రక్తం ద్వారా కొనిన మనమంతా క్రీస్తుకు చెందిన క్రైస్తవులమే గానీ, 'బ్రాహ్మణ క్రైస్తవులు', 'రెడ్డి క్రైస్తవులు' - ఇలా తారతమ్యాలు ఏవీ లేవు.

సినిమా హాల్స్ వంటివాటికి దగ్గర లో నివసించే వేశ్యలు, అనేక మందిని దౌర్భాగ్యపు జీవితం లోనికి నడిపిస్తూ వుంటారు. రాహాబు యెరికో గోడ మీద నివసిస్తున్న ఒక వేశ్య! ఒక వేళ యెరికో పట్టణం లోపల ఆమెకు ఆవిధం గా నివసించే వీలు లేదేమో. అయితే, దేవుని కృప వల్ల ఆమె దేవుని యందు నమ్మి, ఆయన ప్రజలకు వారి అవసరత లో సహాయం చేసింది. కొందరు - ఎక్కడ వారికి మురికి జీవితము జీవించే వీలుంటుందో, అక్కడే వుంటూవుంటారు. కొన్ని గృహాలలో వ్యభిచారపు ఆత్మ ఏలుబడి చేస్తూ ఉంటుంది. అలాటి ఇండ్లలో తండ్రి వ్యభిచారం లో బ్రతికే అలవాటు కలిగిన వాడైతే, ఆ ఆత్మ ఇతరులపై సహా ఆ ఇంటిలో ఆధిపత్యం కలిగి ఉంటుంది. కొన్ని స్థలాల (సినిమా హాల్స్, తాగుడు దుకాణాలు) లో అపవిత్ర ఆత్మలు ఏలుబడి చేస్తుంటాయి. నీవు చెడు పుస్తకాలు చదివేవాడిపైనా, వ్యభిచారులతో సాంగత్యం చేసేవాడిపైనా - నీ చూపులను, తలంపులను అదుపులో ఉంచుకొన లేవు. ఇలాటివారు పవిత్రమైన జీవితం జీవించటం అసాధ్యమౌతుంది. మన దేహములు జారత్వమునకు కాక, దేవుని మహిమ పరచుట కొరకు చేయబడినాయి. మీలో ఎంతమంది మీ చూపులను, మనసులను, దేహములను నియంత్రణ లో

నుంచుకొనగల ఆత్మీయ ప్రాకారములను కలిగి వున్నారో నాకు తెలియదు.

యిర్మీయా 35 అధ్యాయం లో రేకాబీయుల గురించి వ్రాయబడి వుంది. వీరు చాల నిష్ఠా గరిష్ఠులు గా వుండేవారు. వారు త్రాగుడు త్రాగకూడదు, సొంత ఇల్లు కలిగి ఉండకూడదు; కేవలం గుడారములలో నివసించాలి. వారి పితరులు ఇచ్చిన నియమ నిబంధనలను వారు ఖచ్చితంగా అమలు జరపాలి. ఇలాటి కఠిన నియమాలు వీరు పాటించేవారు. పార్టీ లలో ఇచ్చే త్రాగుడు ను త్రాగకుండా వుండేవారు మీలో ఎంతమంది వున్నారు? మీలో ఎంతమంది సినిమాలకు, సిగరెట్లకు అలవాటు పడని వారు వున్నారు?

చాలామంది యువకులు, తమ సొంత శరీరాలే తమకు శత్రువులు అనుకుంటుంటారు. టీనేజ్ బహు అపాయకరమైనది. ఈ వయస్సులో నీ మనస్సు, శరీరం అలజడికి గురి అవుతుంది, కానీ, దేవుని శక్తిని నీవు పొంది నీ శరీరాన్ని, మనస్సును నియంత్రణలో ఉంచుకునే వాడివి గా ఉండాలి. దేవుని దృష్టిలో హేయమైన తమ శరీరాశలు తీర్చుకునే వారు, ఇతర అన్ని

ప్రదేశాలతో పాటు కొన్ని ప్రాముఖ్యమైన ప్రదేశాలలో సహితమూ వుండటము చాలా విచారము!

బైబిల్ లో దావీదు కుమారుడైన అమ్నోను అనే యువకుడు, తన మారుతల్లి కి పుట్టిన తన సొంత చెల్లెలిని మోహించి ఆమెతో పాపము చేసేందుకు రోగిగా వున్నట్లు నటించాడు. ఆ విధంగా తన కోరికను తీర్చుకోవటము లో అతడు సఫలీకృతుడయ్యాడు, గాని పిమ్మట అతడు చంపబడినాడు. నీ కండ్లకు, తలంపులకు నియంత్రణ అనేవి ఉంటున్నాయా? తన మనస్సును అణచుకొనలేని వాడు, ప్రకారము లేని పురము వలె వున్నాడు. యవ్వనులారా, మీ మనస్సులను నియంత్రించుకొనగల శక్తి - దేవుని లో మీకు దొరుకుతుంది.

కొందరు వారికి సాధారణం గా కోపం రాదని, కానీ వచ్చిందంటే మనిషిలాగా ప్రవర్తించరని అంటూ వుంటారు. వేమన - తనకోపమె తన శత్రువు అని చెప్పాడు. ఇతరులపై నీకున్న కోపమే నీ కడుపులో అల్సర్స్ వచ్చేలా చేస్తున్నదేమో! తల్లి తండ్రులు తమ పిల్లలను తల వెనుక భాగం లో ఎప్పుడూ కొట్టకూడదు. మృగకోపాన్ని మనము చూపించ కూడదు. కొంతమంది పిల్లలు తమ తల్లితండ్రుల మీద కోపంతో భోజన బల్ల

వద్ద నుండి లేచి వెళ్ళిపోతారు. ఇంకొంతమంది పిల్లలు కూర నచ్చకపోతే భోజనం తో సహా ప్లేట్ లను విసరి వేసే వారు వుంటారు. నీవు నీ భావోద్వేగాలను అణచుకొనలేని స్థితి లోవుంటే, నువ్వు ప్రాకారము లేని పురము లాటి వాడివే. ఒక రక్షణ నొందని వ్యక్తి సాతాను యొక్క అధీనం లో వున్నాడని గ్రహించాలి.

యుద్ధము చేయటంలో ఇశ్రాయేలు సిపాయిలు ఆరితేరిన వారు. కొంత కాలం క్రితము ఉగాండా లోని ఎంటబి విమానాశ్రయం లో కొంత మంది ఇశ్రాయేలు వారిని బందీలు గా టెర్రరిస్టు లు పట్టుకున్నారు. ఆ సమయం లో కొంత మంది ఇశ్రాయేలు వారి సిపాయిలు వెళ్లి ఆ ఉగ్రవాదులను చంపేసి బందీలను విడిపించాల్సి వచ్చింది. ఈ పోరాటం లో ఇద్దరు ఇశ్రాయేలు సిపాయిలు చనిపోయారు. అంటే అక్కడి బందీలను విడిపించేందుకు ఆ ఇద్దరు సిపాయిలు తమ ప్రాణాలు పణం గా పెట్టారు. క్రీస్తు ప్రభువు కూడా నీవును, నేనును సాతాను యొక్క బందీ గృహం నుండి మనలను విడిపించేందుకు తన విమోచన రక్తాన్ని సిలువ పై చిందించి మనలను విడిపించాడు.

ప్రభువు రక్తం లో పాప విమోచన వుంది. సామెతలు 18:10 లో - 'యెహోవా నామము బలమైన దుర్గము. నీతిమంతుడు అందులోనికి పరుగెత్తి సురక్షితముగా నుండును.' అని వ్రాయబడి వుంది. మోషే ఇశ్రాయేలీయులను నడిపిస్తున్న కాలంలో మరణ దూత ఏ గృహం నకైతే ద్వారబంధాలకు, పై కమ్మీ, పక్క నున్న కమ్మీ లకు రక్తము పూయబడినదో, ఆ గృహములలోనికి ప్రవేశించలేక పోయాడు. ఆ గృహాలు న్యూక్లియర్ బంకర్ల వంటివి గా పని చేశాయి. నీ కున్న ధనము, స్థానము, ప్రాముఖ్యత, ఆధారము - నీ అవసరత లో నిన్ను కాపాడి రక్షించలేవు.

కొంతమంది ఆడవాళ్ళ దుస్తులు ధరించి, ఆడపిల్లల హాస్టల్ లోకి ప్రవేశించేవారున్నారు. నీవు వారిలో ఒకడివైతే పశ్చాత్తాపపడి ఒప్పుకొనవలసి వుంది. మారుమనస్సునొందిన ఒక హిందూ స్త్రీ, వేరొక స్థలం నుండి ఇక్కడ మనతో ఆరాధనలకు వస్తూ ఉండేది. ఆమె బస్సు చార్జీలే ఎనభై రూపాయలు అవుతాయి. ఆమె ఒక అద్దె ఇంటిలో వుంటూ రాత్రి పగలు ప్రార్థిస్తూ ఉండేది. దీనితో ఇంటి యజమానులు ఆమెను ఇల్లు ఖాళీ చేయించారు. ఆమె వెళ్లిపోయిన తర్వాత ఆ ఇంటిలో దొంగలు పడ్డారట; దానితో ఆ

యజమానులు ఆమె ఉంటే రాత్రి పగలు మేలుకొని ప్రార్ధిస్తూ ఒక సెక్యూరిటీ గార్డ్ లా ఉండేది, అయ్యో ఆమెను అనవసరం గా ఖాళీ చెయ్యించేశామే అని వాపోయారట! అబ్రాహాము ప్రార్ధన తో తన ఇంటిచుట్టూ కంచె వేసుకొనటం వల్ల అబీమెలెకు అతని భార్య అయినా శారా ను ముట్టలేకపోయాడు. కొందరు తమకు నచ్చే బోధ వుండే చర్చ్ లకు వెళ్తూవుంటారు; అయితే అక్కడ నీ కందే వాక్యము ఆత్మ సంబంధమైనదై వున్నదా? అక్కడ నీకు ఏమైనా ఆత్మ సంబంధమైన హెచ్చరికలు, సరైన సమయం లో లభిస్తున్నాయా? అక్కడి ప్రసంగాలు నిన్ను సాతాను యొక్క దాడుల నుండి ఏమైనా ఆపగలుగు తున్నాయా? నీకు అపాయము సంభవించక ముందే అక్కడ హెచ్చరికలు నువ్వు వినగలుగుతున్నావా?

కొంత మంది తమ కోడళ్ళు ఎంత కట్నం తెచ్చారో దానిని గురించి చెప్తూ ఉప్పొంగుతుంటారు. అయితే వారు దేవుని ప్రాకారమును ఏమైనా పట్టుకొని వచ్చారా? నీవు ఏ విషయాలకు ప్రాధాన్యత ఇస్తున్నావు? యిర్మీయా 15:20 లో యిర్మీయాను ఇత్తడి ప్రకారం వలె చేస్తాను అని చెపుతున్నాడు. నీవు దేవుని చిత్తం లో నడుస్తూ వున్నప్పుడు ఆయన సాతాను క్రియల పై నీకు

జయం అనుగ్రహిస్తాడు; అయితే పాపం నీలోకి ప్రవేశించే అనుమతి నీవు ఇచ్చినప్పుడు, ప్రకారపు గోడ పడిపోతుంది. . కీర్తనలు 51:18 లో - 'నీ కటాక్షముచొప్పున సీయోనుకు మేలుచేయుము. యెరూషలేము యొక్క గోడలను కట్టించుము.' అని దావీదు చెప్తున్నాడు. కొన్నిసార్లు సాతాను మన పిల్లలను చెర లోనికి కొనిపోతాడు. దావీదు పిల్లలు జారత్వము తోనూ, దుర్మార్గత తోనూ పట్టబడినప్పుడు, తన ఇంటి చుట్టూ తాను కట్టిన ప్రకారము లేకుండా కూలిపోయింది. నీ ఇంటిచుట్టూ వుండే అగ్ని గోడ (fire wall) ను నీవు నిర్మించ గలుగుతున్నావా? 'ప్రార్థన ప్రకారము ,' దాని స్థానం లోనే నిలిచి వుండేలా నీవు నీ ప్రార్థన జీవితాన్ని గురించి జాగ్రత్త తీసుకుంటున్నావా?

2 కొరింథీయులు 10:4 లో పరి. పౌలు - 'మా యుద్ధోపకరణములు శరీరసంబంధమైనవి కావుగాని, దేవుని యెదుట దుర్గములను పడద్రోయజాలినంత బలముగలవై యున్నవి.' అని చెప్తున్నాడు. మనలోకి పాపం ప్రవేశించినట్లయితే, సాతానును మనము జయించలేము. అమెరికా దేశం తన యుద్ధ సామర్థ్యాన్ని పెంచుకుంటూ ప్రపంచ

ఆధిపత్యం కోసం ముందుకు సాగుతున్నది. నీ గృహానికి చుట్టూ ' ప్రార్ధన కంచెను' వేసుకొనకుండా సాతానును నీవు ఎలా జయించగలవు? గృహానికి ప్రాకారములు లాగా తల్లితండ్రుల ప్రార్ధనలు వుండవలసి వుంది. కుటుంబం లోని సభ్యులందరినీ కాచుకునేందుకు తమ గృహాల చుట్టూ ప్రార్ధన ప్రాకారాలను వారు నిర్మించాల్సి వుంది. నీకు నువ్వే సాతాను తంత్రములను ఎదుర్కొనలేని వాడవై ఉంటే, సాతాను నిన్ను మాత్రమే కాదు, నీ కుటుంబాన్ని అంతా కబళించి వేస్తాడు. నీ కండ్లు, చెవులు, నోరు - ఆత్మ యొక్క ఆధీనం లో లేక పోతే, సాతాను నిన్ను ఇప్పటికే కబళించాడు. దేవుడు మనకు మన ఆత్మను, శరీరాన్ని, మనస్సును నియంత్రించుకొనగల శక్తిని అనుగ్రహిస్తాడు.

## 18.4 శ్రీమతి. పద్మా ఏబెల్ గారి ప్రసంగము

పాఠ్యంశము: న్యాయాధిపతులు **10: 1 – 18**

ఇశ్రాయేలు ప్రజలు ఐగుప్తు చెఱలో వున్నప్పుడు వారు ప్రభువుకు మొఱ్ఱపెట్టారు. ఆ సమయం లో దేవుడు వారిమొరను ఆలకించి మోషే ను, అతనికి సహాయం గా అహరోను ను ఇచ్చి, వారి ఆధ్వర్యం లో ఇశ్రాయేలీయులను అరణ్యం నుండి నడిపించాడు. ఒకానొక సమయం లో ఇశ్రాయేలు ప్రజలకు ముందు ఎఱ్ఱసముద్రము, వెనుక తమను తరుముచున్న ఐగుప్తు సైన్యం వుండింది. ఈ సమయం లో ఇశ్రాయేలు ప్రజలు మోషే కు విరోధం గా సణిగి "మమ్మల్ని చంపేందుకు ఇక్కడకు తీసుకు వచ్చావా?" అంటూ మోషే ను నిందించారు.

దేవుడు మనలను ఒక ఉద్దేశ్యం తో విడిపించాడు. ఒక విశ్వాసి జీవితం లో ప్రార్థన చాలా అవసరం; మనం ప్రార్థిస్తే దేవుడు మనకు సన్నిహితం గా ఉంటాడు. కొంతమంది విశ్వాసులు మృదువుగా సాగిపోయే జీవితాన్ని కోరుకుంటూ, విశ్వాస పరీక్షలను ఇశ్రాయేలు ప్రజల లాగా ఏ మాత్రం ఇష్టపడరు. ఏదో అరకొర ప్రార్థన చేస్తూ దినమంతా నిద్రించేవారిమి గా ఉంటే

సాతాను దాడులనుఎలా ఎదుర్కోగలము? మనవలెనే శోధించబడినప్పటికీ, యేసు క్రీస్తు, ప్రార్థన వలననే సాతానును జయించగలిగినాడు. మనం కూడా ఆయన వలెనే జయించే వారిమి గా ఉండాలి. ప్రార్థించే మనిషి యొక్క మనసాక్షి చాలా సున్నితం గా ఉంటుంది; చాలా చిన్నపొరపాటు కూడా అతనిని విశ్రాంతి లేకుండా చేసేది గా ఉంటుంది. మా ఇంటిలో పని చేసే పని పిల్ల వలన నేను కలవరపడ్డాను; తర్వాత - అది సాతాను క్రియ గా తెలుసుకున్నాను. నీవు ప్రభువు లో వుంటూ ఎదుగుతున్నప్పుడు, సాతాను నీ పొరుగు వారినో లేక మరెవరినో పురికొలిపి నీ కున్న శాంతిని పోగొట్టే ప్రయత్నం చేస్తాడు.

మోషే, ఇశ్రాయేలు ప్రజలను చాల దూరం నడిపించుకుంటూ తీసుకు వెళ్ళేటప్పుడు, దేవునిని అనేక విషయముల నిమిత్తమై అడిగి వాటిని పొందాడు. అయితే కొంత దూరం వారిని నడిపించిన తర్వాత ప్రజల ప్రవర్తన చూసి విసుకు చెందిన అతడు ఒక తప్పు చెయ్యటంతో, తాను వాగ్దదత్త దేశం లోనికి ప్రవేశించలేక పోయాడు. మోషే తో పోల్చుకుంటే మనం ఏపాటివారము? నిన్ను కలవరపరిచేది ఏమై వున్నది? - ఎవరో

నిన్ను గురించి చెడుగా ప్రచారం చేయటము గురించి నీవు నిరుత్సాహ పడేవాడివి గా వున్నావా? భయము తోనూ వణకు తోనూ నీ రక్షణ ను కొనసాగించు. మనము ఈ లోకాన్ని విడిచి వెళ్ళటం, లేక క్రీస్తు ప్రభువు ఈ లోకానికి తిరిగి రావటం లో ఏద్దైనా మొదటిగా జరుగ వచ్చు, మనకు ఏది మొదట జరుగనై యున్నదో తెలీదు.

ఒక వేళ నీవు ఫలానా ఫలానా వారు నా ఆత్మీయ దుస్థితి కి కారణం అని నువ్వు చెప్పవచ్చు; అయితే ఎవరి ఆత్మీయ దుస్థితికి మొదటి కారకులు వారే! ఎందుకంటే, నీ అనుమతి, చర్యలు లేకుండా నీ ఆత్మీయ స్థితిని ఏ ఒక్కరూ మార్చలేరు. మనం తప్పులు చేసి ఇతరులను నిందించేవారిమి గా ఉంటాము. నిర్గమకాండము 7: 5-6 లోమోషే, తనతో చెప్పబడినట్లు కర్రతో బండను కొట్టాడు. దేవుని చిత్తానుసారం గా మనము చెయ్యటం దీవెన నిస్తుంది. ఆయన చిత్తానుసారం గా తన నామము మహిమ పరచబడునిమిత్తము మనము అడిగే వాటిని ఆయన అనుగ్రహిస్తాడు. అయితే సంఖ్యాకాండము 20:8 లో దేవుడు నీళ్ళకొరకు బండతో మాట్లాడమని మోషేకు సెలవిచ్చినప్పుడు, మోషే రాతిని కొట్టటం జరిగింది. అక్కడ నీరు

అనుగ్రహించేది ఎవరు? మోషే నా? లేక దేవుడా? దానితో దేవుడు - 'మీరు ఇశ్రాయేలీయుల కన్నుల యెదుట నా పరిశుద్ధతను సన్మానించునట్లు నన్ను నమ్ము కొనకపోతిరి గనుక ఈ సమాజమును నేను వారికిచ్చిన దేశములోనికి మీరు తోడుకొని పోరు' అని చెప్పాడు.

కొంతమంది డబ్బు విషయం లో బహు బలహీనులు గా వుంటూ వుంటారు. కొంత మంది విశ్వాసులు ఒకరితో ఒకరు మాట్లాడలేరు, ఇంకా కొంతమంది హృదయాంతరంగము లో పగ వుంచుకొని బయటకు చాల చక్కగా మాట్లాడుతారు.

ఒక సారి ఒకానొకామె పొదగేసుకునేందుకు నన్ను నాటుకోడి గుడ్లు అడిగితే, పిల్లలు ఆమ్లెట్ వేసుకున్నారు అని చెప్పాను. అది కొంతవరకు సత్యమే, ఎందుకంటే పిల్లలు ఆమ్లెట్ వేసుకున్నది నిజమే; అయితే ఇంకా ఒకటి రెండు గుడ్లు మిగిలి వున్నాయి. ఆమెకు వాటిని ఇవ్వటం ఇష్టం లేని కారణం గా నేను ఆలా చెప్పాను. అయితే ఆ సాయంత్రం దేవుని సన్నిధి లోనికి వెళ్లిన నేను  ప్రార్థన చెయ్యలేక పోయాను; కారణం? సాక్షికంగా చెప్పినసత్యం! దేవుడు మన హృదయాంతరంగాలను చూస్తాడు.

బైబిల్ - అంతమువరకూ సహించిన వారు రక్షించబడతారని, జయించువానికి జీవ వృక్ష ఫలములు తినిపించబడతాయి అని చెప్తుంది.

ఈ మధ్య ఒక మంచి విశ్వాసిగా వుంటూ, మంచి సేవ కూడా చేసినట్లు చెప్పబడుతున్న ఒకామె చనిపోయినది అని విన్నాను. అయితే ఆ తర్వాత ఆమె దురాత్మ గా ఇతరులలో ప్రవేశించి బటయ పడుతూ, "నే నెవ్వరినో మీకు తెలీదా?" అంటూ ప్రశ్నిస్తున్నట్లు విన్నాను. ఎంత విచారకరమైన పరిస్థితి! మన మాటలను, గమనమును దేవుని సన్నిధి లో కూలంకషం గా పరిశీలించుకోవాలి.

అనేక మంది ఇశ్రాయేలీయులు వాగ్దత్త దేశానికి చేసే యాత్ర లో సణిగి నశించిపోయారు. మనము అంతము వరకూ నమ్మకంగా వుండి, సగం లో విడిచి వెళ్లిపోయేవారిమి గా వుండకూడదు. మా ఇద్దరు మగపిల్లలు వారి తండ్రి చనిపోయే సమయం లో ఆయనతో చివరి ఘడియ లలో వున్నారు. వారు - చివరి ఘడియలలో వాళ్ళ నాన్న నిద్ర పోలేకపోయినట్లు, అయితే - దేవుని బిడ్డలను, దూతలను ఆయన చూస్తూ, వారు పువ్వులూ, కిరీటాలు తెస్తున్నట్లు ఆయన చూస్తున్నట్లు, నాతో

చెప్పారు. నీవు ఏ విధమైన వ్యక్తి గా ఉంటున్నావు? నిన్ను హీనంగా చూసినవారికి కీడు కలగాలని ఆశిస్తున్నావా? అది దేవుని మనస్సు కాదు.

ఒకామె తనకు, తన పొరుగు ఆమెకు మధ్య జరిగిన విషయము లో బాధపడినందుకు మరుసటి ఉదయం అయిదు గంటల వరకూ నిద్ర పోలేక పోయినట్లు చెప్పింది. సున్నితమైన మనస్సు గలవారు మాత్రమే ఆలా వుంటారు; అందరూ కాదు. బైబిల్ - మీలో వున్నవాడు లోకం లో వున్నవాని కన్నా ఘనుడు అని సెలవిస్తున్నది. ఒక సున్నితమైన గ్రహింపు కల మనస్సు నిన్ను - దేవుని ఎదుట, మనుష్యుల ఎదుట నీ తప్పిదములను సరిచేసుకునేట్లు చెయ్యగలదు.

చివరిగా - సాతానుతో మనము చివరి వరకూ పోరాడాలి. ఆ దినాలలో దైవసేవకులైన బొల్లెద్దు జాన్ గారు తన మనుమనితో బయటకు వెళ్లారట! అక్కడ ఆ కుర్రవానికి రెండు గుంపులు కనిపించాయట - ఒకటి దేవదూతల గుంపు, రెండవది, సాతాను గుంపు. దానితో ఆ కుర్రవాడు కెవ్వున కేక వేసాడట. ఇంటికి తిరిగి వచ్చిన పిమ్మట జాన్ గారు స్నానం చేసి ప్రార్థన చేసుకొని పరుండి - అదేవిధముగా ప్రభువు సన్నిధి లోనికి చేరారట! చిన్న

చిన్న విషయాలను చివరి వరకూ పట్టుకొని వేలాడుతూ నీవు నీ ప్రయోజకత్వము ను పోగొట్టు కునే వాడివి గా వుంటున్నావా? సమాధానము ను పోగొట్టుకొనవద్దు. నీ యాత్రను చివరి వరకూ కొనసాగించి గురిని చేరేలా చూసుకో.

# 19

## కొందరి అభిప్రాయాలు

ఇప్పటివరకూ ఎబెల్ దంపతుల సొంత కుమార్తె గా వారిని గురించి నా అభిప్రాయాలు  పంచుకుంటు న్నాను, ఇప్పుడు ఇతరుల అభిప్రాయాలూ చూద్దాం -

### 19.1 రెవ. డా. విట్సన్ పాల్ గారు:

(ఈయన మా సంఘము లో సీనియర్ ఇవాంజిలిస్ట్ గా నున్న కీ. శే . ఎన్. డేనియల్ గారి అల్లుడు గారు)

ప్రభువు కోసం ఆత్మలు సంపాదించు నిమిత్తమై ఏబెల్ దంపతులు తమ జీవితములను ప్రభువుకు సమర్పించుకున్నారు. సువార్తను వారు దీనము గా పాకలలో ప్రారంభించి, ఆత్మలను సంపాదించు నిమిత్తమై ప్రయాసపడ్డారు. వారు సువార్తకు

సమర్పించుకునే ముందు తాము చేసే ఉద్యోగము లలో స్థిరపడివున్నట్లయితే, వారు డబ్బు సంపాదించకొని సౌఖ్యమైన జీవితాలు గడిపి వుండేవారు; అయితే వారు ప్రభువు నిమిత్తమైక్రమశిక్షణను నేర్చుకున్నారు. ఇతరులకు సేవచేయుటకు, వారిని ప్రభువు యొద్దకు నడిపించేందుకు, వారు వారి జీవితాలను ఖర్చుచేసుకున్నారు. .

ఏబెల్ గారికి వివాహం కాకముందు నుండి నేను ఆయనను ఎరుగుదును, మేమిద్దరమూ మంచి స్నేహితులం.మేమిద్దరమూ మాకున్న జయాపజయా లను ఒకరివి మరొకరితో పంచుకుంటూ వుండేవారిమి. ఏబెల్ గారి పరిశుద్ధపరచబడిన జీవితం తో చేసిన కొనసాగే సేవ నన్ను ప్రోత్సహించింది. ఆయన ఏకాంతంగా బాగా ప్రార్ధించే వ్యక్తి; దానిని బట్టి దేవుడు ఆయనను అభిషేకించి వాడుకున్నాడు. మచిలీపట్టణం లో ఆయన చేసిన సేవ ఎదిగి, ఆత్మ ఫలాలను ఇవ్వటాన్ని బట్టి నేను దేవునిని స్తుతిస్తున్నాను. ఏబెల్ గారు పరలోక పిలుపును అందుకున్న తర్వాత వారి సతీమణి ఆత్మీయ ఫలితమును సేకరించు నిమిత్తమై ప్రార్ధించి ప్రయాస పడినారు.

నా వివాహానికి కొంత ముందు ఏబెల్ దంపతుల వివాహం జరిగింది. పద్మా ఎబెల్ గారు అందమైన వినయ మనస్కురాలు. ఆమెను భార్యనుగా పొందినందు కు ఏబెల్ గారిని నేను ఆ నాడు అభినందించాను. ఎబెల్ దంపతులు ప్రేమ కలిగి, ఒకరినొకరు అర్థం చేసుకుంటూ ప్రార్థించే దంపతులు గా వున్నారు. పద్మా ఏబెల్ గారు క్రమశిక్షణ కలిగిన వ్యక్తి. ఏబెల్ దంపతులు ఇద్దరూ కూడా దేవుని రాజ్యము నిమిత్తమై తమ్ముకను తాము బాగా సిద్ధపర్చుకున్నారు. వారి యవ్వనదశ నుండి కూడా వారి జీవితాలు పాపం లోను, లోకం లోను వ్యర్థమైపోలేదు. వారి వలెనే మనమునూ - నిస్వార్థమై, దేవుని సేవకే అంకితం చేయబడిన జీవితాలను కలిగి ఆత్మీయ ఆశీస్సులు పొందునట్లు దేవుడు సహాయము చేయును గాక.

## 19.2 ఆర్. ఏ. సుందర్రావు గారు:

*(ఈయన ఎన్. దానియేలు గారి తోడల్లుడు గారు. మచిలీపట్టణం లోని నోబుల్ హై స్కూల్ కరెస్పాండెంట్ గా చేశారు.)*

ఏబెల్ గారు మొదటిగా ఈ మచిలీపట్నం లో అడుగిడినప్పుడు ప్రార్థన శక్తితో దురాత్మలను తరిమేశారు. సువార్త వ్యాపకం నిమ్మిత్తమై ఆయన కావలసిన తిండి, బట్టలూ, ద్రవ్యమూ

లేకుండా కష్టాలు పడవలసి వచ్చింది. ఆ దినాలలో ఒకే ఒక కుటుంబం ఆయనను తమ గృహం లోనికి ఆహ్వానించి అండగా నిలవటం తో ఆయన తన సేవను ప్రారంభించటం లో సఫలీకృతులయ్యారు. ఏబేల్ గారు ఈ పట్టణం లో ఈ విధం గా వాడబడటము అనాదిగా దేవుని సంకల్పమై వుంది.

1963 వ సంవత్సరం డిసెంబర్ నెలలో మా తోడల్లుడు కీ.. శే. ఎన్. దానియేలు గారు ప్రభువు సన్నిధిలోనికి వెళ్ళిపోయినప్పుడు, ఏబెల్ గారిని చెన్నై లో నాకు పరిచయం చెయ్యటం జరిగింది. నేను బందరు తిరిగి వచ్చిన తర్వాత ఏబెల్ గారు నన్ను ఇక్కడ కలుసుకొని తన ప్రేమ ను కనపరిచారు. దానియేలు గారు విద్యార్థిగా ఈ పట్టణం కోసం ప్రార్థిస్తే, ఏబెల్ గారు సేవను ప్రారంభించి, అభివృద్ధి చేసి, స్థిరపరిచారు. ఏబెల్ గారు వయస్సు లో నాకన్నా చాల చిన్నవారైనా ఆత్మీయంగా నాకు ఆయన కున్న స్థాయిలో నాకు సగం కూడా లేదు. ఈ దినమునకు కూడా వారు ప్రారంభించిన ఈ చర్చ్ ని ఆయన పేరుతోనే పిలుస్తారు. ఏబెల్ గారు యవ్వన విద్యార్థులైన వారిని లోతైన రక్షణానుభవం లోనికి నడిపిస్తూ వుండేవారు.

వారిని చికిత్స నిమిత్తం చెన్నై తీసుకు వెళ్లారని తెలిసి నేను చాలా ఆసక్తిగా ఆయన కోలుకొని తిరిగి వస్తారని ఎదురు చూస్తున్నప్పుడు, వారు ప్రభువు సన్నిధి లోనికి వెళ్లిపోయారు అని తెలిసినప్పుడు చాలా దిగ్భ్రాంతి చెందాను. ఆయన కేవలం యాభై రెండు సంవత్సరాలే జీవించినా చాల అర్థసహితమైన, మరియు దీవెనకరమైన జీవితం జీవించారు.

## 19.3 జీ. ఎస్. నాతనియేల్ గారు:

*(ఈయన కాకినాడ వాస్తవ్యులైన కీ. శే. జీ. ఏ. సమూయేలు గారి ప్రథమ పుత్రుడు. ఏబెల్ గారు మచిలీపట్టణం లోనికి మొదటిగా అడుగిడినప్పుడు, నతానియేలు దంపతులే వారిని తమ గృహం లోనికి చేర్చుకొని, ఆతిధ్యం ఇచ్చి మచిలీపట్నం లో ఏబెల్ గారి ద్వారా ప్రారంభించబడిన ఎల్ ఈ ఎఫ్ సేవను స్థిర పరిచేందుకు సహాయపడ్డారు.)*

దేవుని యొక్క ఉద్దేశ్యములు ఆశ్చర్యకరమైనవి, అద్భుతమైనవి. ఏబెల్ దంపతులు వివాహబంధం ద్వారా ఐఖ్య పరచ బడటం దేవుని చిత్తమని వారి జీవితాల ద్వారా తెలుస్తున్నది. దేవునికి పూర్తిగా తమ జీవితాలను సమర్పించుకునే వారిని దేవుడు దీవించి ఆశీర్వదిస్తాడు. ఏబెల్ దంపతులు ఇరువురూ కూడా తమ త్యాగము, విశ్వా సముల

ద్వారా అనేకమంది యవ్వనులనుప్రభువు వద్దకు నడిపించారు. దేవుడు వారికి అనేకమంది ఆత్మీయ బిడ్డలను అనుగ్రహించాడు. పెండ్లి అయిన మొదట్లో వారిరువురూ మా ఇంటి వద్దే మేమంతా కలసి జీవించటం మేమెన్నడూ మరచిపోలేము. మేము వారిని ఒక సహోదరునిగా, సహోదరిగా చూచాము. వారి ప్రేమను, సాన్నిహిత్యాన్ని, అభిమానాన్ని మేము ఎన్నడూ మరచిపోలేము.

ఆ తర్వాత, వారి కుటుంబం, మా కుటుంబం కొంత కాలం పక్క పక్క నే అద్దెకు వున్నప్పుడు, మా పిల్లలు వారి పిల్లలు కలసి ఆడుకున్న జ్ఞప్తికలు చిరస్మరణీయం, మరియు ఆహ్లాదకరమైనవి. మాకు అవసరతలో ప్రార్థన సలహాలను వారు ఇచ్చేవారు. కొన్ని సార్లు మేము ఇబ్బంది లోవున్నప్పుడు వెంటనే మా ఇంటికి వచ్చి ఓదార్చేవారు. వారి జీవితం లో ఎన్నో క్లిష్టమైన పరిస్థితులు ఎదుర్కొన్నప్పటికీ వారు ఏనాడు మాతో ఆ విషయాలు పంచుకోలేదు. ఆ అవసరతలు, పరీక్షలలో దేవుడు వారిని కాపాడి సహాయం చేస్తూ వారికి కావాల్సిన తర్ఫీదు నిచ్చాడు. .

## 19. 4 శ్రీమతి. పురుషోత్తం గారు:

*(పురుషోత్తం దంపతులు వుయ్యురు లో ఎల్ ఈ ఎఫ్ సేవను ప్రారంభించి కొనసాగించారు.)*

పద్మా ఏబెల్ గారు వయస్సు లో మాకైనా చిన్నవారైనా ఆత్మీయం గా మా కన్నా పెద్దవారు. ఆమె విశ్వాసం తో కూడిన ప్రార్ధనాపరురాలు. మనం ప్రార్ధించేటప్పుడు మన ప్రార్ధనలకు దేవుడు జవాబు ఇచ్చే వరకూ కొనసాగించాలి అని ఆమె చెప్తూవుండేవారు. ఆమె ఆ విధం గా ఎడతెగక ప్రార్ధించేవారు. మేము మా కుటుంబము నకు సంబంధించిన చిన్న చిన్న విషయాలు సహితం ఆమె యొక్క మద్దత్తు, ప్రార్ధన పూర్వకమైన సలహాల కోసం ఆమెతో పంచుకునే వారిమి. ఆమె బోధించిన ప్రకారము జీవించటం మేము గమనించాము. పేద, ధనిక అనే తారతమ్యం వారికి లేదు. ఆమె నా సొంత సోదరి వలె నాతో మాట్లాడుతూ సేవ లోని అనుభవాలు పంచుకుంటూ వుండేవారు.

## 19.5 జీ. డేవిడ్ గారు:

*(మా తల్లితండ్రుల సేవ తొలిదినాలలో రక్షణానుభవం లోనికి వచ్చిన వారిలో ఒకరు. విజయవాడ రైల్వే లో ఈయన పనిచేస్తూ వుండేవారు.)*

బందరు దగ్గరలోని చిట్టిగూడూరు మా స్వగ్రామం. 1960 నుండి నాకు ఏబెల్ దంపతులు పరిచయం. నేను ఒక హిందూ కుటుంబం నుండి వారి సేవలో రక్షణానుభవం లోనికి వచ్చాను. ఆ దినాలలో ఏబెల్ గారు మమ్మల్ని ఏకాంత ప్రార్థన జీవితం లో ఎదిగేలా శిక్షణ నిస్తున్నప్పుడు, పద్మా ఏబెల్ గారు మా చిన్న చిన్న అవసరాల గురించి ఆలోచిస్తూ వుండేవారు. ఆ దినాలలో మల్కాపట్నం పోస్టాఫీస్ పక్క వారున్న అద్దె ఇంటిలో ప్రార్థన కూటాలు జరుగుతూ ఉండేవి. ఆ దినాలలో జరిగిన వారి సేవ ద్వారా ఆశీర్వదింపబడిన వారిలో నేనొకడను. ఆ దినాలలో నా పని - ఆరాధనకు చాపలు పరచటం, ఆరాధన ముగినాక వాటిని చుట్టి పక్కన పెట్టటం. నేను నా సొంత తల్లితండ్రులను కోల్పోయినప్పటికీ ఏబెల్ దంపతులు వారి లేని వెలితిని నాకు తీర్చి నేను వివాహ జీవితం లో స్థిరపడేలా నన్ను వారి సొంత కుమారుని వలె నడిపించారు.

## 19.6 పుష్పరాజ్ గారు:

*(ఈయన నోబుల్ కళాశాల లో పని చేసి, ప్రభువు సన్నిధి లోనికి వెళ్లిపోయిన ఒక రిటైర్డ్ లెక్చరర్ గారు. ఆ దినాలలో వాక్య పరిచర్య లోనూ, చర్చ్ ఆరాధన లలోనూ, సన్డే స్కూల్ లోనూ, ఎల్ ఈ ఎఫ్ సంఘం లో సహాయ పడుతూ వుండేవారు.)*

ఈ స్థలము (బందరు) రాక మునుపు ఏబెల్ గారి గురించి నేను చాలా గొప్ప విషయాలు విన్నాను గానీ, ఇక్కడకు వచ్చిన తర్వాతే ఆయన ఒక దీనుడు, సాత్వికుడు అని, ఆత్మీయ వివేచన గల వారని తెలుసుకున్నాను. నా అంచనాలకు మించి ప్రేమ, జాగ్రత్త తీసుకునే గుణాలు ఆయనకు ఉండేవి. నేను ఆ దినాలలో కడప నుండి ఒక కొత్త వ్యక్తి గా ఇక్కడికి వచ్చినా, నా తల్లితండ్రులు కూడా తీసుకొనని 'జాగ్రత్త' వారు నన్ను గురించి తీసుకునే వారు. వారు కేవలం నా ఆత్మీయ అవసరాలే కాకుండా, శారీకర అవసరాల గురించి కూడా పూచీ తీసుకునే వారు. నేను ఎప్పుడు ఎక్కడ కనిపించినా నన్ను ప్రేమతోనూ ఆప్యాయత తోనూ పలుకరించి మాట్లాడేవారు. నేను ఒంటరిగా వున్నప్పుడు నన్ను ఒక కుటుంబీకునిగా చేసేందుకు ఆయన ఏంతో సహాయం చేశారు. మా సమస్యలన్నీ ఆయనతో మేము

పంచుకునే వారిమి. ఆయన ఇచ్చిన ప్రార్థనపూర్వకమైన సలహాలు మమ్మల్ని ఎంతో బలపరిచాయి. చివరి దినాలలో ఆయన నాకు చేసిన సహాయంను నేను ఎన్నడూ మర్చిపోలేను! అందరికీ అదే విధం గా ఆయన సహాయం చేసేవారు, అయితే ఖండించేటప్పుడు, బుద్ధి చెప్పవలసిన సమయం లో - చెప్పవలసిన రీతిలో చెప్తూ వుండేవారు.

## 19.7 జాన్ క్రిసోస్టమ్ గారు:

*(వీరు నా భర్త గారు, ఏబెల్ దంపతుల అల్లుడు గారు)*

పద్మా ఏబెల్ గారు నాకు అత్తగారైనప్పటికీ నన్ను సొంత కుమారునిలా చూసుకునేవారు; ఆమె నన్ను ప్రేమించి, నాయెడల భారం గలిగిన వారుగా నాకు అనేకమైన ప్రార్థనా సలహాల నిచ్చేవారు. ఆమె కేవలం ఒక ప్రసంగీకురాలు మాత్రమే కాదు గాని, దేవుని చిత్తాన్ని వివేచింపగల ఆత్మీయ పరిపక్వత గల స్త్రీ గా వుండేవారు. ఎన్నో విషయాలు నేను ఆమెను గురించి చెప్పగలిగినప్పటికీ కేవలం రెండు విషయాలు నేను ఇక్కడ ప్రస్తావిస్తాను: నా వివాహ విషయాన్ని దేవుని యొక్క సన్నిధి లో ఏంతో కనిపెట్టి, పెద్దవారిని సంప్రదించి, ప్రార్థనా పూర్వకం

గా నిర్ణయించారు. ఇక నాకు అస్సాము కు బదిలీ కాక ముందే ప్రార్థన పూర్వకం గానేను అక్కడికి వెళ్లనై యున్న విషయాన్ని ముందుగానే గుర్తించి తెలియ జేసారు. ప్రతి చిన్న చిన్న విషయాలలో సహా ఆమె దేవుని చిత్తం పై ఆధారపడుతూ దానిని తెలుసుకొని ఆలా చేసేందుకు శ్రద్ధ చూపేవారు. .

అనేక సార్లు నేను ఆమెను కన్నీటితో చూసినప్పుడు, మొదట్లో ఒక వేళ అది ఆమెకేమైనా కండ్ల సమస్య ఉన్నదేమో అని అనుకున్నాను; కానీ తర్వాత తెలిసింది: ఆమె ఎప్పుడూ భారం తోనూ కన్నీటి తోనూ దేవుని సన్నిధిలో ప్రార్థించేవారని! దైవసేవకులైన ఏబెల్ గారితో కలసి ప్రార్థనపూర్వకం గా సేవ చేసిన ఆమె, ఆయన ప్రభువు సన్నిధిలోనికి తీసుకొనబడిన తర్వాత ఆ సేవను నమ్మకం గా కొనసాగించారు. ఏబెల్ గారు లేకుండా ఈ సంవత్సరాలన్నీ ఆమె విశ్వాసం తోనూ, నిరీక్షణ తోనూ, ఆత్మీయ వివేచన తోనూ సేవను కొనసాగించారు. ఆమె జీవితం అనేకులకు ఆశీర్వాదం గా ఉంటుందని నా నమ్మకము.

## 19.8 జీ. జీవరత్నం గారు:

*(ఈయన నోబుల్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి రిటైర్ అయ్యారు.)*

మేము పక్కపక్కనే అద్దెకు నివాసం ఉంటున్న సమయం 1967 లో ఏబెల్ దంపతులను శ్రీమతి. అహల్యా నాతనియేల్ గారు నాకు మొదటిగా పరిచయం చేశారు. ఆర్గనైజ్డ్ చర్చ్ (లూథరన్ వంటి సంఘాలు) లలో పెరిగిన నేను మొదట్లో ఇక్కడ ప్రార్థన కూటాలకు హాజరయ్యేందుకు పెద్ద సుముఖత చూపలేదు. అయితే మా పట్ల ఏబెల్ దంపతుల భారాన్నిచూసినతర్వాత నేను ఇక్కడి ప్రార్థనలకు క్రమంగా హాజరు కావటం ప్రారంభించాను. నా యెడల అభిమానం, గౌరవం వారికి ఉండేది. క్రమంగా మా వ్యక్తిగత, కుటుంబ సమస్యలను వారి ప్రార్థనల నిమిత్తమై పంచుకోవటం ప్రారంభించాము. ఏబెల్ గారు హృదయమంతటితో కేవలం బోధించటమే కాదు గాని, బోధించిన దాని ప్రకారం జీవించేవారు. ఒకసారి ప్రార్థించి ఇది దేవుని చిత్తం అని తెలుసుకున్నా తర్వాత మరి ఎన్నటికీ వెనుకకు వెళ్లకుండా, ఒక వేళ పరిస్థితులు కఠినంగా మారుతున్నా సరే, దేవుని చిత్త ప్రకారం ముందుకే సాగే వారు. వారి కుటుంబ విషయాలన్నిటిలో

(పిల్లల చదువుల విషయం లో సహా) దేవుని చిత్తాని కనుగొని దాని ప్రకారమే వారు జీవించేవారు. ఏబెల్ గారు ఆత్మ లో ప్రార్ధించేవారు; పాడేవారు.

## 19. 9 ఏ. డేవిడ్ రాజు గారు:

*(ఈయన మా తల్లితండ్రులు సేవ ప్రారంభించిన తొలి దినాలలో వారి సేవలో బలపరచబడి, చాలా కలం గా పాస్టర్ గా పనిచేస్తూ వున్నారు.)*

ఏబెల్ గారిని నేను 1952 నుండి (అప్పటికి ఆయన ఇంకా పూర్తి సేవలోనికి రాలేదు) ఎరుగుదును. ఆయన ఎప్పుడూ ప్రార్థన లో గడుపుతూ, పెద్దవారిని, యవ్వనస్థులను దీనంగా, వారి పట్ల చాలా ప్రేమ, భారం కలిగి పలకరించేవారు. నా సొంత కుటుంబ సభ్యుల వలెనే ఆయన నన్ను ప్రేమించేవారు. ప్రభువు యెడల ఆయన కున్న ప్రేమ, దేవుని సన్నిధి లో ఆయన అనుభవించే ఆ ఆనందం వల్ల నేను బాగా ఆకర్షితుడనయ్యాను. ఆయన అనేక సార్లు అణకువతో, విరిగి నలిగిన హృదయం తో ప్రార్థించటం గమనించాను. సమయం ఎంత కాలం పట్టినా, ప్రజలను వారు లోతైన పశ్చాత్తాపము, రక్షణానుభవము లోనికి నడిపించేవారు. ఏబెల్ దంపతులు, ప్రజలను ఆత్మీయ పరిపక్వత లోనికి నడిపించటమే కాకుండా, వారు జీవితం లోనూ సరిగా స్థిరపడేలా

శ్రద్ధ తీసుకునే వారు. వారి ద్వారా రక్షణ లోనికి నడిపించబడిన వారు ఆత్మలో స్థిరులై, ప్రభువు నిమిత్తమై ఆత్మలు సంపాదించేవారుగా వుండేవారు.

## 19.10 టీ. ప్రభాకర్ రావు గారు:

*(ఈయన నోబుల్ కళాశాలలో లెక్చరర్ గా రిటైర్ అయిన తర్వాత, ప్రస్తుతం ఈయన మా తల్లితండ్రులు ప్రారంభించి న సేవను బందరు లో కొనసాగిస్తూ వున్నారు.)*

నేను 1963 లో విద్యార్థి గా మచిలీపట్టణం వచ్చాను, తల్లితండ్రులు లేని నన్ను ఏబెల్ దంపతులు వారి సొంత కుమారుడిలా చూసారు. నేను పోగొట్టుకున్న ప్రేమను, దేవుని కరుణ, కటాక్షము లను ఎబెల్ దంపతుల సేవలో పొందాను. బందరు లోని సంఘాలన్నిటితో ఏబెల్ దంపతులు స్నేహపూరితం గా వుండేవారు. వారు ధనాపేక్ష లేకుండా, అవసరతలో నున్నవారిని, పేదవారిని ప్రేమించి ఓదార్చేవారు. దేవుని సేవలో వారు విశ్వసించదగిన సేవకులు. మేము ఈ ప్రదేశానికి ఆరాధనల నిమిత్తమై వచ్చినప్పుడు, ప్రాంగణం లోని ప్రతి మూలనుండి ప్రార్థన వినిపిస్తూ ఉండేది. పద్మా ఏబెల్ గారు ప్రార్థనపరులు. ఏబెల్ దంపతులు మమ్మల్ని ప్రభువు లోనికి

నడిపిస్తూ వారి గృహాన్ని సహితం ప్రార్థన పూర్వకం గా కట్టుకోగలిగారు.

ఏబెల్ గారు పరలోక పిలుపు నొందినప్పుడు, పిల్లలు ఎవ్వరూ అప్పటికి స్థిరపడలేదు. అయితే పద్మా ఏబెల్ గారు ప్రార్థనపూర్వకం గా పరిస్థితులను ఎదుర్కొని ఎంతో ధైర్యం, విశ్వాసం చూపగలిగారు. ఆమె తన మనుమలు, మనుమరాలిని చూడగలిగారు. ఎబెల్ గారి పరలోక పిలుపు అనంతరం, మేము మా సమస్యలన్నీ ఆమె ప్రార్థన పూర్వక మైన సహాయం నిమిత్తం ఆమెతో పంచుకొంటూ వుండేవారిమి.

## 19.11 బి. నోబుల్ గారు:

*(ఈయన నోబుల్ కళాశాల మేనేజర్ గా పనిచేసేవారు)*

ఏబెల్ దంపతులకు నేను ఆత్మీయ కుమారుడను. మా మధ్య నున్న ఆత్మీయ బంధము చాలా గొప్పది, బలమైనది. ప్రభువును ఎరుగని వానిగా నేను బందరు కు విదార్థి గా వచ్చాను. అయితే నా పేదరికం లో కూడా ఏబెల్ దంపతులు నా పట్ల కనబరచిన ప్రేమను, నాపై తీసుకునే 'జాగ్రత్త' ను చూసిన తర్వాత ఈ ప్రదేశాన్ని నేను విడిచి వెళ్ళలేకపోయాను. ఏబెల్

గారు నన్ను ఆత్మీయ అనుభవం లోనికి నడిపించి, ఆత్మీయ సలహాలతో బలపరుస్తున్నప్పుడు, పద్మాఏబెల్ గారు మా ఇతరమైన అవసరతల గురించి జాగ్రత్త తీసుకునే వారు. వారి గృహం లో మేము సొంత పిల్లల లా తిరుగుతూ వుండేవారిమి; మమ్మల్ని వారు ఎన్నడూ సందేహించినవారు కారు. వారి సేవలో నేను రక్షణానుభవము లోనికి వచ్చిన తర్వాత, మా ఇంటిలోని అందరూ ఆ అనుభవము లోనికి రాగలిగారు. తల్లితండ్రుల వలె వారు నన్ను అన్ని విషయాలలో, మరి ముఖ్యం గా వుద్యోగం, వివాహం విషయాలలో ముందుండి నడిపించారు. నేను ఎప్పుడూ మా కుటుంబ విషయాలు అన్నీ ప్రార్థన సలహాల నిమిత్తం వారితో పంచుకుంటూ వుండేవారిమి.

## 19.12 డీ. పాల్ గారు:

*(ఈయన మా తల్లితండ్రుల సేవలో రక్షణానుభవం లోనికి వచ్చారు; హనుమాన్ జంక్షన్ లో సేవ చేస్తూ, స్కూల్ నడిపిస్తూ వున్నారు.)*

నేను ఒక గ్రామం నుండి ఈ స్థలానికి డిగ్రీ చదువుకునేందుకు వచ్చాను, అయితే ఏబెల్ దంపతుల ప్రేమ నన్ను ఈ లోకానికి బలి కాకుండా కాపాడింది. ఏబెల్ గారు నాకోసం ప్రార్థించి, నాకు వాక్యాన్ని నేర్పించారు. ఏబెల్ దంపతుల క్రియా జీవితం లో వారి

ప్రేమను నేను చూడకుండా వుంటే, దేవుని లో ఈ స్థిరత్వాన్ని నేను ఆ దినాలలో పొందియుండేవాడిని కాదు. నా చెల్లి కూడా ఇక్కడ వుండి చదువుకుంటూ వారి సేవలోనే దేవుని వెలుగు లోనికి రాగలిగింది. సాతాను నన్ను శోధించి లోకం లోనికి తిరిగి లాగివేసే ప్రయత్నం చేసిన సమయం లో, ఏబెల్ దంపతులు నా వివాహ విషయమై బాధ్యత తీసుకొని ప్రార్థన పూర్వకం గా నన్ను వివాహ జీవితం లోనికి నడిపించినందువల్ల నేను ఈ నాటికీ ప్రభువు లో స్థిరునిగా వుండగలిగాను.

## 19.13 బ్రదర్. యేసుపాదం గారు:

*(ఈయన ఒక ఉపాధ్యాయునిగా పనిచేసి, రిటైర్ అయ్యిన తర్వాత ప్రభువు సన్నిధి లోనికి వెళ్లిపోయారు.)*

ఏబెల్ దంపతులు నన్నూ, నా కుటుంబాన్ని, ప్రేమించి మా నిమిత్తం కన్నీటితో ప్రార్థించారు. మాకు వున్నా సమస్యల దృష్ట్యా, వారు మిగిలిన ఏ ఇతరులకైనా కార్చిన కన్నీటి కంటే ఎంతో అధికం గా మా కుటుంబ విషయమై కన్నీరు కార్చి ప్రార్థించారు.

మొదటిలో ఏబెల్ గారు ఎప్పుడు నన్ను కలిసినా దేవుని గురించి, ఆయన వాక్యాన్ని గురించి మాట్లాడుతూ వుండేవారు.

ఆ తర్వాత మా కుటుంబ సమస్యలు పెరిగి, నేను ఒక్కడిగా ఉండవలసిన సమయం లో ఒక తండ్రి కన్నా ఎక్కువగా ప్రేమించారు. వారి ప్రార్థనల ఫలితంగా మా ఇంటిలో ఎన్నో చేదు సంభవాలు జరుగకుండా దేవుడు కృప చూపాడు. వారి ప్రార్థనల వల్ల మేము పొందిన ఎన్నో మేలులలో ఒకటి: ఒకానొకసమయం లో నా ఒక్కతే కుమార్తె తీవ్రమైన అనారోగ్యం తో ఆసుపత్రి లో రోగిగా వున్నా సమయం లో,, దేవుడు వారి ప్రార్థనలను బట్టి ఆ పిల్లను ముట్టి స్వస్థపరిచారు. ఏబెల్ గారు ప్రభువు సన్నిధి లోనికి వెళ్లిపోయిన తర్వాత, పద్మా ఏబెల్ గారు నా కుమార్తె వివాహాన్ని నిర్ణయించి, స్థిరపరచటము లో ఎంతో శ్రద్ధ తీసుకున్నారు.

## 19.14 ఎల్. జయరాజ్ గారు:

*(ఈయన మా తల్లితండ్రుల సేవలో రక్షణానుభవం లోనికి వచ్చారు. APSRTC లో పని చేస్తూ ప్రభువు సేవలో సహాయ పడేవారు. రిటైర్ అయిపోయినతర్వాత, నాగాయలంక లో పూర్తి సేవలో వుంటున్నారు.)*

ఏబెల్ దంపతులు మాకు ఒక 'నాణానికి రెండుప్రక్కలు' లాటివారు! మేము ఈ స్థలానికి విద్యార్థులు గా వచ్చి ప్రార్థన కూటాలకు హాజరవ్వటం ప్రారంభించిన తర్వాత, మా

తల్లితండ్రులు, సొంతవారిని సహితం మేము మర్చిపోయాము. ఏబెల్ దంపతులు మా ఆత్మీయ అవసరతలే కాదు, ఇతర అవసరాలను గురించి కూడా జాగ్రత్త తీసుకుంటూ వుండేవారు. వారు ప్రభువు ను - వారి మనస్సు, హృదయం, ఆత్మ అంతటితో ప్రేమించేవారు అని నిస్సందేహం గా చెప్పగలము.

నేనిక్కడకు వచ్చినప్పుడల్లా వారు నన్ను గురించి, సేవను గురించి, నా కుటుంబ విషయాల గురించి మాట్లాడుతుండేవారు. తర్వాతికాలం లో నేను ఇక్కడకు ఎప్పుడైనా బోధించే పని మీద వచ్చినట్లయితే, ముందు వెళ్లి పద్మా ఏబెల్ గారితో ప్రార్థన చెయ్యించుకొని అప్పుడు బోధకు వచ్చేవాడిని. ఆమె ప్రార్థనల వలన నేను ఎన్నో సార్లు ఆత్మీయం గా పురికొల్ప బడ్డాను. నా వివాహ విషయం లో పద్మా ఏబెల్ గారు బాధ్యత తీసుకొని ప్రార్థన పూర్వకం గా విషయాలను నిర్ణయించారు.

## 19.15 బీ. సత్యనారాయణ గారు:

*(వీరు బందరు కు విద్యార్థి గా వచ్చి మా తల్లితండ్రుల సేవలో రక్షణానుభవం లోనికి వచ్చిన వారు.)*

నేను ఒక హిందూ విద్యార్థి గా ఈ పట్టణానికి వచ్చి ఇక్కడ ఏబెల్ దంపతుల సేవలో రక్షణానుభవం లోనికి వచ్చాను. పద్మా ఏబెల్ గారు నా విషయం ఏంతో శ్రద్ధ తీసుకుంటూ వుండేవారు. నేను ఒక్కొక్కసారి వారింట్లోనే టిఫిన్ చేసి కాలేజ్ కి వెళ్ళేవాడిని. ఒకానొకరోజు అనారోగ్యం గా ఉండటం తో ఆమె టిఫిన్ తయారు చేయలేకపోయారు. దానితో ఆమె, దీనితో టిఫిన్ చెయ్యి బాబు అని ఒక రూపాయి నాకు ఇచ్చారు. ఆ రూపాయి ఆమెకు ఇంటిపైకి పాకిన సొరపాదు కాసిన కాయను అమ్మటం వల్ల వచ్చిందట. నేను చాల సార్లు ఏబెల్ గారిని దిగబెట్టేందుకు బస్టాండ్ కు ఆయనను సైకిల్ పై తీసుకు వెళ్లి, ఆయన ను అక్కడ బస్సు ఎక్కించి సైకిల్ ఇంటికి తెచ్చేవాడిని. ఆయన అన్ని విషయాలలో చాలా జాగ్రత్త గా వుండే వారు; సైకిల్ కు ఎప్పుడూ తాళం వేసి ఉంచేవారు. యవ్వనస్థులం గా మేము ఒక్కొక్కసారి ఏ సైకిల్ కైనా తాళం వెయ్యకపోతే, ఆయనే వాటికి తాళం వేసేసి తాళం చెయ్యి ఆయన దగ్గర పెట్టుకొని మాకోసం ఉంచేవారు.

వారు అనేకమైన మా వ్యక్తిగత, కుటుంబ సమస్య లలో ఎంతో సహాయం చేశారు.

## 19.16 జీ. సుకాంత్:

*(ఈయన నతానియేల్ దంపతుల ప్రథమ కుమారుడు; రిటైర్ టీచర్ గా హైదరాబాద్ లో వుంటున్నారు.)*

ఏబెల్ గారి కుటుంబం, మా కుటుంబం రక్తసంబంధుల కన్నా చాలా సన్నిహితము గా పెరిగాము. నేను బాలుని గా వున్నప్పుడు ఏబెల్ దంపతుల వివాహానికి హాజరై, పూలమాలలు వేశాము. ఈ దినాలలో బోధించేవారు చాల మంది వున్నారు, కానీ బోధించే విధం గా తమ సొంత జీవితములలో జీవిస్తూ, చివరి వరకూ అలానే కొనసాగే ఏబెల్ దంపతుల వంటి వారిని కనుగొనటం బహు అరుదు. వారు చాల మాదిరి కరమైన దంపతులు. మేమంతా వారి సేవలో బహుగా ఆశీర్వదించబడ్డాము.